ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 20, నవంబరు 2025



సాగర్ నీటి పంపిణీలో వివక్ష

ఎగువ ప్రాంతానికి అధికంగా విడుదల

- తప్పుడు లెక్కలు చూపుతున్న అధికారులు
- ఒంగోలు బ్రాంచి కాలువకు తీరని అన్యాయం
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఆయకట్టు రైతులు
- పరిశీలించి చర్యలు తీసుకుంటాం : ఈఈ

సాగర్ నీటి పంపిణీలో వివక్ష కొనసాగుతోంది. అధికారులు ఉద్దేశ పూర్వకంగా ఎగువ ప్రాంతంలోని కాలువలకు అధిక నీరు విడుదల చేస్తూ తప్పుడు లెక్కలు చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చివరన ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువకు తీరని అన్యాయం జరుగుతోందని రైతులు అంటున్నారు. తక్కువగా నీరు విడుదల చేస్తుండటంతో మేజర్లు, మైనర్లకు అందడం లేదని వాపోతున్నారు. చివరి ఆయకట్టు భూముల్లో ఇంకా వరినాట్లు పూర్తి కాక ఇబ్బందులు పడుతున్న తరుణంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పమిడిపాడు బ్రాంచ్ కాలువకు అధికంగా విడుదలవుతున్న నీరు

దర్శి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలుకు (ప్రకాశం జిల్లా సరిహద్దు) 2,502 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. అందులో పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 415 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు 773 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారుల లెక్కల ప్రకారం వెల్లడవుతోంది. ఆ రెండు కాలువలకు అధిక నీరు విడుదల చేస్తున్నారని ఒంగోలు బ్రాంచ్ కాలువ (ఓబీసీ) పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు ఆరోపిస్తున్నారు. వాస్తవంగా పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 650 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తూ 450 క్యూసెకులు అన్నట్లు లెక్కలు చెబుతున్నారని విమర్శిస్తున్నారు. అనధికారికంగా 200 క్యూసెక్కుల నీరు అదనంగా పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

లెక్కలు చెప్పడం లేదు

సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు నుంచి 126వ మైలు వరకు ఉన్న మేజర్లకు, దర్శి బ్రాంచ్ కాలువ పరిధిలోని మేజర్లకు కూడా అధిక నీరు విడుదల చేస్తూ అధికారులు సక్రమంగా లెక్కలు చెప్పడం లేదు. దర్శి బ్రాంచ్ కాలువ హెడ్ వద్ద కొంతకాలంగా రీడింగ్ తీయడం నిలిపివేశారు. అక్కడ రీడింగ్ మీటర్ సక్రమంగా పనిచేయడం లేదని అధికారులు సాకులు చెబుతూ పక్కన పెట్టారు. ప్రస్తుతం పమిడిపాడు బ్రాంచ్ కాలువ వద్ద రీడింగ్ సక్రమంగా లేదని అందువలన తక్కువ నీరు విడుదల

మిగతా 6వ పేజీలో


పీబీసీలో నీటి రీడింగ్

ఓబీసీకి నీటి పరిమాణం పెంచుతాం

ఒంగోలు బ్రాంచ్ కాలువకు నీటి పరిమాణాన్ని పెంచుతామని దర్శి ఎన్ఎస్‌పీ ఈఈ విజయలక్ష్మి చెప్పారు. నీటి సరఫరాలో వివక్ష చూపుతున్నారని, ఎగువ ప్రాంతానికి అధికంగా విడుదల చేస్తున్నారని వస్తున్న విమర్శలపై ఆమె స్పందించారు. పంపిణీ అవుతున్న నీటి పరిమాణం లెక్కలను పరిశీలించి తేడాలు ఉంటే సరిచేస్తామన్నారు. పీబీసీకి అధిక నీరు విడుదల చేస్తున్నారని కొందరు రైతులు, నీటి సంఘాల అధ్యక్షులు తమకు ఫిర్యాదులు చేసిన మాట వాస్తవమేనని చెప్పారు. ఆ విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

కొంచెం మార్పు

- డీసీసీబీలో మూడో విడత విచారణ
- రుణాల మంజూరుపై విచారణాధికారి దృష్టి
- వెంట ఒక సహాయక అధికారితో రాక



ఒంగోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో సెక్షన్ 51 విచారణ మూడో విడత బుధవారం సాగింది. విచారణాధికారైన సహకారశాఖ అడిషనల్ కమిషనర్ గౌరీశంకర్ ఉదయం బ్యాంకుకు వచ్చి రుణ మంజూరులపై దృష్టి సారించారు. తొలి రెండు విడతలు తూతూమంత్రంగా విచారణ చేసిన ఆయన ఈ విడత కాస్తంత లోతుగానే పరిశీలన ప్రారంభించినట్లు సమాచారం. అంతేకాక తొలి రెండుసార్లు విచారణ ప్రక్రియలో తనకు సహాయకులుగా కమిషనర్ నియమించిన ఇద్దరు అధికారులు లేకుండా వచ్చిన ఆయన ఈసారి అందులో ఒక అధికారిని వెంట తెచ్చుకున్నారు. డీసీసీబీలో వైసీపీ ప్రభుత్వ కాలంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని కలెక్టర్ ఇచ్చిన నివేదికపై సెక్షన్ 51 విచారణకు ప్రభుత్వం ఆదేశించిన విషయం విదితమే. నాలుగు నెలల్లో విచారణ పూర్తిచేసి నివేదించాలని ఈ ఏడాది ఆగస్టు ఆఖరులో సహకారశాఖ అదనపు కమిషనర్ గౌరీశంకర్ (విచారణాధికారి)ను ఆఉత్తర్వుల్లో ఆదేశిస్తూ మరో ఇద్దరిని సహకారశాఖ

మిగతా 6వ పేజీలో

మెప్మాలో గోల్‌మాల్

- రూ.కోట్లు వదిలేసి లక్షలు పట్టారు..!
- నిన్నటి వరకు అవినీతికి అండదండలు
- నేడు కొత్తగా కేసుల పేరుతో బెదిరింపులు
- సంస్థలో అవినీతి బాగోతంపై అంతటా చర్చ
- 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో మల్లగుల్లాలు
- అవినీతి ఆర్పీలకు పోస్టులపైనా ఆరోపణలు



ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అడ్డగోలు దోపిడీ, అక్రమ వ్యవహారాలు నిత్యకృత్యమయ్యాయి. బోగస్ గ్రూపుల పేరుతో ఆర్పీలు దోచుకున్న సొమ్ముకు లెక్కాపత్రం లేకపోయినా కనీస చర్యలు కరువయ్యాయి. తాము మోసపోయామని బాధితులు బోరుమంటూ ఆ శాఖ అధికారికి విన్నవించినా విచారణ పేరుతో జాప్యం చేయడం షరామామూలైంది. ప్రత్యేకించి అవినీతికి పాల్పడిన వారికే ప్రాధాన్యం ఇచ్చి కీలక విధులు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. అలాగే వారి వద్ద భారీగా వసూళ్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అందుకు అవినీతికి పాల్పడిన ఆర్పీలను తిరిగి విధుల్లోకి తీసుకోవడమే నిదర్శనం. తాజాగా మెప్మా జిల్లా కార్యాలయంలో ఓ ఉద్యోగి తనకు తెలియకుండా రూ.4.45 లక్షల చెక్కును తీసుకెళ్లి డ్రా చేసుకున్నట్లు పీడీ శ్రీహరి ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏడాది కాలంగా తమకు న్యాయం చేయండి, తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసు కోండంటూ మొరపెట్టుకున్న బాధితుల గోడు ఆలకించని ఆయన నేడు రూ.4.45 లక్షలు గోల్‌మాల్ అయ్యాయంటూ గగ్గోలు పెట్టడం, ఆగమేఘాలపై కేసు నమోదు చేయించడం చర్చనీయాంశమైంది. అందిన సమాచారం మేరకు పీడీకి అత్యంత నమ్మకస్థుడిగా ఉన్న సునీల్ అనే ఉద్యోగి గతంలో ఆయనకు అన్ని విధాలా అండదండలు అందించినట్లు సమాచారం. వివిధ అంశాలలో ఆర్థిక లావాదేవీలు, అనధికార వసూళ్లకు అతనే మధ్యవర్తిగా ఉన్నట్లు తెలిసింది. అయితే ఇటీవల సునీల్ ఎండీ కార్యాలయానికి బదిలీ కావడం, అక్కడ పీడీ వ్యవహారాలపై ఒకటి రెండు విషయాలు చర్చకు రావడంతోనే విషయం కేసులు పెట్టే వరకూ వెళ్లిందన్న ప్రచారం నడుస్తోంది.

అవినీతి ఆర్పీలకు మళ్లీ ఉద్యోగాలు

గత వైసీపీ హయాంలో బోగస్ గ్రూపులు తయారు చేసి సుమారు రూ.42కోట్లు

మిగతా 6వ పేజీలో

ప్రభుత్వ కార్యాలయాల్లో నిధులు ఖర్చుచేయాలంటే కొన్ని నిబంధనలు, విధివిధానాలు ఉంటాయి. ఏ తేదీన, ఎందుకోసం వాడుతున్నారు అన్న వివరాలతో చెక్కు నంబరు రిజిస్టర్‌లో నమోదు చేయాలి. అలాగే ప్రొసీడింగ్స్ పూర్తయిన తర్వాత మాత్రమే చివరిగా పీడీ సంతకం చేయాల్సి ఉంది. అయితే ఇవేమీ జరగకుండా ముందుగానే పీడీ టేబుల్ డెస్క్‌లో ఖాళీ బ్యాంకు చెక్కులపై సంతకాలు చేసి ఉండటం అనుమానాలకు తావిస్తోంది. అయితే పీడీ తన సంతకాన్ని సునీల్ ఫోర్జరీ చేశాడని, దొంగతనానికి పాల్పడ్డారని కేసు నమోదు చేయించారు. ఆరోపణలు ఎదుర్కొంటూ పోలీసుల అదుపులో ఉన్న సునీల్ మాత్రం పీడీనే తనకు బ్యాంకు చెక్కు అందించి నగదు డ్రా చేయమన్నారని వెల్లడిస్తున్నారు. అయితే ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటుండగా, వాస్తవ పరిస్థితుల్లో ఖాళీ చెక్కులపై ముందస్తు సంతకాలు ఎలా చేశారు అనేది అనుమానంగా మారింది.

ఖాళీ చెక్కుల మీద సంతకాలపై అనుమానం



మర్రిపూడిలో రైతులకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ రాజాబాబు, మారిటైం బోర్డు చైర్మన్ సత్య

అన్నదాత ఖుషీభవ

కోలాహలంగా 'అన్నదాత సుఖీభవ' విడుదల

- జిల్లా అంతటా ఆర్ఎస్‌కే స్థాయిలో కార్యక్రమాలు
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సభల ప్రత్యక్ష ప్రసారం
- మర్రిపూడిలో పాల్గొన్న మంత్రి స్వామి, సత్య, కలెక్టర్
- ఇతరచోట్ల ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరు
- 2.68 లక్షల మంది రైతులకు రూ.180.36 కోట్లు జమ

ఒంగోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం అన్నదాతల్లో సంబరం కనిపించింది. రెండో విడత అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాల ద్వారా నగదు సాయం అందజేత కార్యక్రమం కోలాహలంగా సాగింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో గ్రామ స్థాయిలో ఉండే రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే)ల వద్ద ప్రత్యక్షంగా సభలు, సమావేశాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో లబ్ధిదారులైన రైతులు పాల్గొన్నారు. తమిళనాడులో ప్రధాని నరేంద్ర మోదీ, కడప జిల్లాలో సీఎం చంద్రబాబునాయుడు ఈ సందర్భంగా సభల్లో పాల్గొనగా వాటి ప్రత్యక్ష ప్రసారాన్ని ఆర్ఎస్‌కేలలో స్మార్ట్ టీవీల ద్వారా రైతులు ఉత్సాహంగా తిలకించారు. జిల్లాలో ఈ విడత 2.68 లక్షల మందికి రూ.180.36 కోట్ల నగదు వారివారి ఖాతాలకు జమ కావడం బుధవారం ప్రారంభమైంది. ఇదిలాఉండగా ఆర్ఎస్‌కే స్థాయిలో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేసినప్పటికీ నియోజకవర్గానికి ఒకచోట కార్యక్రమాలు, రైతులతో

మిగతా 6వ పేజీలో


గిద్దలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


వెలిగండ్ల సభలో మాట్లాడుతున్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర


తర్లుపాడులో రైతులకు డ్రోన్‌లను అందజేస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల


గురిజేపల్లిలో పొలంలో రైతులతో కలిసి భోజనం చేస్తున్న టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు


కురిచేడు మండలం పొట్లపాడులో రైతులకు నమూనా చెక్కును అందిస్తున్న టీడీపీ దర్శి ఇన్‌చార్జి లక్ష్మి


చిన్నారిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న యువకుడు

బిడ్డతో కాలువలోకి దూకిన తల్లి

- కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం
- కాపాడిన ఎస్ఐ మురళి

దర్శి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెడ్డిపల్లికి చెందిన వి.గోవిందమ్మ బిడ్డతో సాగర్ కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ సమయంలో అటువైపు వెళ్తున్న దర్శి ఎస్ఐ ఎం.మురళి గమనించారు. కొందరు వ్యక్తుల సహాయంతో బయటకు తీసి కాపాడారు. తల్లీబిడ్డను వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. భర్తతో విభేదాలు రావడంతో మనస్తాపానికి గురై గోవిందమ్మ ఈ చర్యకు పాల్పడినట్లు తెలిసింది. తల్లీబిడ్డను కాపాడిన ఎస్ఐను పలువురు అభినందించారు.



అగమ్యగోచరం

- ఇన్‌చార్జిని నియమించారు.. డిజిటల్ సిగ్నేచర్ విస్మరించారు
- సబ్ కలెక్టర్ బదిలీతో నిలిచిపోయిన బర్త్ సర్టిఫికెట్ల జారీ
- అపార్ గడువు దగ్గరపడటంతో విద్యార్థులకు అవస్థలు

మార్కాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సహదిత్ వెంకట్ త్రివినాగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం గత నెల 18న బదిలీ చేసింది. ఆయన 23వతేదీ వరకు మార్కాపురంలో విధుల్లో ఉన్నారు. తర్వాత బదిలీ అయిన స్థానానికి వెళ్లిపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు వెలిగొండ ప్రాజెక్టు కంభం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివరామిరెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. ఇన్‌చార్జిగా ఉన్న అధికారికి ఎఫ్ఏసీ ఇవ్వకపోవడంతో కొన్ని పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ప్రధానంగా విద్యార్థులకు సంబంధించిన బర్త్ సర్టిఫికెట్ల ఫైళ్లు నెలరోజులుగా నిలిచిపోయాయి. తహసీల్దార్ కార్యాలయాల నుంచి ఫైళ్లు వస్తున్నా ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌కు డిజిటల్ సిగ్నేచర్ లేకపోవడంతో ముందుకు కదలడం లేదు. ముఖ్యంగా విద్యార్థులకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక

మిగతా 6వ పేజీలో

నల్లమలలో భక్తి పరిమళాలు

- అటవీ శాఖ ఆధ్వర్యంలో ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనం
- పెరుగుతున్న భక్తులు.. పరిమితంగానే టికెట్లు

7

ప్రపంచస్థాయిలో కనిగిరి పేరు వినిపించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
- కేవీపల్లిలో జిల్లాస్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

7


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కొంచెం మార్పు

(5వ పేజీ తరువాయి)

ద్వితీయ, తృతీయ శ్రేణి అధికారులను సహాయకులుగా కమిషనర్ నియమించారు. తదనుగుణంగా సెప్టెంబరు 9, 10 తేదీల్లో తొలి విడత, అదే నెల 16వతేదీన రెండోసారి విచారణ చేశారు. అయితే ఆ రెండు విడతల్లోనూ లోతుగా పరిశీలన మాట అలా ఉంచి కనీస స్థాయిలో కూడా విచారణ చేయలేదని, ఒకరకంగా బ్యాంకులో అక్రమాలకు పాల్పడిన వారి కనుసన్నల్లో మొక్కుబడి తంతుగా పరిశీలన చేసి వెళ్లారన్న ఆరోపణలు అప్పుడే వచ్చాయి. అదే విషయాన్ని నాడు ఆంధ్రజ్యోతి కథనాలు ప్రచురించింది.

విచారణాధికారిని మార్చాలని ఫిర్యాదులు

విచారణాధికారి తీరుపైన ప్రభుత్వానికి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో ఫిర్యాదులు వెళ్లడంతోపాటు అతనిని మార్చాలని ఏకంగా కొందరు కోర్టును కూడా ఆశ్రయించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలోని డీసీసీబీలలో వైసీపీ హయాంలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై శాసనసభా సంఘం ఏర్పాటైంది. ఈనెల 3న సమావేశమైన ఆ కమిటీ పలు అంశాలపై కోరిన వివరణలతో సహకారశాఖ అధికారులు గందరగోళ పడుతున్నట్లు సమాచారం. దీంతో విచారణాధికారికి ప్రభుత్వం ఇచ్చిన గడువు కూడా ముగిసే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో గౌరీశంకర్ బుధవారం మరోసారి విచారణకు వచ్చారు. అయితే విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తొలి రెండు విడతలకు భిన్నంగా ఈసారి విచారణాధికారి వ్యవహరించారు. తొలుత కమిషనర్ నియమించిన ఇతర అధికారులు లేకుండా ఒక్కడే విచారణకు రాగా ఈసారి అందులో ఒకరైన జయరాజ్ అనే అధికారిని వెంట తీసుకువచ్చారు. అంతేకాక ఆ రెండు విడతల్లో కాలక్షేప చర్యలతో సాగిన ఆయన.. ఈసారి ఆరోపణలలో ప్రధానమైన రుణాల మంజూరు అంశంపై దృష్టి సారించారు. తనతో వచ్చిన సహకారశాఖ అధికారి జయరాజ్, బ్యాంకు సీఈవో, మరో ఒకరిద్దరు కీలక ఉద్యోగులతో మధ్యాహ్నం వరకు రుణ మంజూరు, వాటిలో చోటుచేసుకున్న అక్రమాల పరిశీలన వంటి అంశాలపైనే ఆయన సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం.

లబ్ధిదారులకు నోటీసులు.. ఆపై పరిశీలన

ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో బ్యాంకు ద్వారా ఇచ్చిన జగనన్న పాల వెల్లువ, జగనన్న తోడు, స్వయం సహాయక బృందాలు, జేఎల్‌జీ రుణాలు, ఇతర రైతులకు రుణాలు ఎంతెంత ఇచ్చారు? అన్ని అర్హులకే ఇచ్చారా, కాగితాలపై చూపేదానికి, క్షేత్రస్థాయిలో పరిస్థితి తేడాలు ఉన్నాయా? ఉంటే వాటిని గుర్తించడం ఎలా? వంటి అంశాలపై చర్చించిన ఆయన లబ్ధిదారులందరికీ నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. తద్వారా బోగస్ లబ్ధిదారులను గుర్తించవచ్చన్న అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. అలాగే సహకారశాఖలోని ఆడిటర్లను జిల్లాలోని వివిధ బ్యాంకు బ్రాంచిలకు పంపి నిబంధనల ప్రకారమే రుణాలు ఇచ్చారా? గడువులోపు చెల్లింపులు జరగని రుణాలకు సంబంధించి లీగల్‌గా చర్యలు తీసుకున్నారా..? తదితరాలు పరిశీలించి అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్న దానిపై దృష్టిసారించినట్లు సమాచారం. మొత్తం మీద తొలి రెండు సార్లు తూతూమంత్రంగా వ్యవహరించిన విచారణాధికారి ఈసారి కాస్తంత లోతుగానే వివిధ అంశాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఈ అక్రమాలలో భాగస్వామ్యులుగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నవారు ఒకింత ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. వారిలో ప్రస్తుతం బ్యాంకులో అనధికారికంగా పెత్తనం చేస్తున్నట్లు భావిస్తున్న ఉద్యోగులు కూడా ఉన్నట్లు సమాచారం.

మెప్మాలో గోల్‌మాల్

(5వ పేజీ తరువాయి)

దోచుకున్న వ్యవహారంపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించడంతో అప్పట్లో ఐదుగురు ఆర్పీలను విధుల నుంచి తొలగించారు. వారి లాగిన్‌లను నిలిపివేశారు. అయితే మూడు, నాలుగు నెలల క్రితం సదరు ఆర్పీలకు తిరిగి లాగిన్‌లు ఇవ్వడంపైనా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో ఆ శాఖ ఉన్నతాధికారికి భారీగానే ముడుపులు ముట్టాయని సమాచారం. మరోవైపు ఇటీవల కాలంలో మరికొన్ని బోగస్ గ్రూపులు తయారుకావడం, అదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడం కూడా ఆ శాఖ ఉన్నతాధికారి అనుకూలంగా మార్చుకున్నారు. పేపర్‌లో కథనం వచ్చింది, బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు, చర్యలు తప్పవని హెచ్చరిస్తూనే చేతివాటం చూపారని తెలిసింది. ఆపైన విచారణ ఏమీ లేకుండా సదరు అక్రమార్కులకు అండదండలు అందించినట్లు కొందరు ఆర్పీలు చెప్తున్నారు. ఇలా కోట్ల అవినీతిపై చర్యలకు వెనుకాడిన ఆయన ఇప్పుడు కేవలం రూ.4.45 లక్షలపై రాద్ధాంతం చేయడం, నిన్న మొన్నటివరకు గురుశిష్యులుగా ఉన్న వారు ఇప్పుడు కేసులు దాకా వెళ్లడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సాగునీటి పంపిణీలో వివక్ష

(5వ పేజీ తరువాయి)

అవుతున్నా అధిక నీరు సరఫరా అవుతున్నట్లు రీడింగ్‌లు చూపుతున్నాయని అక్కడి అధికారులు బుకాయిస్తున్నారు. దర్శి-2 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెలుగొండారెడ్డి, పలువురు నీటి సంఘాల అధ్యక్షులు ఎన్ఎస్‌పీ అధికారులకు నీటి పంపిణీలో జరుగుతున్న వివక్షపై ఫిర్యాదు చేశారు. ఆ సందర్భంగా అధికారులు రీడింగ్‌లలో తేడా ఉందని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. వాస్తవంగా పమిడిపాడు బ్రాంచ్ కాలువ హెడ్ వద్ద రీడింగ్‌లు సక్రమంగా ఉన్నాయని, అధికారులు ఉద్దేశపూర్వకంగానే వక్రీకరించి చెబుతున్నారని నీటి సంఘాల అధ్యక్షులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు సాగునీటి పంపిణీలో జరుగుతున్న వివక్షను పరిశీలించి చర్యలు తీసుకోవాలని, చివరి ప్రాంతాలకు సక్రమంగా నీరందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అగమ్యగోచరం

(5వ పేజీ తరువాయి)

గుర్తింపు కార్డును అపార్ వెబ్‌సైట్ ద్వారా అందజేస్తోంది. ఈ నెలాఖరు వరకే ఆ వెబ్‌సైట్‌కు గడువు ఉంది. ఆధార్ కార్డుల్లో తప్పుగా జన్మించిన తేదీ నమోదైన విద్యార్థులు సర్టిఫికెట్లు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అటు అధికారిని నియమించక, ఇటు ఎఫ్ఏసీ ఇవ్వకపోవడంతో బర్త్ సర్టిఫికెట్‌లే కాక పలు ధ్రువీకరణ పత్రాలు టేబుళ్లపై పేరుకుపోయాయి.

200 వరకు నిలిచిపోయిన బర్త్ సర్టిఫికెట్లు

మార్కాపురం డివిజన్‌లోని 13 మండలాల నుంచి రోజుకు కనీసం 5 నుంచి 10 వరకు బర్త్ సర్టిఫికెట్లు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వస్తుంటాయి. గతంలో ఆయా సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు అందేవిధంగా వెంటనే చర్యలు తీసుకునే వారు. బర్త్ సర్టిఫికెట్ల తహసీల్దార్ కార్యాలయం నుంచి వస్తే ఒక్కరోజులోనే పని అయ్యేది. కానీ గతనెల 23 నుంచి నేటి వరకు సుమారు 200 వరకు సర్టిఫికెట్లు ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డికి డిజిటల్ సిగ్నేచర్ లేకపోవడంతో నిలిచిపోయాయి.

అపార్ గడువు దగ్గరపడటంతోనే సమస్య

ప్రస్తుతం కేంద్రప్రభుత్వం విద్యార్థులకు అన్నిరకాల సదుపాయాలు కల్పించడం కోసం అపార్ అనే వెబ్‌సైట్ ద్వారా గుర్తింపు కార్డును ఇస్తోంది. దీన్ని పొందేందుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉంది. ప్రస్తుతం సాధారణంగా పాఠశాలలో చేరే విద్యార్థుల డేట్ ఆఫ్ బర్త్‌ను రికార్డుల్లో నమోదు చేస్తారు. కొంతమంది తల్లిదండ్రులు పాఠశాలలో నమోదు చేసే తేదీ కాకుండా ఆధార్ కార్డు పొందే సమయంలో పొరపాటున మరో తేదీ నమోదు చేయిస్తున్నారు. ఇలాంటి విద్యార్థులకు ప్రస్తుతం అపార్ ద్వారా కార్డు మంజూరు కావాలంటే సరైన ఆధార్ కార్డు ఉండాలి. ఆధార్ కార్డులో 18 సంవత్సరాలలోపు వారికి జన్మించిన తేదీని సరిచేయాలంటే తప్పకుండా బర్త్ సర్టిఫికెట్ కావాలి. పిల్లల బర్త్ సర్టిఫికెట్‌ల కోసం తల్లిదండ్రులు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న బర్త్ సర్టిఫికెట్లలో 90 శాతానికి పైగా విద్యార్థులవే. ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌కు ఎఫ్ఏసీ ఇస్తే డిజిటల్ సిగ్నేచర్ ద్వారా వెంటనే సమస్య పరిష్కారం అవుతుంది.

వెంటనే ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్‌కు ఎఫ్ఏసీ ఇస్తాం

చిన్నఓబులేసు, జిల్లా రెవెన్యూ అధికారి, ఒంగోలు

గత నెలలో మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. నూతన అధికారి వచ్చేవరకు ఇన్‌చార్జిగా శివరామిరెడ్డిని కలెక్టర్ నియమించారు. ప్రభుత్వం నూతన అధికారిని నియమిస్తుందని చూశాం. ప్రజల సమస్యల దృష్ట్యా త్వరలోనే ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌కు ఎఫ్ఏసీ ఇస్తాం. డిజిటల్ సిగ్నేచర్ వస్తే విద్యార్థుల సమస్య వెంటనే పరిష్కారం అవుతుంది.

అస్తవ్యస్తంగా నామ్ రోడ్డు నిర్మాణం

ఒక వైపు ఎత్తు.. మరో వైపు పల్లం

అదుపు తప్పుతున్న ద్విచక్ర వాహనాలు

తరచూ ప్రమాదాలు



అద్దంకిలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఎత్తు పల్లాలతో ఉన్న నామ్ రోడ్డు



అద్దంకిలోని ఎస్‌బీఐ(ఏబీబీ) వద్ద ఎత్తు పల్లాలుగా ఉన్న నామ్ రోడ్డు

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. నామ్ రోడ్డు నిర్మాణ సమయంలో విస్తరించకుండా గతంలో ఉన్న రోడ్డునే మొక్కుబడిగా అభివృద్ధి చేశారు. దీంతో పలు చోట్ల రోడ్డు దెబ్బతినటంతో తాత్కాలిక మరమ్మతులు చేయటం పరిపాటి గా మారింది. అయితే అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ నుంచి భవానీసెంటర్ వరకు పలు చోట్ల నామ్ రోడ్డు ఎత్తు పల్లాలుగా ఉంది. కొంతభాగం ఎత్తుగా ఉంటే మిగతా భాగం పల్లంగా ఉంది. దీంతో వెనుక ఏదైనా వాహనం వస్తుందని ద్విచక్ర వాహన చోదకుడు రోడ్డు మధ్యలో నుంచి పక్కకు జరిగితే మోటార్‌సైకిల్ అదుపు తప్పినట్లే. రోడ్డు వాలు ఉండటంతో మోటార్ సైకిల్ పక్కకు వెళ్లి అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అద్దంకి పట్టణంలో తరచూ జరుగుతున్న ద్విచక్ర వాహన చోదకుల ప్రమాదాలను పరిశీలిస్తే అదుపు తప్పి పడిపోతున్నవే అధికంగా ఉంటున్నాయి. ప్రతి రెండు, మూడు రోజులకొక ప్రమాదం జరుగుతూనే ఉంది. అయితే ప్రాణాపాయాలు తక్కువగా ఉంటున్నప్పటికి క్షత గాత్రులు మాత్రం పెద్ద సంఖ్యలోనే ఉంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డు ఎత్తు పల్లాలు లేకుండా పునర్‌నిర్మాణం చేసే విధంగా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

అన్నదాతకు ఆర్థిక భరోసా

- **ఖాతాల్లో నగదు జమతో రైతుల్లో ఆనందం**
- **ఎమ్మెల్యే ఏలూరి**

పర్చూరు/మార్టూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాలు వేలాది రైతు కుటుంబాలకు ఎంతగానో దోహదపడుతున్నాయని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం మార్టూరు మార్కెట్ యార్డ్‌లో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏలూరి రైతులతో కొంతసేపు ముచ్చటించారు. ముఖ్యమంత్రి తీసుకువచ్చిన అన్నదాత సుఖీభవ పథకం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. అనంతరం మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ప్రకృతి సేద్యం అవగాహన



బొమ్మనంపాడులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ ఎప్రాయం

స్టాల్స్‌ను ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. ప్రకృతి సేద్యం సిబ్బందితో మాట్లాడారు.

రైతులకు మినీ ట్రాక్టర్లు అందజేత

సబ్సిడీపై రైతులకు మినీ ట్రాక్టర్లను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అందజేశారు. రైతుతో కలసి మినీ ట్రాక్టర్‌ను నడిపి అన్నదాతల్లో జోష్ నింపారు. అలాగే పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు.

37,861 మంది రైతులకు లబ్ధి

రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు నియోజకవర్గంలో 37,861 మంది రైతులకు రూ.25.83 కోట్ల రూపాలయలు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ఈకార్యక్రమంలో పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి లవన్న, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏడీఏలు సుదర్శన్ రావు, ప్రవీణ, తహసీల్దార్ ప్రశాంతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి హనుమంతు నాయక్, మండలపార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సాగుకు ప్రోత్సాహం

అద్దంకి : వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం ద్వారా వారి బ్యాంక్ ఖాతాలలో డబ్బులు జమ చేస్తుందని ఏడీఏ ఎప్రాయం అన్నారు. మండలంలోని బొమ్మనంపాడు రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నిధులు జమ చేసే కార్యక్రమంను టీవీ లో అధికారులు, రైతులు వీక్షించారు. ఈ సందర్బంగా ఏఓ వెంకట కృష్ణ మాట్లాడుతూ మండలంలో 9.578 మంది రైతులకు 7 వేల రూపాయలు చొప్పున 6.64 కోట్ల రూపాయలు బ్యాంక్ ఖాతాలలో జమ అయ్యాయన్నారు. నాగులపాడు సొసైటీ అధ్యక్షుడు ఏనుగంటి వెంకటరామయ్య(బాబు), కామేపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా అద్దంకి నియోజకవర్గంలో 40,228 మంది రైతులకు 27.62 కోట్ల రూపాయలు బ్యాంక్ ఖాతాలలో జమ అయ్యాయి.

అన్నదాతలకు తోడ్పాటు

బోయినవారిపాలెం(చీరాల) : అన్నదాతలకు చేయూతనిచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా దృష్టిసారిస్తున్నట్లు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు చెప్పారు. బుధవారం



మార్టూరులో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

అన్నదాత సుఖీభవ రెండవ విడత నిధులు విడుదల కార్యక్రమాన్ని మండల పరిధిలోని బోయినవారిపాలెంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలో 7,368 మంది రైతులకు గాను రూ.4.60 కోట్లు నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో వెంటనే జమ జరిగినట్లు వివరించారు. వీరిలో చీరాల మండలంకు సంబంధించి 4,418 మంది రైతులకు గాను రూ.2.79 కోట్లు, వేటపాలెం మండలంకు సంబంధించి 2,950 మంది రైతులకు రూ.1.81 లక్షలు జమ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దనరావు, హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, ఎంపీవోలు సరిత, నిర్మలాదేవీ, తదితర రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చినగంజాంలో..

చినగంజాం : మండల పరిధిలోని 4,810 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా మూడు కోట్ల 15 లక్షల రూపాయిలు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.



బోయినవారిపాలెంలో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

శివాలయాల్లో కార్తీక మాస పూజలు

నేడు వేయి స్తంభాలగుడిలో అన్నాభిషేకం

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి):కార్తీక మాసం సందర్భంగా శివాలయాలలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని వేయిస్తంభాల గుడి, పాత శివాలయం, కమఠేశ్వరాలయంలలో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వరస్వామి, ధర్మవరంలో భీమలింగేశ్వరాలయంలలో ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాసం చివరి రోజు గురువారం అద్దంకి పట్టణంలోని వేయి స్తంభాల గుడిలో ఉదయం 8 గంటలకు నగరేశ్వరస్వామికి అన్నాభిషేకం వైభవంగా జరుగుతుందని పూజారి సత్యనారాయణ శర్మ తెలిపారు.



ధర్మవరంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం

ఇంకొల్లులో అయ్యప్పస్వామి నగరోత్సవం

కేరళ వాయిద్యాలతో అత్యంత వైభవంగా నిర్వహణ

ఇంకొల్లు,నవంబరు 19,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో అయప్పస్వామి నగరోత్సవం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇంకొల్లు అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి విగ్రహాన్ని స్థానిక శివాలయం నుంచి పర్చూరు రోడ్డు వైజంక్షన్ మీదగా ప్రధాన వీధులలో విద్యుత్ కాంతుల నడుమ కేరళ వాయిద్యాలతో అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.స్వాములకు భిక్ష నిర్వహించారు.అయ్యప్ప భజన,మహిళలతో నిర్వహించిన కోలాటం అలరించాయి.



అయ్యప్ప స్వామి విగ్రహంతో నగరోత్సవం నిర్వహిస్తున్న దీక్షాధారులు

దివ్యాంగ చిన్నారికి బూటు కాలు అందజేత

జాండ్రపేట(చీరాల), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అంగవైకల్యం గల చిన్నారులకు అన్ని విధాలుగా సహాయక చర్యలు అందిస్తున్నట్లు జిల్లా ఇన్‌క్ల్యూజివ్ ఎడ్యుకేషన్ అధికారి ఎం జ్యోత్స్న అన్నారు. మండల పరిధిలోని జాండ్రపేటకు చెందిన 11 ఏళ్ల చిన్నారి కోట వాసవీ అంగవైకల్యంతో ఇబ్బంది పడుతుండటంతో జ్యోత్స్న రూ.15 వేల సొంత నిధులతో బూటు కాలు అందజేశారు. అలాగే చదువుకునేందుకు కూడా సహకరిస్తానని చిన్నారి తండ్రి సంజీవరెడ్డికి చెప్పడంతో కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



చిన్నారికి బూటు కాలును అందిస్తున్న జిల్లా అధికారి జ్యోత్స్న

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీలు

చీరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యం నేరమని ఆ శాఖ అధికారులు చెప్పారు. బుధవారం చీరాల డివిజన్ పరిధిలో పలుచోట్ల పోల్ టు పోల్ తనిఖీలు జరిగాయి. ఈసందర్భంగా అదనపు లోడ్ వినియోగిస్తున్న వారి నుంచి రూ.2.95 లక్షలు, ఇతర కేసులకు సంబంధించి రూ.3.45 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఈ జాన్ థామస్, డీఈఈ హరిప్రసాదరావు, ఏఈలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు మృతి

మార్టూరు,నవంబరు19(ఆంధ్రజ్యోతి):పట్టణంలో తూర్పుబజారుకు చెందిన టీడీపీ నాయకుడు బాజిన సంజీవరావు (66) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్యఇద్దరు కుమారులు ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో ఆయన మండల టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు.బుధవారం ఆయన మృతదేహానికి పార్టీనాయకులు తొండెపు ఆదినారాయణ,షేక్ రజాక్, కామినేని జనార్దన్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని సీఐటీయూ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు కొండారెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్యభవన్‌లో బుధవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌ల ఉమ్మడి సమావేశం జరిగింది. అనంతరం విద్యుత్‌భవన్‌లో ఈఈ నల్లూరి మస్తాన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌ల నేతలు దాసరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వేలమూరిపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలమూరిపాడులో బుధవారం ఒంగోలు స్మార్ట్ విజన్ ఐ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి కంటి పరీక్షలు చేసి 30 మందికి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో గోపిచంద్, మాధవన్, సోమయ్య పాల్గొన్నారు.



అన్నదాత చెక్‌ను అందజేసేస్తున్న పీడీసీసీబీ చైర్మన్ సీతారామయ్య

రైతులు బాగుంటేనే దేశం సుభిక్షం

- **పీడీసీసీ బ్యాంకు చైర్మన్ సీతారామయ్య**

ఒంగోలు(రూరల్), నవంబరు19(ఆంధ్రజ్యోతి): రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం రెండో విడత కార్యక్రమం బుధవారం ఒంగోలు నగరం కొప్పోలులో జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ సీతారామయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్నాయని చెప్పారు. రైతులు ఆదాయం వచ్చే పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఒంగోలు మండలం పరిధిలో 5,111 మంది రైతులకు రూ.3.57 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రం రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు మొత్తం ఒక్కోరైతు ఖాతాలో రూ.7వేలు నగదు జమ అవుతుందన్నారు. ఒంగోలు నియోజకవర్గంలోని రైతుల ఖాతాల్లో రూ.6.15కోట్లు నగదును ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, కామేపల్లి శ్రీనివాసరావు, అర్బన్ తహసీల్దార్ పి.మధుసూదనరావు, ఏవోలు రమేష్‌బాబు, కిషోర్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

కల్లు దుకాణం యజమానిపై దాడి

ఒంగోలు క్రైం,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కల్లు దుకాణం ముందు మోటార్ సైకిల్ పార్కు చేయవద్దని అన్నందుకు యజమానిపై ఇద్దరు దాడి చేశారు. ఈ ఘటన స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో బుధవారం జరిగింది. కల్లు దుకాణం ముందు మోటార్ సైకిల్ పార్కు చేయవద్దని యజమాని యామవరపు ఆంజనేయులు చెప్పాడు. దీంతో మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు ఆగ్రహించి ఇటుకరాయితో ఆంజనేయులపై దాడి చేసి పరార్ అయ్యారు. ఆంజనేయులు రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఒంగోలు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- **వెలుగు పీడీ నారాయణ**

ఒంగోలు నగరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా తీసుకున్న శిక్షణ కార్యక్రమాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వెలుగు, డీఆర్‌డీఏ పీడీ నారాయణ పేర్కొన్నారు. సీడాప్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగుల సమావేశం స్థానిక భాగ్యనగర్‌లోని వెలుగు టీటీడీపీసీ భవనంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు ప్రభుత్వం అందించిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లాలో సీడాప్ ద్వారా నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారిలో 90 శాతం మందికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణ తీసుకుంటున్న వారికి సమావేశంలో యూనిఫాం పీడీ నారాయణ చేతుల మీదుగా అందజేశారు. సమావేశంలో జేడీఎ శ్రీనివాసులు, శిక్షకులు కె.శ్రీనివాసరావు, కేవీ.ప్రభాకరరావు, బి.అజయ్‌కుమార్, జాబ్స్ కోఆర్డినేటర్ హిమాంబి, వార్డెన్ టీవీ.పసన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జీహెచ్ఎస్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హైస్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు

టంగుటూరు (కొండపి), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-17 పోటీలకు మండలంలోని తూర్పునాయుడుపాలెం గవర్నమెంట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో కామని లక్ష్మీప్రసన్న, డి.స్నేహిత, ఎం.శ్యామ్‌కుమార్, అండర్-17 విభాగంలో బాపట్ల వర్షిత్, ఎం.త్రివేణి చోటుదక్కించుకున్నారు. మంగళవారం మైనంపాడులో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం స్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను హెచ్ఎం సుధారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నదాత ఖుషీభవ

(5వ పేజీ తరువాయి)

సభలను ఏర్పాటు చేసి కీలక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలోనూ నిర్వహించారు.

ట్రాక్టర్లతో ర్యాలీ, నేతల సందడి

కొండపి నియోజకవర్గస్థాయి కార్యక్రమాన్ని మర్రిపూడిలో ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామితోపాటు మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కలెక్టర్ రాజాబాబు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఇతర పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్రిపూడిలో ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి స్వామి, సత్యలు స్వయంగా ట్రాక్టర్లను నడిపి రైతులను మరింత ఉత్సాహపరిచారు. వెలిగండ్లలో జరిగిన కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు. గిద్దలూరు ఏఎంసీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అక్కడి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, తర్లుపాడులో జరిగిన కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వైపాలెం మండలం గురిజేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు, కురిచేడు మండలం పొట్లపాడులో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భాగస్వాములయ్యారు. అలాగే ఇతర ప్రాంతాల్లోనూ సంబరంగా కార్యక్రమం సాగింది.

నల్లమలలో భక్తి పరిమళాలు

- అటవీ శాఖ ఆధ్వర్యంలో ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనం
- పెరుగుతున్న భక్తులు.. పరిమితంగానే టికెట్లు
- రోజుకు 120 మందికి మాత్రమే అవకాశం



నల్లమలలో కొలువైన ఇష్టకామేశ్వరి దేవాలయం

పెద్దదోర్నాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పురాణ ఇతిహాసాల్లో అత్యంత ప్రఖ్యాతి గాంచిన పుణ్యక్షేత్రాల్లో శ్రీశైలం ఒకటి. భ్రమరాంబికా మల్లికార్జునులు కొలువైన ఈ ఆలయ పరిసర ప్రాంతాల్లో అనేక ప్రాచీన ఆలయాలు నల్లమలలో వెలిశాయి. ప్రముఖంగా అమ్మవారిగా లోతట్టు అటవీ ప్రాంతంలో కొలువైన ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనం భక్తులకు ప్రత్యేకం. పార్వతీ పరమేశ్వరుల ప్రతిరూపం ఇష్టకామేశ్వరిగా పేర్కొంటారు. అమ్మవారు చతుర్భుజాలు కలిగి రెండు చేతుల్లో తామర పుష్పం, ఒక చేతిలో రుద్రాక్షను, శివలింగాన్ని కలిగి ఉంటుంది. భక్తులు భక్తితో అమ్మవారి నుదుట తాకి బొట్టు పెట్టి తమ కోర్కెలు అమ్మవారికి చెబితే వెంటనే తీరుతాయని భక్తుల నమ్మకం. ఇక్కడ మరో ప్రత్యేకత ఉంది. చెంచు గిరిజనులు ఆలయ అర్చకులుగా ఉంటారు.

దర్శనం పరిమితం-ప్రయాణం ప్రత్యేకం

శ్రీశైలం - దోర్నాల ఘాట్ రోడ్డు నుంచి 20 కిలోమీటర్ల దూరంలో అభయారణ్యంలో నెలకొన్న ఇష్టకామేశ్వరి అమ్మవారు దర్శనం అంత తేలిక కాదు. దేవాలయానికి ఎవరంటే ఎవరు ఎప్పుడంటే అప్పుడు వెళ్లేందుకు అటవీ శాఖ అనుమతులు నిషేధం. వన్యప్రాణులు అధిక సంఖ్యల్లో నివశించే ఈ ప్రాంతంలో వాటి స్వేచ్ఛా జీవనానికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఉండేందుకు అటవీ శాఖా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రైవేటు వాహనాలను అనుమతించరు. ఆ శాఖ ఆధ్వర్యంలో జీపులను ఏర్పాటు చేసి రోజుకు పరిమితి సంఖ్యల్లో భక్తులను అమ్మవారి గుడికి తీసుకు వెళ్లి దర్శనం చేశాక, తిరిగి మళ్లీ తీసుకువస్తారు. టికెట్లు కూడా వారి ఆధ్వర్యంలోనే అందజేస్తారు. రోజుకు 120 టికెట్లు మాత్రమే అమ్మకాలు చేస్తారు. సాయంత్రం 4గంటలలోపే దర్శనం చేయిస్తారు. సాయంత్రం సమయంలో పులులు, ఎలుగు బంట్లు, జంతువులు సంచరించే అవకాశం ఉంది. ఈక్రమంలోనే జూలై, ఆగస్టు, సెప్టెంబరులో పూర్తిగా నిషేధం విధిస్తారు.



ఇష్టకామేశ్వరి మూలవిరాట్

టికెట్లు ముందురోజు అమ్మకాలు

శ్రీశైలం వెళ్లిన భక్తుల్లో ఎక్కువ మంది ఇష్టకామేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకోవాలని భావిస్తారు. దర్శనానికి వెళ్లే ముందు రోజే టికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. రోజుకు 120 మందికి మాత్రమే అవకాశం. అందులో 104 టికెట్లు మాత్రమే కౌంటరులో లభిస్తాయి. 16 టికెట్లు ఆన్‌లైన్‌లో పెడతారు. అవి ఎప్పుడో అమ్ముడవుతాయి. మనిషికి వెయ్యి రూపాయలు. జీపులో 8 మంది మాత్రమే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఆలయానికి వెళ్లాలంటే శ్రీశైలానికి 8 కిలోమీటర్ల దూరంలో శిఖరం వద్ద అటవీ శాఖ ఇష్టకామేశ్వరి జంగిల్ రైడ్ పేరుతో నెక్కంటి కార్యాలయంలో టికెట్లు ఇచ్చే కౌంటరు ఉంటుంది. ఉదయం 9 నుంచి 11గంటల వరకు టికెట్లు విక్రయిస్తారు. కరెంటు బుకింగ్ ద్వారా 104 టికెట్లను ఒక్కొక్కటి రూ.1,000 చొప్పున అమ్మకాలు చేస్తారు. మిగిలినవి ఎన్‌ఎస్‌టీఆర్.సీవో.ఇన్.వెబ్‌సైట్ ద్వారా విక్రయిస్తారు. దీంతో ఉదయమే 5గంటల నుంచే భక్తులు కౌంటర్ వద్ద క్యూ కడతారు. టికెట్లు అయిపోయాక మిగిలినవారు నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఇన్ సర్వీసు టీచర్ల దరఖాస్తులు తిరస్కృతి

ఒంగోలు విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు అనుమతిలేకుండా ఇన్‌సర్వీసు టీచర్ బీఈడీ ప్రవేశపరీక్ష రాసినందుకు ఆమె దరఖాస్తును పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం తిరస్కరించింది. ముండ్లమూరు మండలంలో పనిచేస్తున్న ఒక మహిళా టీచర్ ఇన్ సర్వీసులో బీఈడీ చదివేందుకు ప్రవేశ పరీక్ష రాసి బీఈడీ ప్రవేశ అనుమతికోసం పాఠశాల డైరెక్టర్‌కు దరఖాస్తు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల జీవో నెంబరు 342 ప్రకారం ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ టీచర్లకు ఇన్‌సర్వీసులో చదివేందుకు అవకాశం ఉంది. ఇతరులకు జీతనష్టం కింద చదువుకునేందుకు అవకాశం ఉంది. అయితే ఈ కోర్సులో ప్రవేశానికి ముందుగా డీఈవో అనుమతి తీసుకున్న తర్వాతే ప్రవేశ పరీక్ష రాయాలి. అయితే ఈ టీచర్ ఎటువంటి ముందస్తు అనుమతిలేకుండా ప్రవేశపరీక్ష రాయడంతో ఆమె దరఖాస్తును తిరస్కరించినట్లు డీఈవోకు తిప్పిపంపారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ డీఈవోను అదేశించారు.

29 నుంచి టీచర్లకు ఆటల పోటీలు

ఒంగోలు విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు మండల స్థాయినుంచి రాష్ట్ర స్థాయివరకు ఆటల పోటీలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పోటీల నిర్వహణకు నిధులు కేటాయించమంటూ పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌కు లేఖ రాశారు. పురుష టీచర్లకు క్రికెట్, మహిళా టీచర్లకు త్రోబాల పోటలు నిర్వహిస్తారు. ఉపాధ్యాయుల ఫిజికల్ ఫిట్‌నెస్, ఆరోగ్యం, ఒత్తిడిని జయించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. టీచర్లలో టీమ్ స్పిరిట్, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఐక్యమత్యాన్ని పెంపొందించి క్రీడానైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఒక వేదికను ఏర్పాటు చేయడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. టీచర్లకు ఈనెల 29, 30 తేదీలోల మండల స్థాయి, డిసెంబరు 13, 14 తేదీల్లో డివిజన్‌స్థాయిలో, 20 నుంచి మూడు రోజుల పాటు వచ్చే ఏడాది జనవరి 2 నుంచి 4 వరకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారు.

22లోపు సీజనల్ హాస్టళ్ల నిర్వహణకు దరఖాస్తులు

ఒంగోలు విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డిసెంబరు నుంచి ప్రారంభించనున్న సీజనల్ హాస్టళ్ల నిర్వహణకు అర్హులైన వారు ఈనెల 22లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోయిన తల్లిదండ్రుల పిల్లలు తమ నివాస ప్రాంతాల్లో చదువు కొనసాగించేందుకు వీలుగా కలెక్టర్ జిల్లాలో ఏడు సీజనల్ హాస్టళ్లను మంజూరు చేశారన్నారు. ఈ ఏడు సీజనల్ హాస్టళ్లలో 338 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటిని ప్రారంభించేందుకు అర్హులైన ఎన్‌జీవోలు, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో కోరారు. అర్హులైన వారు ఈనెల 22లోపు స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీజనల్ హాస్టళ్లకు సంబంధించి పూర్తి వివరాల కోసం 96050 32613 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

క్రీడల్లో కనిగిరి పేరు ప్రపంచస్థాయిలో వినిపించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- కేవీపల్లి హైస్కూల్‌లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కనిగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో కనిగిరిని ప్రపంచ స్థాయిలో నిలపాలన్నదే తన ఆకాంక్ష అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో బుధవారం కబడ్డీ పోటీలకు ఎంపిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. తాను 2009 నుంచి 2014 ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో కనిగిరిలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఆ పోటీల వల్ల కనిగిరి ప్రాంతం పేరు రాష్ట్రస్థాయిలో నిలిచిందని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థిలో ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ఆ దిశగా ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. ఇటీవల జరిగిన మహిళల క్రికెట్ పోటీల్లో గెలుపుకు కారణమైన శ్రీచరణి మనదేశం గర్వించదగ్గ క్రీడాకారిణిగా నిలిచిన విషయం ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, పీసీపల్లి మండల పార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, ప్రకాశంజిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ శిరీషాకుమారి, ఎంఈవోలు సంజీవి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కంచర్లవారిపల్లిలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఈనెల 22వ తేదీన 13 జిల్లాలకు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు జరగునున్నాయి. కనిగిరి, మార్కాపురం, ఒంగోలు, పర్చూరు డివిజన్ల పరిధిలోని వివిధ హైస్కూళ్లు, కళాశాలలకు చెందిన విద్యార్థులకు అండర్-14, 17 విభాగాలలో కబడ్డీ పోటీలకు ఎంపిక జరుగుతుంది.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి ఖోఖో జట్టులో విశ్వనాథపురం విద్యార్థులు

త్రిపురాంతకం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగే ఖోఖో పోటీలకు జిల్లా జట్టులో మండలంలోని విశ్వనాథపురం విద్యార్థులు ఎంపికయ్యారు. మార్కాపురంలో డివిజన్‌స్థాయి పోటీల్లో నెగ్గి మంగళవారం పాకలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో కూడా విజేతలుగా నిలిచారు. దీంతో అండర్-14 బాలికల విభాగంలో తువ్వదొడ్డి అమూల్య, బాలుర విభాగంలో రాగాల లక్ష్మీరంగా, అండర్-17 బాలికల విభాగంలో బి.నవీన ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పోలురాజు తెలిపారు. వీరికి ఎస్ఎంసీ చైర్మన్ వెంకట నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వృద్ధురాలి ఫిర్యాదుకు చలించిన ఎస్పీ

ఒంగోలు క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలు చేసిన ఫిర్యాదుతో ఎస్పీ చలించిపోయారు. ఈనెల 17 జరిగిన ప్రజాపరిష్కార వేదిక కార్యక్రమంలో 80 ఏళ్ల వృద్ధురాలు తన మనమడు, కోడలు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొనకొనమిట్ల మండలం నాగంపల్లికి చెదిన బూదాల మాణిక్యం ఎస్పీ వి.హర్షవర్ధనరాజును కలిసి ఫిర్యాదు చేసి కన్నీటిపర్యంతం అయ్యారు. దీంతో చలించిన ఎస్పీ వెంటనే పొదిలి సీఐ రాజేష్‌ను ఆదేశించారు. మాణిక్యం అలియాస్ మానెమ్మ సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు. సీఐ రాజేష్ కుమార్ మానెమ్మ ఇంటికి వెళ్లి అమె సమస్యలను అడిగి తెలిసుకున్నారు. అమె పేరుతో ఉన్న నాలుగు ఎకరాల భూమి అమె కౌలుకు ఇచ్చుకునే విధంగా అందుకు అడ్డుచెబుతున్న కుమారుడు శ్యాంసన్, మనమడు మెషాక్‌లను పిలిచి మాట్లాడారు. వృద్ధురాలిని ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మానెమ్మకు సొంత ఇంటిని ఏర్పాటు చేసేందుకు తహసీల్దార్‌తో సీఐ చర్చించారు.


దివ్యాంగులకు డ్రైవింగ్ లైసెన్సులు

- రేపు ప్రకాశం భవన్‌లోని పీజీఆర్ఎస్ హాలులో స్లాట్‌బుకింగ్

ఒంగోలు క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ అదేశాల మేరకు ఈనెల 21న స్థానిక ప్రకాశం భవన్‌లోని పీజీఆర్ఎస్ హాలులో అర్హులైన వారికి స్లాట్ బుకింగ్ చేయనున్నట్లు రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల పేర్కొన్నారు. దివ్యాంగులకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్, అధార్ కార్డు, అడ్రెస్ ప్రూఫ్, సదరన్ సర్టిఫికెట్, ఫారం1ఏలను తీసుకొని పీజీఆర్ఎస్ హాలులో హజరుకావాలని కోరారు. స్లాట్‌బుక్ చేసుకున్నవారికి ఈనెల 22న కంప్యూటర్ పరీక్ష ఉంటుందని తెలిపారు.

మర్రిపూడి పరిధిలోకి పృథులగిరి

మర్రిపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని మర్రిపూడి మండల దేవాదాయ సమేదాయంలో చేరుస్తూ ఉత్తర్వులు మంజూరు అయినట్లు మంత్రి స్వామి బుధవారం మర్రిపూడిలో జరిగిన బహిరంగ సభలో ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. పృథులగిరి అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలెక్టర్ రాజబాబు కృషితో రూ.4 కోట్ల డీఎంఎఫ్ నిధులు విడుదల అయ్యాయని, మంత్రి స్వామి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 26వ తేదీన ఘాట్‌రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు వెల్లడించారు. మరో రూ.3.50 లక్షలతో దేవాలయం పునర్‌నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.



పృథులగిరి దేవాలయం

జగదాంబకు అమావాస్య పూజలు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగదాంబ సమేత మార్కాండేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం అమావాస్య సందర్భంగా బుధవారం జగదాంబకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆంజనేయ శర్మ, వరుణ్ తేజ శర్మ జగదాంబ మార్కండేశ్వరులకు అర్చన, అలంకరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

మురుగుతో జలం కలుషితం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని చిన్న బ్రిడ్జి వద్ద చెరువుపై సప్లై చానల్‌పై ఒక వ్యక్తి ఏకంగా లెట్రిన్ గుంతను ఏర్పాటు చేశాడు. సప్లై చానల్‌పై ఆక్రమించి ఇంటి నిర్మాణం చేసిందే కాక ఏకంగా కాలువలోకి మలమూత్రాలు పోయే విధంగా నిర్మాణం చేశాడు. చెరువు సప్లై చానల్ ద్వారా మార్కాపురం చెరువుకు నిండుగా గుండ్లకమ్మ జలాలు వచ్చి చేరుతున్నాయి. ఇటువంటి నిర్మాణాల ద్వారా జలాలు కలుషితం అవుతున్నాయి.



సప్లై చానల్‌లో నిర్మించిన లెట్రిన్ గుంత

రైతు సంక్షేమానికి పెద్దపీట

- రైతు సంబర సభలో మంత్రి స్వామి

మర్రిపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమానికి ప్రజాప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి డాక్టర్ డోలాశ్రీబాలవీరాంజనేస్వామి చెప్పారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద మంగళవారం మండల కేంద్రమైన మర్రిపూడిలో జరిగిన నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో 46లక్షల మంది రైతులకు రూ.6,309 కోట్లు రెండు విడతల్లో విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లాలో 2లక్షల 68 వేల మంది రైతులకు రూ.361 కోట్ల నిధులు విడుదలయ్యాయని, కొండపి నియోజకవర్గంలో 36,880 మంది రైతులకు రూ.479 కోట్లు ఇప్పటివరకు విడుదల అయినట్లు చెప్పారు. వ్యవసాయాన్ని లభసాటిగా మార్చాలనే ఉద్దేశంతో రైతులకు రోటావేటర్లు, ట్రాక్టర్లు, డ్రైవాన్ స్ప్రెయర్లు వంటి వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. టంగుటూరు-పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారిని త్వరలో అభివృద్ధి చేసేందుకు ఉత్తర్వులు విడుదల అవుతాయని పొర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.39 కోట్లు నిధులు మంజూరు చేయిస్తే వైసీపీ పాలనలో పనులు చేయించలేక చేతులెత్తాశారని విమర్శించారు. కలెక్టర్ రాజబాబు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాన్ని లభసాటిగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని పేర్కొన్నారు. సాంప్రదాయ పంటలపై ఆధారపడకుండా ప్రపంచ మార్కెట్‌లో గిరాకీ ఉన్న పంట ఉత్పత్తులను పండించడంలో రైతులు శ్రద్ధ చూపాలన్నారు. మర్రిపూడి మండలంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నట్లు తనదృష్టికి వచ్చిందని, మంత్రి స్వామి, దామచర్ల సత్య సూచనల మేరకు జాయింట్ కలెక్టర్ ద్వారా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సాయశక్తుల కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ మారిటైం బోర్డు ద్వారా లక్షా 60 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందం కుదిరిందని తెలిపారు. మండలంలోని గుడ్లసముద్రంలో రిలయన్స్ తరహా సీజీయు పరిశ్రమ ఏర్పాటు కాబోతున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు బస్టాండ్ కూడలిలో ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీఎత్తన ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముందు భాగంలో మంత్రి స్వామితో కలిసి సత్య ట్రాక్టర్ నడుపుతూ శ్రేణులను ఉత్సాహ పరిచారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ప్రత్యేక డిప్యూటీ కలక్టర్ కళావతి, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ ఛైర్మన్ కర్లా తిరుపతమ్మ, ఎంపీపీ వెంకటరెడ్డి, నాయకులు ఎర్రమోతుల శ్రీనివాసులు, రేగుల వీరనారాయణ పాల్గొన్నారు.



ట్రాక్టర్ నడుపుతున్న సత్య, పక్కన మంత్రి స్వామి



కంభం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి

డిగ్రీ కాలేజీ నిర్మాణ స్థలం పరిశీలన

కంభం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కంభంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి పరిశీలించారు. కంభంలో 2007లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు కాగా చిన్న కంభం తదితర ప్రాంతాలలో స్థలాలను పరిశీలించిన అధికారులు విద్యార్థుల సౌకర్యాలకు అనుగుణంగా కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలు ఉన్న ప్రాంతంలోనే ఎకరా స్థలాన్ని డిగ్రీ కళాశాల నిర్మాణానికి కేటాయించారు. నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మించిన అదనపు గదులలో 2008 డిసెంబర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. తాత్కాలిక గదులలో అరకొర వసతులతోనే క్లాసులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి నిలపడంతో కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి కంభం డిగ్రీ కళాశాల నిర్మాణానికి కేటాయించిన సర్వే నెంబరు 171లో ఉన్న ఎకరా స్థలాన్ని, మ్యాప్‌ను పరిశీలించారు. నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు పంపుతున్నామని సబ్ కలెక్టర్ తెలిపారు. సబ్ కలెక్టర్ వెంట కంభం తహసీల్దార్ కిరణ్, ఆర్ఐ ఆంజనేయులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న చిక్కుడు మురళి

సీఎల్ఐఎస్‌సీ పరీక్షల్లో టాపర్‌గా మురళి

రాచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత డిసెంబర్ 2024 డిసెంబర్‌లో జరిగిన సర్టిఫికెట్ ఆఫ్ లైబ్రరీ ఇన్ఫర్‌మేషన్ సైన్స్ (సీఎల్ఐఎస్‌సీ) కోర్సులో రాచర్ల మండలం పలుగుంటిపల్లి గ్రామానికి చెందిన చిక్కుడు వెంకట మురళి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించి నిలిచారు. విజయవాడ పోతూరి నాగభూషణం గ్రంథాలయం, కళాశాల వారు ప్రతి సంవత్సరం సీఎల్ఐఎస్‌సీలో మంచి ఫలితాలు సాధించిన వారిని ప్రశంసా పత్రం, నగదు పురస్కారాన్ని అందజేసి సత్కరిస్తారు. అదేక్రమంలో ఈ సంవత్సరం చిక్కుడు మురళి అవార్డు అందుకున్నారు. విజయవాడ, బెంజ్ సర్కిల్, సర్వోత్తమ గ్రంథాలయంలో మంగళవారం విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కామినేని పట్టాభి రామయ్య చేతుల మీదుగా మురళికి ప్రశంసాపత్రం, నగదు పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీత చిక్కుడు మురళి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పేరు ప్రతిష్టలు రావటానికి కారణం గిద్దలూరు శ్రీ పాతాల నాగేశ్వర స్వామి దేవస్థానం ఈవో, మా చిన్నాన్న చిక్కుడు శ్రీనివాసులు అని, ఆయన సలహాలు సూచనల మేరకు నేను విజయం సాధించానని, ఆయనకు నా కృతజ్ఞతలను మురళి ఆనందం వ్యక్తం చేశారు.

22న అన్ని పంచాయతీల్లో గ్రామసభలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఈనెల 22వ తేదీన గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామసభల్లో కొత్త జాబ్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పనికోసం దరఖాస్తులు స్వీకరించడం, ఈకేవైసీ ప్రాసెస్ కారణంగా తొలించిన జాబ్ కార్డులను మళ్లీ పరిశీలించి పునరుద్ధరించడం వంటి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లోని ఉపాధి శ్రామికులు గ్రామసభల్లో పాల్గొని ఉపాధి పథకంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని జోసెఫ్‌కుమార్ అన్నారు.

నవోదయ హాల్‌టికెట్లు విడుదల

ఒంగోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్‌టికెట్లు విడుదల అయినట్లు నవోదయ విద్యాయల ప్రిన్సిపాల్ శివరాం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ ప్రవేశపరీక్ష డిసెంబరు 13వతేదీ జరుగుతుంది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసిన విద్యార్థులు హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

టీడీపీ ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(రూరల్), నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం ముక్తినూతలపాడు గ్రామంలో బుధవారం మొలకలపల్లి వెంకటేశ్వర్లు భార్య మొలకలపల్లి నారాయణమ్మకు రూ.5లక్షల టీడీపీ ప్రమాద బీమా చెక్కును తెలుగుదేశం పార్టీ నాయకులు అందజేశారు. టీడీపీ కార్యకర్త మొలకలపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయన భార్యకు పరిహారం చెక్కు ను అందించారు. కార్యక్రమంలో నాయకులు బండారు మదన్, కామేపల్లి శ్రీనివాసరావు, రామాంజనేయులు, రాయపాటి బాబురావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పురుషుల దినోత్సవం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న టీచర్లు, సిబ్బంది

చీమకుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పురుషుల దినోత్సవం బుధవారం చీమకుర్తిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో పురుష ఉపాధ్యాయులను వినూత్న రీతిలో మహిళా ఉపాధ్యాయినులు సత్కరించి బహుమతులు అందజేశారు. ప్రతి ఏటా మహిళాదినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నందున అదేరీతిలో పురుషుల దినోత్సవం నిర్వహణకు తాము శ్రీకారం చుట్టామని ఉపాధ్యాయినులు, కుకింగ్ ఏజెన్సీ మహిళలు తెలిపారు. హెచ్ఎం మోహన్, కృష్ణారెడ్డి తదితర ఉపాధ్యాయులను సత్కరించారు.

నిరుద్యోగులకు సైబర్ సెక్యూరిటీపై శిక్షణ

కొండపి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సెంటర్‌లో సైబర్ సెక్యూరిటీ అండ్ సోషల్ మీడియా అనలిటిక్స్ కోర్సులో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల శిక్షణతోపాటు ధ్రువీకరణ పత్రం, ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. 15 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు ఉన్న యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న వారు స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ ఎస్కే ఫిరోజ్, సెల్: 701395 0097ను సంప్రదించాలని కోరారు.

రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులు

మద్దిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నిధులు బుధవారం మండలంలోని రైతుల ఖాతాలలో జమ చేసినట్లు ఏవో జి.స్వర్ణలత తెలిపారు. బుధవారం సీతారాంపురం సచివాలయంలో నందిపాడు రైతులకు అన్నదాత సుఖీభవపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సంక్షేమ పథకాలు అందజేయడంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకుందన్నారు. అలాగే రైతులకు పంటల సాగులో కావాల్సిన సూచనలు, సలహాలు ఎప్పుడూ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరు మండలంలో..

పొన్నలూరు: పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత మండలంలోని రైతులకు 5.11 కోట్ల మేర లబ్ధి చేకూరింది. అవి వారి ఖాతాల్లో జమ అయ్యాయి. అందులో పీఎం కిసాన్‌కు సంబంధించి 6,499 మంది రైతులకు ఒక్కొక్కరికి 2,000 చొప్పున రూ.1.29 కోట్లు, అన్నదాత సుఖీభవకు సంబంధించి 7,645 మందికి ఒక్కొక్కరికి 5,000 చొప్పున 3.82 కోట్లు ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి వి.రాము తెలిపారు.

వైవీపై నిందలు వేయడం తగదు

● వైసీపీ ఒంగోలు ఇన్‌చార్జి రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిరంతరం దేవుని సేవలో ఉండే రాజ్యసభ సభ్యుడు వైవీ.సుబ్బారెడ్డిపై నిందలు వేయడం ఏమిటని వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ప్రశ్నించారు. ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైవీ.సుబ్బారెడ్డి రెండు దశాబ్దాల క్రితం నుంచే ఆలయాలకు సంబంధించి పలు కార్యక్రమాలు చేపట్టారన్నారు. టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శ్రీవాణిట్రస్టు ద్వారా అనేక ప్రాంతాల్లో ఆలయాలు నిర్మించి స్వామివారి ప్రతిష్టను పెంచారన్నారు. వైవీ నివాసంలో ఇప్పటికీ గోమాతను పూజిస్తారని తెలిపారు. ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందోని ఆరోపించారు. టీటీడీ సౌజన్యంతో అనేక హాస్పటల్స్‌ను కట్టించారన్నారు. కూటమి ప్రభుత్వం శ్రీవాణి ట్రస్టును ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేవీ.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కసుకుర్తి ఆదెన్న, కటారి శంకర్, కూనం గౌతమ్, మధు, దేవా, పిగిలి శ్రీనివాసరావు, తాత నాంచార్లు, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నిస్సహాయులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న బౌద్ధభిక్షువు

ఒంగోలు కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం సంతపేటలోని శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అనాథలకు అన్నదానం, నిస్సహాయులకు ఆర్థికసహాయం కార్యక్రమాలు జరిగాయి. శ్రీలంకకు చెందిన బౌద్ధభిక్షువు బౌద్ధహీన్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా ఆయన చేతులమీదుగా ఐదుగురు నిస్సహాయులకు రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శివం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బౌద్ధహీన్ మాట్లాడుతూ కులమత బేధం లేకుండా ప్రతి ఒక్కరూ సమాజంలో తోటి వారికి సహాయపడాలన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, మారెళ్ల సుబ్బారావు, కొల్లా మధు, తమ్మిశెట్టి రమాదేవి, కోసూరి శ్రీదేవి, చౌదరి, రాజ్యలక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు 'బొమ్మినేని' చేయూత



క్రీడాకారులకు దుస్తులు, పరికరాలను అందజేసిన రామాంజనేయులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు పంచాయతీ బొమ్మినేనివారిపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామ టీడీపీ నాయకుడు బొమ్మినేని రామాంజనేయులు క్రీడాదుస్తులు, క్రీడా పరికరాలను ఉచితంగా అందజేశారు. ఈనెల 22వ తేదీ నుంచి తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో బొమ్మినేనివారిపాలెం ఎంపీయూపీఎస్ విద్యార్థులకు బుధవారం గ్రామంలో బాల, బాలికల జట్లకు క్రీడా దుస్తులు, క్రీడా సామగ్రి అందించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర పోటీలలో విజేతలుగా నిలిచి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ వంకాయపాటి ప్రియాంక, కె.రాము, హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ తిరుమలశెట్టి రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురజాల ఎమ్మెల్యే పూజలు

త్రిపురాంతకం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): త్రిపురాంతకంలోని బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారిని బుధవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆయన అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈవో అనిల్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు.

మద్దిపాడులో పారిశుధ్యం అధ్వానం

● ఇబ్బందిపడుతున్న గ్రామస్థులు





జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డులో పడి ఉన్న చెత్తకుప్పలు, ఖాళీ స్థలంలో చెరువును తలపిస్తున్న మురుగు

మద్దిపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దిపాడులో పారిశుధ్య అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. డ్రైనేజీలు మురుగు కదలక దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దళితవాడలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకొని పోయి, మురుగునీరు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలు విజృంభించి రోగాలను వ్యాపింపజేస్తున్నాయి. స్థానిక నారాయణ స్కూల్ సమీపంలో వర్షపునీటితో చెరువును తలపిస్తోంది. ఆ ప్రాంతంలో వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై చెత్తకుప్పలు అంతటా దర్శనమిస్తున్నాయి. మురుగుకాలువల్లో బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వేయటం లేదు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి గ్రామంలో పారిశుధ్య మెరుగుదల కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల సంక్షేమం కోసం పాటుపడాలి

● బీజేపీ సెల్స్ రాష్ట్ర కో కన్వీనర్ సూర్యకల్యాణ్ చక్రవర్తి



లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ శివారెడ్డి, సూర్యకల్యాణచక్రవర్తిని సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు మెరుగైన సేవలు అందించాలని బీజేపీ సెల్స్ రాష్ట్ర కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన పీవీ.శివారెడ్డికి సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన సూర్యకల్యాణచక్రవర్తి మాట్లాడుతూ శివారెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడుగా చేసిన కృషికి ఫలితంగానే నేడు లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా అవకాశం దక్కిందన్నారు. ముమ్ముందు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ కోసం పనిచేసిన శివారెడ్డి సేవలను గుర్తించి ప్రభుత్వ నామినేటెడ్ పదవి కల్పించడం అభినందనీయమన్నారు. కార్మికుల సంక్షేమం కోసం పనిచేసి పార్టీకి, జిల్లాకు మంచిపేరుప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని కోరారు. మాజీ జిల్లా అధ్యక్షుడు పీవీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో చీమకుర్తితో పాటు ఒంగోలులో భారీగా కార్మికులు ఉన్నారని, వారి సంక్షేమం కోసం పాటుపడేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో పాటు జిల్లాలోని ఇతర ఎమ్మెల్యేలు, ఎంపీలకు, ఇతర నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రకరకాల వృత్తుల్లో ఉన్న కార్మికుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా శివారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు అమరసింహం, రాయపాటి అజయ్, సత్యవతి, ధనిశెట్టి రాము, దండు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాలలు రాజ్యాధికారం కోసం పోరాడాలి

● మాజీకేంద్రమంత్రి జేడీ.శీలం



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ.శీలం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాలలు రాజ్యాధికారం కోసం పోరాడాలని మాజీ కేంద్రమంత్రి జేడీ.శీలం పిలుపునిచ్చారు. బుధవారం ఒంగోలులోని అంబేద్కర్‌భవన్‌లో మాలల ఆత్మీయ సమావేశం జైభీం నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జేడీ.శీలం మాట్లాడుతూ మాలలు ఆర్థికంగా, సామాజికంగా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పర సహకారం అందించుకోవాలని కోరారు. అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ మాట్లాడుతూ మాలలపై అణిచివేత, దాడులు, బహిష్కరణలు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అందుకు ఈ ప్రభుత్వాలే కారణమన్నారు. ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.సుదర్శన్ మాట్లాడుతూ సమాజంలో మాల మహామేధావులు, జ్ఞానులుగా ఉన్నారని, అందువల్ల రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు దాసరి కోటేశ్వరరావు, ఎం.ఆదినారాయణ, పాలే కృపారావు, నత్తల ఆంజనేయులు, కృపారావు, లింగంగుంట రామలింగం, ఏకే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

● పలువురికి సత్కారం



మహిళలను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా దినోత్సవాన్ని ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ మహిళాభ్యుదయ సమితి, ప్రకాశం గ్లోబల్ ఎన్నారై ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్(పీజీఎన్ఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. ముందుగా వారు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అరుణ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మహిళలు అన్ని రంగాలలో పోటీతత్వంతో పనిచేస్తున్నారని, అయినప్పటికీ కొంత వివక్షత కొనసాగుతున్నదని చెప్పారు. ఉక్కుమహిళగా పేరొందిన ఇందిరాగాంధీ ఆదర్శప్రాయమని అన్నారు. అసిస్ట్ డైరెక్టర్ వడ్డెంపూడి సుజాత మాట్లాడుతూ ఇందిరాగాంధీ జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా జరుపకుంటామని, అదేరోజు వీరమహిళ ఝాన్సీలక్ష్మీబాయి జయంతి కూడా కావటం విశేషమని చెప్పారు. నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి స్త్రీ పురుషులిద్దరూ అవసరమని, జాతీయ మహిళా దినోత్సవం రోజునే అంతర్జాతీయ పురుషుల దినోత్సవం కూడా కావటం విశేషమని అన్నారు. అనంతరం విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు మారేపల్లి సూర్యకుమారి, ప్రముఖ ప్రవచనకారిణి లలితాశ్రీనివాస్‌లను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీజీఎన్ఎఫ్ ప్రతినిధి డాక్టర్ కొర్రపాటి సుధాకర్, డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ, మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ, కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, మహిళాభ్యుదయ సమితి కోశాధికారి బీరం అరుణ, కవి పిన్ని వెంకటేశ్వర్లు, మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ నివారణకు 'గోల్డెన్ అవర్' కీలకం

● రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ అశోక్



సదస్సులో పాల్గొన్న వైద్యులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్ నివారణకు గోల్డెన్ అవర్ అత్యంత కీలకమని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ వెల్లడించారు. బుధవారం స్థానిక జీజీహెచ్‌లోని న్యూరాలజీ విభాగంలో బ్రెయిన్ స్ట్రోక్‌లపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు, రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రికి వచ్చే రోగులను గోల్డెన్ అవర్‌లో కాపాడగలిగే నైపుణ్యం, వనరులను, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి, పేషెంట్ సాధారణ స్థితికి తీసుకురావాలని సూచించారు. అలాగే వైద్యులు, వైద్య సిబ్బంది నైపుణ్యత పెంచుకోవాలని, ప్రజల్లోనూ చైతన్యం తీసుకురావాలని చెప్పారు. అనంతరం బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీహరి, డాక్టర్ లక్ష్మీనరసింహస్వామి, డాక్టర్ శరత్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్, తిరుపతిరెడ్డి, పద్మ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

ఒంగోలు క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమం బుధవారం ఒంగోలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలపర్తి విజేష్‌రాజ్ మాట్లాడుతూ బ్యాంకులను జాతీయకరణ చేసి ప్రతిపేదవానికి బ్యాంకు సేవలను అదుబాటులోకి తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఇరిగినేని వెంకటనరసయ్య, సుధీర్‌వర్మ, గోరట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: స్థానిక నటరాజకళాకేంద్రంలో బుధవారం ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవరశెట్టి యలమందరావు, నేలటూరి సత్యనారాయణ, చుండూరి రంగారావు, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ చైర్మన్ నట్టే సుబ్బారావు, జె.శరత్‌బాబు, వెంకటేశ్వర్లు, జి.నరసింహారావు, ఆరి సూర్యనారాయణ, జి.కోటేశ్వరరావు, వెంకటసుబ్బయ్య, ఈమని సుబ్బారావు, కాకుమాను సుబ్బారావు, ఉండవల్లి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



మద్దిపాడులో నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అగ్రహారం రైల్వే గేటు వైపు రాకపోకల నిలిపివేత



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన రైల్వే అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అగ్రహారం రైల్వే గేటు వద్ద కొద్దిరోజులుగా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా రాకపోకలు నిలిపివేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఈమేరకు ఈనెల 25వ తేదీ నుంచి ఒంగోలు నగరంలోని సంతపేట వైపు నుంచి నుంచి పోతురాజుపాలెం, బత్తులవారికుంట, అరవ కాలనీ, అగ్రహారం, బాలాజీనగర్, చినమల్లేశ్వరకాలనీ తదితర ప్రాంతాలకు రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అయితే కొత్తపట్నం ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద నుంచి దక్షిణం వైపు వెళ్ళేలా మార్గం ఉందని, ఆ వైపు రాకపోకలు సాగించవచ్చని, ప్రజలు సహకరించాలని వారు కోరారు.

నూతన టీచర్లకు సెలవులు మంజూరు చేయాలి

ఒంగోలు విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నూతన ఉపాధ్యాయులకు లీవ్ యాప్‌లో సెలవులు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకట్రావు, ఎన్.లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు ఎ.అమ్మయ్య, రాష్ట్ర కార్యదర్శి కేవీజీ.కీర్తి, శ్రీనివాసులు, అశోక్‌కుమార్, పీవీ.సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. లీవ్‌యాప్‌లో సెలవులు కనిపించకపోవడం వల్ల కొంత మంది డీఈవోలు మంజూరు చేయకపోవడం వల్ల కొత్త ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : పీడీ



మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

మద్దిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం దొడ్డవరప్పాడు ఉపాధి హామీ గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటలతో పాటు రైతులకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఉపాధి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. తాగునీటి సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యత నివ్వాలని, ఉపాధి పనులు గుర్తించి పూర్తిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో ఆర్.ధనుంజయవర్మ, సీహెచ్.హనుమాన్, అరుణ, వైస్ సర్పంచ్ ముల్లారి మురళి, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

26న భారత రాజ్యాంగ దినోత్సవం

మద్దిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రంగాభవన్‌లో ఈ నెల 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు రైతు సంఘ నాయకులు చుండూరి రంగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ పరకాల ప్రభాకర్, విశ్రాంత న్యాయమూర్తి వి.నాగేశ్వరరావు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని, ప్రముఖ న్యాయవాది పంగులూరి గోవిందయ్య అధ్యతన ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

మరుగుదొడ్లను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలి : డీపీవో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీపీవో వెంకటేశ్వర్లు

ఒంగోలు(రూరల్), నవంబరు19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ప్రపంచ మరుగుదొడ్లదినోత్సవం వాల్‌పోస్టర్‌ను ఆయన విష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల గ్రామాల్లో తప్పకుండా మరుగుదొడ్లు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి ఇంటకి మరుగుదొడ్డి ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖరరావు, జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు

ఒంగోలు విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ బాలుర హైస్కూలులో జరుగుతున్న టీచ్ టూవ్ శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈవో టి.కిషోర్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేస్తూ విద్యార్థులకు మరింత మెరుగ్గా బోధించాలన్నారు సాంకేతికతను అందిపుచ్చుకునేలా తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎంబిఎస్ కో ఆర్డినేటర్ ఎం.బాలరత్నం, జీసీడీవో హేమలత, టీచర్లు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

టంగుటూరు (కొండపి), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణకు అందరూ పాటుపడాలని బాలల సంరక్షణ జిల్లా అధికారి పి.దినేష్ కుమార్ కోరారు. బుధవారం కొణిజేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, పిల్లల అక్రమ రవాణా నిరోధం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారావు, కౌన్సిలర్ కుమారి, పి.అనిత, ఎస్.వీ రాంజనేయులు, ఎ.సమాధానం, శామ్యూల్‌రాజ్, ఎ.దేవకుమారి పాల్గొన్నారు.

మందుబాబులకు కౌన్సెలింగ్

● వ్యర్థాలను వారితోనే తీయించిన ఎస్సై

టంగుటూరు (కొండపి), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ ప్రదేశాలు, పొలాలు, కూడళ్లలో మద్యం తాగి వ్యర్థాలను వదిలేసి వెళ్లే వారిపై చర్యలు తీసుకుంటామని టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరు సమీపంలోని రాగయ్య కుంట వద్ద మద్యం తాగుతున్న పలువురిని అదుపులోకి తీసుకొని వారితోనే మద్యం తాగి పడేసిన వ్యర్థాలను పోగుచేయించి తొలగింపజేశారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సాయంత్రం వాహనాలను ఎస్సై తనిఖీ చేశారు.

రైతులకు అండ అన్నదాత సుఖీభవ


అన్నదాత సుఖీభవ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


అన్నదాత సుఖీభవ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల


రైతులతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

- సంక్షేమం, అభివృద్ధితోనే సుపరిపాలన
- నియోజకవర్గంలో 37,649 మంది రైతులకు

చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధితోనే సుపరిపాలన అందిస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ 2వ విడత పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని నియోజకవర్గంలోని 37,649 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5వేల చొప్పున రూ.18.82కోట్లను చెక్కును పంపిణీ చేశారు. పీఎం కిసాన్ ద్వారా 32,762 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున రూ.6.55 కోట్ల మొత్తం కలిపి నియోజకవర్గంలో రూ.25.38కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తూ అందుకు సంబంధించి చెక్కును రైతులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ భూ యజమానులతోపాటు కౌలు రైతులకు కూడా ఈపథకం అందజేస్తున్నట్లు చెప్పారు. గత ఆగస్టులో మొదటి విడత, ఇప్పుడు 2వ విడత నగదును అందించి రైతులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అన్నదాతల శ్రమే రాష్ట్రానికి ఆర్థిక బలమన్నారు. రైతులు కూడా సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని, తద్వారా పంట దిగుబడితోపాటు ఆర్థిక రాబడి బాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి, గిద్దలూరు, కంభం మార్కెట్‌యార్డు ఛైర్మన్లు బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఎంపిడిఒ సీతారామయ్య, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే కందుల

తర్లుపాడు : రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. తర్లుపాడు సచివాలయంలో అన్నదాత సుఖీవ చెక్కు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికి రైతు సంక్షేమమే ధ్యేయంగా పథకాలను అమలు చేస్తోందన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో 32,965 రైతులకు రూ.22కోట్ల30లక్షల నగదును రైతుల అకౌంట్‌లో జమ అయినట్లు తెలిపారు. మార్కాపురం మండలంలో 9,278 మంది రైతులకు రూ.6కోట్ల 20లక్షలు, కొనకనమిట్ల మండలానికి 9,061 మంది రైతులకు రూ.6కోట్ల13లక్షలు, పొదిలి మండలానికి 8,436 మందికి రూ.5కోట్ల74లక్షలు, తర్లుపాడు మండలానికి 6,190 మంది రైతులకు రూ.4కోట్ల 22లక్షలు నిధులను రైతుల అకౌంట్లలో జమ అవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వైసీపీ నాయకులు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో వైసీపీ ఊరూరా తిరగడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం మంచి పనులు చేస్తుంటే వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే దాదాపు 50 కిలో మీటర్లు ఉండాల్సిందని, కానీ వైసీపీ నాయకుల స్వార్థంతో వారి స్వలాభం కోసం దానిని 3 కిలోమీటర్లు మాత్రమే పరిమితం చేశారన్నారు. 1 ఎకరం గ్రీన్‌ఫీల్డ్ హైవే ఉంటే రూ.50 లక్షలు పైగా ధర పలుకుతుందన్నారు. మార్కాపురాన్ని జిల్లా చేయకుండా నిర్లక్ష్యంగా చేయడంతోపాటు వెలిగొండను గాలికొదిలేశారన్నారు. త్వరలో తుఫాన్‌కు దెబ్బతిన్న 8,500 ఎకరాల పంటలకు నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. అనంతరం రైతులకు మంజూరైన 2 పంట డ్రోన్‌లను, పిచికారీ యంత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ బాలాజీ నాయక్, తహసీల్దార్ కేకే.కిషోర్ కుమార్, ఎంపీడీవో బి.చంద్రశేఖర్, నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారి రమేష్, మార్కాపురం ఏఎంసీ ఛైర్మన్ మాలపాటి వెంకట్, మార్కాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపరెడ్డి, మార్కాపురం, తర్లుపాడు సొసైటీ ఛైర్మన్లు వెంకటేశ్వర రెడ్డి, వెలుగు కాంత్రికుమార్, టీడీపీ నాయకులు కంచర్ల కాశయ్య, కాలంగి శ్రీనివాసులు, గోపినాథ్ చౌదరి, మేకల వెంకట్ పాల్గొన్నారు.

39,274 మంది రైతులకు రూ.26.29కోట్ల లబ్ధి

- టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు
- గురిజేపల్లిలో రైతులతో కలిసి ప్రత్యక్షప్రసారం వీక్షణ

ఎర్రగొండపాలెం రూరల్ : అన్నదాతకు అండగా ఉండేందుకు, పంట సాయం చేసేందుకు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ప్రజా ప్రభు త్వం వచ్చాక రెండో విడత అన్నదాత సుఖీభవ కింద రూ.5వేలు, కేంద్ర సాయం రూ.2వేల నగదును రైతులకు జమచేసిందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. ఇటు రైతులతోపాటు అటు నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 39,274 మంది రైతులకు రూ.26.29కోట్ల నగదు జమ అయిందన్నారు. తమిళనాడులో ప్రధాని మోదీ, కడపలో సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని ఎరిక్షన్‌బాబు రైతులతో కలిసి వీక్షించారు. ముందుగా సమీప పంట పొలాలను వ్యవసాయాధికారులు, నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. అక్కడే రైతులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు వెంకటరమణ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో బండారు శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, ఎర్రగొండపాలెం, దోర్నాల, త్రిపురాంతకం మండలాల ఏవోలు నీరజ, జవహర్‌లాల్‌నాయక్, సంగమేశ్వరరెడ్డి, నాయకులు కందుల నారాయణరెడ్డి, పేరం రమణారెడ్డి, ఎంసీహెచ్ మంత్రునాయక్, వేగినాటి శ్రీను, నాగేశ్వరరావు, కిషోర్ పాల్గొన్నారు.

6,309మంది రైతులకు రూ.4.10కోట్ల లబ్ధి

పెద్ద దోర్నాల : కష్టకాలంలో ఎదురీదుతున్న రైతులకు ప్రభుత్వాలు అండగా నిలిచాయి. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.5,000, పీఎం కిసాన్ కింద రూ.2,000 కలిపి మొత్తం రూ.7వేలు బుధవారం రైతుల ఖాతాలో జమ చేశాయి. దీంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్‌తో నష్టపోయిన పంటలు, పొలాలు బాగు చేసుకునేందుకు అన్నదాత సుఖీభవ డబ్బులు కలిసివస్తాయని రైతులు అంటున్నారు. మండలంలో 6,309 మంది రైతులు రూ.4.10కోట్ల లబ్ధి చేకూరినట్లు ఏవో జవహర్‌లాల్‌నాయక్ తెలిపారు.

8,436 మంది రైతులకు జమ

పొదిలి : మండలంలో 8,436 మంది రైతులకు రూ.5.47కోట్లు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండవ విడత నగదు జమ అయినట్లు ఏవో డీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని రైతులందరూ వీక్షించేలా రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు మొత్తం రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న స్త్రీనిధి డీజీఎం ఉమామహేశ్వరరావు

బకాయిలను వంద శాతం వసూలు చేయాలి

స్త్రీనిధి డీజీఎం ఉమామహేశ్వరరావు

మార్కాపురం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్త్రీనిధి రుణ బకాయిలను వీవోఏలు వందశాతం వసూలు చేయాలని స్త్రీనిధి డీజీఎం ఉమామహేశ్వరరావు కోరారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో బుధవారం డీఆర్‌డీఏ వెలుగు సీసీలు, వీవోఏలతో జరిగిన సమీక్షా సమావేశంలో డీజీఎం, ఏజీఎం ఉదయ్ కుమార్, లైవ్‌లీ హుడ్ డీపీఎం దానం మాట్లాడారు. డీజీఎం మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా బకాయిలను వసూలు చేయాలని సూచించారు. మండలంలో రూ.30లక్షల బకాయిలను వసూలు చేయాలని, అప్పుడే రూ.10కోట్ల కొత్త రుణాలకు అవకాశం లభిస్తుందని వివరించారు. ఏపీఎం పిచ్చయ్య, వెలుగు సీసీలు నాగయ్య, మనోకుమారి, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

స్వామిత్వ ద్వారా ప్రతి స్థలాన్ని గుర్తించాలి

కొమరోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వే ద్వారా గ్రామంలోని ప్రతి స్థలాన్ని, ప్రతి ఇంటిని కచ్చితమైన కొలతలు తీసి సర్వే చేపట్టాలని ఎంపీడీవో సానికొమ్ము సత్యం అన్నారు. మండలంలోని బెడుసుపల్లి గ్రామంలో బుధవారం స్వామిత్వ ఫేస్ -2 గ్రామసభను నిర్వహించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్య మాట్లాడుతూ గ్రామాల్లోని గ్రామ కంఠాలు, పట్టాలు, నివేశన స్థలాలను గుర్తించి పూర్తి స్థాయిలో కొలతలను తీసి వారికి ప్రత్యేకమైన సంఖ్యను ఇవ్వాలని, సర్వే అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ప్రజల ముందే సమస్యను పరిష్కరించి రాబోవు రోజుల్లో వివాదాలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గృహాల్లో లేని వారిని గుర్తించి వారికి సమాచారం ఇచ్చి సర్వేను సత్వరమే చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో బోయిళ్ల కాశమ్మ, డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు, వీఆర్వో రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి నరేష్, సర్వేయర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

గిద్దలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబవరం, వెల్లుపల్లి సచివాలయాలను ఎంపీడీవో కె.సీతారామారావు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిటిజన్ ఈకేవైసీ, చిన్నారుల బయోమెట్రిక్ సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో వేగంగా స్పందించాలని ఆదేశించారు. బయోమెట్రిక్ హాజరు నమోదు చేయకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి నిధులతో చేపట్టిన జయరాంపురం పంచాయతీ భవన స్థలాన్ని పరిశీలించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

రాచర్ల : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి అన్నారు. రాచర్ల సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. హాజరును పరిశీలించి సిబ్బంది వివరాలను స్థానిక కార్యదర్శి ఎంవీ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏడుగురు సిబ్బంది ఉండాల్సి ఉండగా కొందరు లేకపోవడంతో లేనివారు ఎక్కడ అని అడిగి తెలుసుకున్నారు. ఉండేది తక్కువ సిబ్బంది వారు కూడా కార్యాలయంలో అందుబాటులో లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని కచ్చితంగా కార్యాలయంలో అందుబాటులో ఉండాలని తెలిపారు. చేయాల్సిన పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అన్నారు.


ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో సీతారామారావు

భక్తిశ్రద్ధలతో కాశినాయనకు పూజలు

గిద్దలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భగవాన్ కాశిరెడ్డినాయన ఆశ్రమంలో కాశినాయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక భోజనలు చేశారు. రిటైర్డ్ హెచ్‌ఎం రమాదేవి భోజనాలను ఏర్పాటు చేశారు. యోగా గురూజీ నారాయణరెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు మల్లారెడ్డి, కాశిరెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.


కుసుమ హరనాథుల గ్రామోత్సవం



వైభవంగా గ్రామోత్సవం

శ్రీకుసుమ హరనాథ క్షేత్రంలో కార్తీక పూజలు వైభవంగా ముగిశాయి. బుధవారం పట్టణంలోని శ్రీకుసుమ హరనాథ క్షేత్రంలో ప్రత్యేక పూజలు, సామూహిక భజనలు నిర్వహించారు. శ్రీకుసుమ హరనాథుల గ్రామోత్సవం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. మహిళల కోలాట ప్రదర్శనల మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కుసుమ హరనాథ భక్తసమాజం అధ్యక్షుడు నటుకుల శ్రీనివాసులు, కార్యదర్శి తుమ్మలపెంట శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రారంభమైన జయంతి ఉత్సవాలు

పట్టణంలోని ప్రేమసుధా మందిరంలో సత్యసాయి శతవర్ష జయంతి వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా భక్తులు తెల్లవారుజామున 5 గంటలకే నగర సంకీర్తన చేశారు. అనంతరం ప్రేమసుధా మందిరంలో వేదపఠనం, నామసంకీర్తన కార్యక్రమాలతోపాటు పతాక ఆవిష్కరణ నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవ, సామూహిక రుద్రపఠనం, నామసంకీర్తన చేశారు. బాలవికాస్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.వాణిశ్రీ ఆధ్యాత్మిక ఉపన్యాసాన్ని, సత్యసాయి జీవిత చరిత్రను వివరించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, సమితి ప్రతినిధులు, బాలవికాస్ ప్రతినిధులు ఆయా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

జేపీచెరువులో విగ్రహ ప్రతిష్ఠ

రాచర్ల : మండలంలోని జేపీచెరువు గ్రామంలో ఈనెల 26వ తేదీన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం జరుగుతుందని కార్యనిర్వాహకులు, నంది అవార్డ్ గ్రహీత కళారత్న పత్తి ఓబులయ్య బుధవారం తెలిపారు. 25 బుధవారం పూజాకార్యక్రమాలు, 26 గురువారం విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు భక్తులు హాజరై ఆంజనేయ స్వామి ఆశీస్సులు పొందాలని పత్తి కుటుంబ సభ్యులు కోరారు.

ప్రభుత్వాసుపత్రికి కుర్చీల బహూకరణ

గిద్దలూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఆర్‌కాలనీలోని ప్రభుత్వ వైద్యశాలకు సూర్య విద్యానికేతన్ కరస్పాండెంట్ బ్రహ్మానందరెడ్డి ఆయన తండ్రి దప్పిలి ఈశ్వర్‌రెడ్డి జ్ఞాపకార్థం కుర్చీలను బహూకరించారు. వైద్యశాలకు వచ్చే రోగులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ దప్పిలి పద్మావతి, ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ ఆదామ్, వైద్యులు డాక్టర్ రమణరెడ్డి, డాక్టర్ సింధు, పాల్గొన్నారు.

గురజాల ఎమ్మెల్యే పూజలు

త్రిపురాంతకం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): త్రిపురాంతకంలోని బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారిని బుధవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆయన అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈవో అనిల్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు.

బోడపాడు చెరువును నింపేందుకు చర్యలు తీసుకోవాలి

మార్కాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం మండలంలోని బోడపాడు చెరువును తక్షణమే నింపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు, గ్రామానికి చెందిన రైతులు ఇరిగేషన్ అధికారులను కోరారు. ఈ మేరకు డీఈ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు దగ్గుబాటి సోమయ్య మాట్లాడుతూ మార్కాపురం చెరువు నిండడంతో ఇరిగేషన్ అధికారులు గుండ్లకమ్మ నుంచి సప్లై చానల్ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారన్నారు. ప్రస్తుతం మార్కాపురం చెరువు అలుగు పారుతోందన్నారు. అలుగు నుంచి వచ్చే నీరు మండలంలోని బోడపాడు చెరువుకు చేరుతుందన్నారు. ఆ చెరువుకు ప్రధాన వనరు కూడా ఇదేనన్నారు. కానీ బోడపాడు చెరువు నింపేందుకు అధికారులు చొరవచూపడంలేదన్నారు. బోడపాడు చెరువుకు వెళ్లే కాలువపై పలుచోట్ల ఆక్రమణలు కూడా ఉన్నాయన్నారు. వాటిని తొలగించాలన్నారు. అంతేకాక గుండ్లకమ్మ నుంచి మార్కాపురం చెరువుకు నీటిని తక్షణమే విడుదల చేయాలన్నారు. తద్వారా బోడపాడు చెరువు నిండుతుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘం మండల అధ్యక్షుడు ఓర్సు అడివయ్య, కార్యదర్శి గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బోడపాడు గ్రామస్థులు రూపనగుడి శ్రీనివాసరెడ్డి, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య ఉన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని భారత రత్న, ఇందిరాగాంధీ జయంతిని స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శివారెడ్డి, కే.విజయలక్ష్మి, శిరీష, లక్ష్మీమల్లిక్, స్వర్ణ, ఉమాదేవి, విశ్రాంత గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వీరవనిత ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు శాసనాల సరోజిని అన్నారు. బీజేపీ కార్యాలయంలో స్వతంత్ర్య సమర యోధురాలు ఝాన్సీలక్ష్మీబాయి జయంతి బుధవారం నిర్వహించారు. లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మీ, ఆంజనేయులు, సతీష్, శివప్రసాద్, నాగరాజు, సాయిబాబా పాల్గొన్నారు.

గిద్దలూరు : పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. అనంతరం సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేశారు. విగ్రహ దాత దప్పిలి రంగారెడ్డి సతీమణి లక్ష్మమ్మను సన్మానించారు. బాలబాలికలకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఆర్ పాఠశాల కరస్పాండెంట్ అనురాధ, సూర్య విద్యానికేతన్ డైరెక్టర్ పద్మావతి, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి, కిశోర్, ఫరూఖ్ పాల్గొన్నారు.

రాచర్ల : ఝాన్సీ లక్ష్మీబాయి, మాజీ ప్రధాని ఇందిరా గాంధీలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథపాలకుడు పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. వారి జయంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్‌పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు రంగవల్లి, స్కిప్పింగ్ మ్యూజికల్ ఛైర్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


పనులను వివరిస్తున్న ఏపీవో మహాలక్ష్మి

గ్రామ సభల ద్వారా పనుల గుర్తింపు

రాచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులను గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో ఆర్.మహాలక్ష్మి అన్నారు. మండలంలోని ఎడవల్లి గ్రామంలో బుధవారం ఆమె గ్రామ సభ నిర్వహించి రైతులతో మాట్లాడారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామీణ ప్రజల భాగస్వామ్యంతో మమేకమై పనులు గుర్తిస్తున్నామని అన్నారు. లేబర్ బడ్జెట్ గురించి వివరించి గుర్తించిన గ్రామసభలో గ్రామస్థులు సూచించిన పనులపై చర్చించి తీర్మానం చేసి ఆ పనులను చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఈసీ జే నాగేశ్వరరావు, రామాపురం సొసైటీ బ్యాంకు ఛైర్మన్ భవనం పుల్లారెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ ఇరగనబోయిన లక్ష్మమ్మ, పంచాయితీ కార్యదర్శి జి సరస్వతి దేవి, వీఆర్వో ఎస్ రంగయ్య, టీఏకే శ్రీనివాసులు, ఎస్ఏ లక్ష్మీనారాయణ సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిపై అవగాహన

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన పాల ఉత్పత్తిపై పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు డా చిన్నబాలు రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం మండల కేంద్రంలోని కొలుకుల రోడ్డులో ఆత్మ, పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశు పోషకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు నాణ్యమైన గడ్డి, మేతను అందించాలని సూచించారు. వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శివారెడ్డి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ మంత్రునాయక్, ఏహెచ్ఏ శివనాయక్ పాల్గొన్నారు.

సందడిగా వన భోజనాలు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా స్థానిక జడల పిచ్చయ్య మఠంలో విశ్వబ్రాహ్మణ వన భోజనాలు బుధవారం నిర్వహించారు. మఠంలో పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించారు. భరత నాట్య ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు విశ్వరూపాచారి పోతులూరయ్య, వసంతరాయుడు, భద్రయ్య, పవన్, బాలంకయ్య, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

విశ్రాంత ఆర్మీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మార్కాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం పనిచేసిన తమకు ప్రభుత్వం తరపున ఇంటి నివేశన స్థలాలు కేటాయించాలని విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు బుధవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కోరారు. జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్మీ ఎంప్లాయిస్ హౌసింగ్ బోర్డు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మొర్రిబోయిన చిన్నయ్య మాట్లాడుతూ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు ఎంతోమంది సొంత ఇల్లు లేనివారు ఉన్నారన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగికి 5 సెంట్ల మేర ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూమిని కేటాయిస్తే ఒక కాలనీలా ఏర్పాటు చేసుకుంటామన్నారు. ప్రభుత్వ భూమి లభ్యత మార్కాపురం పరిసర ప్రాంతాల్లో తక్కువగా ఉందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి తెలిపారు. సాధ్యమైన మేర రిటైర్డ్ ఆర్మి ఉద్యోగుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జైజవాన్ యూనియన్ ప్రెసిడెంట్ శీలం హరినారాయణరెడ్డి, నక్కా వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, తిరుమలయ్య, నాగయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

పెద్దదోర్నాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మాలకొండయ్య (స్వామి) (26) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కనిగిరికి చెందిన షేక్ ఖాజావలి, మాలకొండయ్య బైక్‌పై శ్రీశైలం వెళ్లి దైవ దర్శనానంతరం తిరిగి స్వగ్రామం వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలో ఖాజావలి మృతి చెందగా మాలకొండయ్య సుండిపెంట వైద్యశాలలో ప్రథమ చికిత్సలు నిర్వహించారు. పరిస్థితి విషమించడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

అనుమానాస్పదంగా మొగుళ్లపల్లి సర్పంచ్ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ అజయ్‌కుమార్

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగుళ్లపల్లి గ్రామ వైసీపీ సర్పంచ్ కర్నాటి వెంకటేశ్వర రెడ్డి బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందారు. సీఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు బుధవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో పొలం పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో మొగుళ్లపల్లి - వీరభద్రాపురం రహదారిలో బైక్ నుంచి రోడ్డుపై పడి స్పృహ కోల్పోయారు. అటుగా వెలుతున్న వాహనదారులు చూసి ప్రథమ చికిత్సా ప్రయత్నం చేసినా ఆయన అప్పటికే మృతి చెందారు. అందిన సమాచారంతో సీఐ చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరరెడ్డి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇంటికి నిప్పంటించిన దుండగులు

పొదిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పిచ్చిరెడ్డి కాలనీలో గుర్తు తెలియని దుండగులు ఓ ఇంటికి నిప్పంటించిన ఘటన బుధవారం జరిగింది. పొదిలి పిచ్చిరెడ్డికాలనీలో నజరత్తమ్మ నివాసం ఉంటుంది. ఆమె డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తుండేది. రోజూలాగానే ఉదయం కార్యాలయానికి వెళ్లింది. ఆమె వెళ్లిన తరువాత గుర్తు తెలియని దుండగులు తన ఇంటికి నిప్పంటించారని ఈప్రమాదంలో కొంత నగదుతోపాటు మంచం, బీరువ, ఇతర సామగ్రి కాలిపోయాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేమన తెలిపారు. అదే విధంగా పీఎస్ఆర్ కాలనీలో బడ్డీ కొట్టు తాళాలు పగులగొట్టి వస్తువులు చోరీ చేసినట్లు బాధితురాలు రాధ ఫిర్యాదు చేశారు.

21న విద్యుత్ అదాలత్

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు కార్యక్రమం స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో 21వ తేదీ ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు జరుగుతుందని మార్కాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ అదాలత్, సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలున్న వినియోగదారులు వచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

పెద్దదోర్నాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మాల కొండయ్య (స్వామి) (26) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కనిగిరికి చెందిన షేక్ ఖాజావలి, మాల కొండయ్య బైక్‌పై శ్రీశైలం వెళ్లి దైవ దర్శనానంతరం తిరిగి స్వగ్రామం వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలో ఖాజావలి మృతి చెందగా మాలకొండయ్య నుండిపెంట వైద్యశాలలో ప్రథమ చికిత్సలు నిర్వహించారు. పరిస్థితి విషమించడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

75 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

దొనకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాలలో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల బృందం 75 మంది విద్యార్థులకు బుధవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. విజన్ టెక్నీషియన్ అబ్దుల్ రజాక్, ఫీల్డ్ అసిస్టెంట్ కేశవజ్యోతిలు విద్యార్థులకు అన్నిరకాల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌతమీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ఎఫ్రాయిమ్(నాని), వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీ బాయి జయంతి వేడుకలు

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అక్షర జూనియర్ కళాశాలలో స్త్రీ శక్తి దివస్ ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా భారతమాత, ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోకా లోకనాథం పాల్గొన్నారు.

రేపు చింతలపాలెంలో క్లీన్ అండ్ గ్రీన్

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలపాలెంలో ప్రభుత్వం ఆదేశాల ప్రకారం రేపు శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు మండలంలోని గ్రీన్ గార్డ్స్, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌పీకేలు పేర్కొన్నారు.

'పామూరు'లో 7,621 మందికి అన్నదాత సుఖీభవ

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 7,621 మంది రైతుల ఖాతాల్లో బుధవారంఅన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నగదు జమైనట్లు ఏవో అబ్రహం లింకన్ తెలిపారు. రైతు ఖాతాల్లో 5 కోట్ల 10 లక్షల రూపాయలు జమ కానున్నట్లు తెలిపారు.

వేగవంతంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారుల నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మేఘా కాంట్రాక్టర్ పీవీ కృష్ణారెడ్డికి సూచించారు. మండలంలోని అంబవరం - కొత్తపల్లి గ్రామాల సమీపంలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం రాత్రి ఎమ్మెల్యే పరిశీలించారు. భైరవకోన ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ముప్పాళ్ల శ్యాంసుందర్‌రాజు నివాసంలో ఎమ్మెల్యే ఉగ్రను కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటరెడ్డి ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు స్థలాన్ని సేకరించండి

వెలిగండ్ల, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న బీసీ, ఎస్సీ వసతిగృహాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు స్థలాన్ని సేకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. బుధవారం వెలిగండ్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మహాలక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కనిగిరి నుంచి సీఎస్‌పురం పోయే బస్సులను వెలిగండ్ల మీదుగా నడపాలని సర్పంచులు కోరారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలకు ప్రీ స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. సీడీపీవో బేగం, జడ్పీటీసీ సభ్యుడు తిరుపతి రెడ్డి, సర్పంచ్ సురేష్‌బాబు పాల్గొన్నారు

టాయిలెట్స్ ఏర్పాటుతోనే అనారోగ్యాలు దూరం

కనిగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టాయిలెట్స్ ఏర్పాటుతో అనారోగ్యాలు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో టాయిలెట్స్ పరిశుభ్రతపై పారిశుధ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సార్డ్స్ సంస్థ నిర్వాహకురాలు తోడేటి లక్ష్మీ, ఇన్‌చార్జి శానిటరీ సెక్రటరీ చెన్నకేశవులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి నియోజకవర్గంలో 42,303 మంది రైతులకు రూ.28.42కోట్ల నిధులు



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వెలిగండ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు కొత్త ఆలోచనా విధానాలతో ముందుకు వెళుతోందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధులు కార్యక్రమం వెలిగండ్లలో జరిగింది. ముందుగా రైతులతో కలిసి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో ఆరు మండలాలకు 42,300 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.21.15 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.7.27 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జైన్‌లాబ్దిన్, ఏవో శిల్ప, మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, ముత్తిరెడ్డి, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, గవదకట్ల హరి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు అక్కి శ్రీను, బొబ్బా రమణా రెడ్డి, కేసరి రమణా రెడ్డి, కర్నాటి భాస్కర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, మీనిగ కాశయ్య, చౌడారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రాజగోపాల్ పాల్గొన్నారు.

'దర్శి'లో రూ.28.63 కోట్లు జమ

అన్నదాత సుఖీభవ చెక్కును పంపిణీ చేసిన నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మి



డ్రోన్‌ను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి

కురిచేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్లపాడులో బుధవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయిలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం సర్పంచ్ జ్యోతి సుబ్బు అధ్యతన జరిగింది. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, యువ నాయకులు కడియాల లలిత్ సాగర్‌లు హాజరయ్యారు. లక్ష్మి రైతులతో సమావేశమై వారి సమస్యలపై మాట్లాడారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పియం కిసాన్ చెక్కును రైతులకు లక్ష్మి అందజేశారు. డ్రోన్లను పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ ఏడీ బాలాజీనాయక్ మాట్లాడుతూ నియోజకవర్గానికి అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు రూ.28.63 కోట్లు విడుదల అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి జాన్సన్, వ్యవసాయ శాఖ ఏడీ బాలాజీనాయక్, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రవణ్‌కుమార్, ఎంపీడీవో సత్యప్రసాద్, 5 మండలాల వ్యవసాయాధికారులు, పంచాయతీ అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు పిడతల నెమిలయ్య, మోడి ఆంజనేయులు, మారెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్నా, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కాట్రాజు నాగరాజు, గడ్డం బాలయ్య, నాగులపాటి శివకోటేశ్వరరావు, మొఘల్ మస్తాన్‌వలి, షేక్ సునీల్, చమిడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

పశువులకు బీరువ్యర్థాల దాణాతో తీవ్ర నష్టం

జిల్లా పశుసంవర్థక శాఖాధికారి వెంకటేశ్వరరావు



దాణాను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి వెంకటేశ్వరరావు

తాళ్లూరు,నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : పశుపోషకులు పశువులకు బీరువ్యర్థాలు బీరు పొట్టు, లిక్విడ్ దాణాగా ఉపయోగించటం వల్ల తీవ్ర అనర్థాలు వస్తాయని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి ఎన్.వెంకటేశ్వరరావు చెప్పారు. తాళ్లూరులోని గేదెలషెడ్డులో పశువులకు అందిస్తున్న దాణాను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పశుపోషకులతో ఆయన మాట్లాడారు. పశుపోషకులు అధికంగా బీరు, లిక్విడ్ ఉపయోగించటం వల్ల పశువుల జీవితకాలం తగ్గి అనార్యోగం పాలవుతాయన్నారు. అంతేగాక పునరుత్పత్తి శక్తి తగ్గి తిరగ్గట్టే సామర్థ్యాన్ని కోల్పోతాయన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం గోకులం షెడ్ నిర్మాణానికి 2లక్షల30 వేల రూపాయలతో షెడ్డు మంజూరు చేస్తోందని, అందులో రూ.2లక్షలు సబ్సిడీగా అందజేస్తోందని చెప్పారు. ముందుగా పశువైద్యశాలను సందర్శించి రికార్డులను, దాణా స్టాక్‌ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తాళ్లూరు, తూర్పుగంగవరం పశువైద్యాధికారులు ప్రతాప్‌రెడ్డి, వంశి పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు రుణాలు అందించటమే లక్ష్యం

తాళ్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు యూనియన్ బ్యాంక్ ఎస్‌హెచ్‌జీ రుణాలు అందిస్తోందని ఒంగోలు యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ షాహిల్ చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలతో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పుగంగవరం యూనియన్ బ్యాంక్ పరిధిలో 150 గ్రూపులకు ఎస్‌హెచ్‌జీ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పొదుపు మహిళలు తమ బంధువులకు వ్యాపారరీత్యా అవసరాలుంటే రూ.50లక్షల మేర రుణాలు ఇస్తారని చెప్పారు. మేనేజర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ తమ బ్యాంక్ ద్వారా పొదుపు మహిళలకు వచ్చే నెల మొదటి వారంలో రూ.2కోట్లఎస్‌హెచ్‌జీ రుణాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.సుజాత, ఏపీఎం పి.దేవరాజ్, సీసీలు మోహన్‌రావు, కోటేశ్వరరావు, వెలుగు సీవో కుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ షాహిల్

భైరవకోన క్షేత్రాన్ని సందర్శించిన ఉగ్ర



ఉగ్రకు స్వాగతం పలుకుతున్న సభ్యులు

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం మండలంలోని భైరవకోన క్షేత్రాన్ని కార్తీక మాసం చివరి రోజు కావడంతో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, అర్చకులు పూర్ణకుంభం, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. శ్రీభైరవేశ్వరస్వామి, త్రిముఖ దుర్గాదేవి అమ్మవారిని, నగరేశ్వరస్వామి వార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ముప్పాళ్ల శ్యాంసుందర్‌రాజు, ఈవో వంశీకృష్ణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సీహెచ్ వెంకటరెడ్డి, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ గుంటిమడుగు వెంకట రామరాజు, సర్పంచ్ శ్యామలమ్మ, వెంకట నరసరాజు, ముద్దులూరి వెంకటరాజు, ఎం నారాయణరాజు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షునిగా కోటి



కోటిని సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణ సభ్యులు

కురిచేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : కురిచేడు మండలం నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షునిగా గంధం కోటిని ఎన్నుకున్నారు. స్థానిక శివాలయంలో కార్తీక వనభోజన కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు సమ్మిళితమై గంధం కోటిని అధ్యక్షునిగా, గౌరవ అధ్యక్షునిగా బల్లిపల్లి ఏడుకొండలును ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారిని సభ్యులు ఘనంగా సన్మానించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

కురిచేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : కురిచేడు గ్రంథాలయంలో వారం రోజులుగా జరుగుతున్న వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో వస్రాం నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. గ్రంథపాలకురాలు ఎల్ సుమతి, లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ రామారావు, అధ్యక్షుడు ఇందూరి వెంకట నరిసిరెడ్డి పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రం పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో కృష్ణారావు

పీసీపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుదేవారిపాలెం చెత్తసంపద కేంద్రాన్ని ఎంపీడీవో క్రిష్ణారావు బుధవారం పరిశీలించారు. తొలుత గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం సర్పంచ్‌తో కలిసి ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించిన ఆయన చెత్తసంపద కేంద్రంలోని నాడెప్ తొట్లలో వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్యాంసన్ పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవాలి



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రమేష్

దర్శి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవాలని కృషి విజ్ఞానకేంద్రం సమన్వయకర్త డాక్టర్ రమేష్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని, రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం రవీంద్రబాబు, డాక్టర్ మానస, డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేపై గ్రామసభ



ఎంపీడీవో బ్రహ్మయ్యను సన్మానిస్తున్న సర్పంచ్

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో స్వామిత్వ సర్వేను పూర్తి చేసిన గ్రామ పంచాయతీలలో అభ్యంతరాలపై మోట్రావులపాడు గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. మండలంలోని బుక్కాపురం, 21, 22, తేదీల్లో, ఇనిమెర్ల, 24న మోపాడు, సిద్ధవరం, 26న లక్ష్మీనరసాపురం, 27న పామూరు గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కాగా ఇటీవల తుఫాన్ సహాయకచర్యల్లో ఉత్తమ సేవలు అందించి ప్రశంసాపత్రం అందుకున్న ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్యను సర్పంచ్ ఎం గురవయ్య, సచివాలయ సిబ్బంది సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక మాస చివరి పూజలు



దీపాలు వెలిగించిన భక్తులు

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భైరవకోన క్షేత్రంలో పవిత్ర కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా పలువురు భక్తులు వైభవంగా పూజలు చేశారు. దేవతామూర్తులు కొలువుదీరి ఉన్న గుహలపై, జలపాతం వద్ద బుధవారం రాత్రి కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ల శ్యాంసుందర్ రాజు, దేవస్థాన ఈవో వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

డిజిటల్ వ్యవసాయంపై అవగాహన సదస్సు

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బుధవారం డిజిటల్ వ్యవసాయం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయానికి సంబంధించిన వివిధ మొబైల్ అప్లికేషన్ ఎలా ఉపయోగించుకోవాలి, తద్వారా సాగు, ఇతర మార్కెటింగ్ పద్ధతులు, ప్రభుత్వ పథకాలను ఎలా ఉపయోగించుకోవాలో ఏవో మధుబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయవిస్తరణాధికారి శ్రీనివాసులు, గ్రామ సహాయకులు శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ ఇన్చార్జి డాక్టర్ స్టెఫీ పాల్గొన్నారు.

అవీఇవీ

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఈదర విద్యార్థులు



పోటీలకు ఎంపికైన వారితో హెచ్ఎం వెంకటసుబ్బయ్య, పీడీ ప్రసాద్‌బాబు, ఉపాధ్యాయులు

ముండ్లమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ ప్రసాదు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సింగరాయకొండ మండలం పాకల జడ్పీహెచ్ఎస్‌లో జరిగిన ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపికలో ఈదర పాఠశాల విద్యార్థులు అండర్ - 17 బాలుర విభాగంలో వంగల నారాయణరెడ్డి, తోట శ్రీకాంత్, అండర్ - 14 విభాగంలో వీరమల్లు పూర్ణచంద్రరరావు, రొక్కం అభిరామ్, బాలికల విభాగంలో మన్నం అనిత రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు కే ప్రసాదుబాబు అభినందించారు.

అంతర్ జిల్లాల పోటీలకు అగ్రహారం బాలికలు



ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయులు

ముండ్లమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు అంతర్ జిల్లాల 69వ ఎస్‌జీఎఫ్ఐ సాఫ్ట్‌బాల్ అండర్ - 17,-14 విభాగాల్లో బాలికలు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపతిస్వామి తెలిపారు. ప్రభుత్వ పాఠశాల మైనంపాడులో ఈనెల 18న జరిగిన అండర్-14 సెలక్షన్ విభాగంలో ఏడుగురు, అండర్ -17 విభాగంలో ముగ్గురు ఎంపికయ్యారు. అదే విధంగా అండర్-14 విభాగంలో స్టాండ్ బైగా ఇద్దరు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో ఒకరు ఎంపికయ్యారు. ఎంపికైన బాలికలను పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు పీ మీరావలి, వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతి స్వామి, విద్యా కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు దొనకొండ విద్యార్థులు



ఎంపికైన దొనకొండ జడ్పీ పాఠశాల విద్యార్థులతో టీచర్లు

దొనకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నర్సింహారావు చెప్పారు. ఈనెల 18న మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు అండర్ 14, 17 బాలబాలికల విభాగాలకు నిర్వహించిన ఎంపికలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో 10వ తరగతికి చెందిన పీవీఎల్ నారాయణ, 8వ తరగతికి చెందిన నీరుకట్టు మధుశాలిని, ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా పల్లె పండు, అండర్ 14 విభాగంలో 9వ తరగతికి చెందిన ఏసుపోగు దీక్ష, 8వ తరగతికి చెందిన విల్సన్‌లు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎంఈవో షేక్ అమీర్, ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు అభినందించారు.

గ్యాస్ సిలిండర్ల అక్రమ విక్రేతలపై కేసులు



కేసులు నమోదు చేస్తున్న అధికారులు

కురిచేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : కురిచేడు, బోదనంపాడు గ్రామాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం అక్రమంగా గ్యాస్ సిలిండర్లు అమ్మకాలు చేసే వారిపై దాడులు చేశారు. కురిచేడులో ఓ అమ్మకందారు వద్ద ఉన్న 8 సిలిండర్లను స్వాధీనం చేసుకుని అతనిపై 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 8 సిలిండర్లు స్వాధీనం చేసుకోగా వాటిలో భారత్ 3, ఇండియన్ 2, హెచ్‌పీ 3 గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని దర్శి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాక్రిష్ణ తెలిపారు. ఈ దాడులలో డీటీ డేవిడ్ రాజు, ఎఫ్ఐ ముకుంద హరి ఉన్నారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్లను భారత్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌లో భద్రపరచారు.

అక్రమ మద్యం బాటిళ్లు ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న ఈఎస్ అయేషా బేగం

దర్శి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తూ పట్టుబడిన 427 బాటిళ్లను ఎక్సైజ్ సూపరింటెండెంట్ అయేషాబేగం ఆధ్వర్యంలో బుధవారం ధ్వంసం చేశారు. దర్శి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో దొరికిన అక్రమ మద్యం బాటిళ్లను నిల్వ ఉంచారు. నిబంధనల ప్రకారం మధ్యవర్తుల సమక్షంలో పట్టుబడిన బాటిళ్లను పరిశీలించి అనంతరం పగులగొట్టారు. అనంతరం ఆమె రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు



కంచెవేసిన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని పరిశీలించి విచారిస్తున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బీ రమాదేవి హెచ్చరించారు. దొనకొండలోని నాల్గురోడ్ల కూడలి వద్ద ఆర్‌అండ్‌బీకి చెందిన విలువైన కొంత స్థలానికి రాత్రికిరాత్రి చుట్టూ కంచె వేశారనే సమాచారంతో బుధవారం తహసీల్దార్ ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ స్థలం కావటంతో డీఈకి సమాచారం ఇచ్చారు.

లెక్కే లేదు అమలు ఇంకెక్కడ?





- మొక్కుబడిగా వీధి కుక్కల బెడద నియంత్రణ
- 'స్థానిక'ంగా పక్కాగా లేని శునకాల లెక్క
- స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ అంతంత మాత్రమే..
- సుప్రీం గడువు దాటినా..కమిటీలతోనే సరి..
- అలసత్వం, ఆటంకాలు, నిధుల కొరత..



బల్లికురవలో గుంపులు గుంపులుగా రోడ్ల వెంబడి ఉన్న కుక్కలు



సత్తెనపల్లి: కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యుడు

బాపట్ల, అద్దంకి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో వీధి కుక్కలు ఇంకా రోడ్లపై గుంపులుగా చేరి మొరుగుతూనే ఉన్నాయి. జనం పిక్కల బలానికి పరీక్షలు పెడుతూనే ఉన్నాయి. కుక్కకాటుతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్యలో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. వీధి కుక్కల కారణంగా ఎవరి ప్రాణాలకు హాని కలగకూడదని, వాటి నియంత్రణ, జన సమూహాల్లో సంచారం లేకుండా చూడాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన రెండు వారాల గడువు పూర్తయిపోయింది. చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాల సీఎస్‌లనే బాధ్యులను చేస్తామని కూడా స్పష్టం చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పరిశీలిస్తే.. ఒకటి, రెండు పురపాలికల్లో మినహా కుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. స్టెరిలైజేషన్, ఆహారం అందించేందుకు ఒక్కో వీధి కుక్కకు రూ.1,650 ఖర్చు చేయాలని, ప్రత్యేక కమిటీల సాయంతో వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలంటూ (మిగతా 8వ పేజీలో)

వీధి కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక శిక్షణ ఉన్న సిబ్బంది అన్ని మున్సిపాలిటీలకు అందుబాటులో లేరు. తెనాలి, పొన్నూరు, బాపట్ల, రేపల్లె పట్టణాల్లో వీధి కుక్కలను పట్టుకోవాలంటే మంగళగిరి ప్రాంతంలో ఉన్న కొద్దిమంది డాగ్ హ్యాండ్లర్లు, క్యాచర్లను ఆశ్రయించాలి. రాష్ట్ర మున్సిపల్ శాఖ శిక్షణ పొందిన డాగ్ క్యాచర్లను నియమించుకోవాలని ఆదేశాలిచ్చినా నియామకాలు జరగలేదు.

ఆపరేషన్లు చేశాక వీధి కుక్కలను కనీసం నాలుగు రోజులు అదే కేంద్రాల్లో సంరక్షించాల్సి ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో నిధుల కొరత ఉంటే, మరికొన్నింటిలో వాటికి వెచ్చించాల్సిన నిధులు మింగేసిన పరిస్థితి ఉంది. దీంతో కొన్ని కేంద్రాల్లో ఉంచిన కుక్కలు అక్కడే చనిపోయిన దారుణ పరిస్థితులూ ఉన్నాయి. ఇందుకోసం.. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశించింది. ఏ మున్సిపాలిటీలో నిధుల మిగులు లేవు.



వాట్సా‌ప్‌తో కొనుగోళ్లు

- హాయ్ అంటే ఏఐ సహకారం
- సేకరణను సులభతరం చేసే దిశగా అడుగులు
- బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కేంద్రాలు ప్రారంభం
- నెలాఖరు నుంచి పల్నాడు జిల్లాలో కొనుగోళ్లకు ఏర్పాట్లు

రైతుల కోసం వాట్సాప్ నెంబర్ **73373 59375**

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ధాన్యం కొనుగోళ్లను సులభతరం చేసే దిశగా ప్రభుత్వం సాంకేతిక సేవలను ఉపయోగించుకునే విధానానికి తెరతీసింది. రైతుల కోసం వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 7337359375 నంబరుకు హాయ్ అని మెసేజ్ పెడితే చాలు వెంటనే ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ వాయిస్‌తో తదుపరి ప్రక్రియపై రైతులకు మార్గనిర్దేశనం చేస్తుంది. అన్నదాతలు వాట్సాప్ వేదికగా ఇచ్చే వివరాలతో కొనుగోలు స్లాట్ బుక్ కానుంది. వాట్సాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకునే రైతుల ధాన్యాన్ని కొనుగోలు నుంచి వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవరకు సాంకేతిక బృందం పర్యవేక్షణ కొనసాగనుంది. ఓ వైపు కొనుగోలు కేంద్రాలను తెరుస్తూనే, మరో వేదికగా వాట్సాప్ సేవలను కూడా రైతులకు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. మద్దతు ధరకు (మిగతా 6వ పేజీలో)

బాపట్ల జిల్లాలో 2 లక్షల టన్నులు

బాపట్ల జిల్లాలో మంగళవారం 5 కొనుగోలు కేంద్రాల సేవలను అందుబాటులోకి తెచ్చిన సివిల్ సప్లయిస్ విభాగం బుధవారం 117 కేంద్రాలను ప్రారంభించింది. రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. గతేడాది 93,000 మెట్రిక్ టన్నుల సేకరించగా, ఈ ఏడాది ఏకంగా రెండు లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేసింది.

గుంటూరులో లక్ష టన్నులు

గుంటూరు జిల్లాలో బుధవారం నుంచి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. తొలుత 5 రైతు సేవా క్లస్టర్లను ఓపెన్ చేసి, వారం వ్యవధిలో 45 క్లస్టర్లలో కొనుగోళ్ల జరిపేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో లక్ష టన్నుల వరకు సేకరించేలా ప్రస్తుతం ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

దుకాణాలు తొలగించవద్దు

సూర్యలంక తీర దుకాణదారుల డిమాండ్

నోటీసులు అందజేసిన పంచాయతీ అధికారులు

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలోని దుకాణాలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో జారీ చేసిన నోటీసులు ఇవ్వడానికి బుధవారం వచ్చిన కార్యదర్శి రవికుమార్‌ను దుకాణదారులు అడ్డుకుని వెనక్కి పంపించారు. అనంతరం వారంతా ఆందోళనకు దిగారు. తాము దశబ్దాల తరబడి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని దుకాణాలను తొలగించవద్దని డిమాండ్ చేశారు. తీరం ఎదురు రోడ్డుకు ఇరువైపుల సుమారు 50 దుకాణాలకుపైగా ఉన్నాయి. టూరిజం డెవలప్‌మెంట్ పనులకు దుకాణాలు అడ్డుగా ఉన్నాయని వాటిని తొలిగించాలని పంచాయతీ అధికారులు ఆదేశించారు. 39 దుకాణాలకు నోటీసులు జారీ చేయగా వాటిని దుకాణదారులు తీసుకోలేదు. తమ దుకాణాలు తొలగించ వద్దని పంచాయతీకి ప్రత్యేకాధికారిగా ఉన్న తహసీల్దార్ షేక్.సలీమాను కలిసి వినతిపత్రం అందజేశారు. తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తే అందులోకి వెళ్తామని, ఆ తర్వాత టూరిజం శాఖ నిర్మించే దుకాణాలు తమకు ఇప్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తహసీల్దార్ తెలిపారు.



సూర్యలంక తీరంలోని వ్యాపార దుకాణాలు



బాపట్లలో మహిళా రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి



మార్టూరులో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ఉద్దేశం

- ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం
- సుఖీభవ నిధుల విడుదలలో మంత్రి పార్థసారథి

బాపట్ల, బాపట్ల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమం బుధవారం బాపట్ల మండలం ఈస్ట్‌బాపట్ల రైతు సేవా కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రైతుల తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యమన్నారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువులను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. రాయితీపై పంపిణీ చేస్తున్న విత్తనాలు, బిందుసేద్యం పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నదాతతోనే దేశ ప్రగతి సాధ్యమని నమ్మిన పార్టీ టీడీపీ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నగదు కోసం రైతులు రోడెక్కాల్సి వచ్చిందని, తమ ప్రభుత్వం 48 గంటల్లోనే చెల్లిస్తుందన్నారు. వ్యవసాయంలో డ్రోన్లను ఉపయోగించి రైతులకు ఖర్చు తగ్గించే పని చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని 46.86 లక్షల మంది రైతన్నలకు అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, బాపుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, టీడీపీ నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ, పంగులూరి శ్రీనివాసరావు, బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పండగలా కార్యక్రమాలు

అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరిగాయి. చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన పాల్గొన్నారు. మార్టూరు మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతులతో కలిసి హాజరవ్వగా, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు చుండూరులో జరిగిన అన్నదాత సుఖీభవ నిధుల విడుదలలో పాల్గొన్నారు. చీరాల మండలం బోయినవారిపాలెం, అద్దంకిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులతో కలిసి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పండగ వాతావరణంలో కార్యక్రమాలు జరుపుకున్నారు.

ఆస్పత్రిలో పనులు వేగంగా చేపట్టాలి

- బాపట్ల, ఈపూరుపాలెంలో ఆటిజం కేంద్రాలు
- సమీక్షలో కలెక్టర్ డాక్టర్ వీ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో రూ.23.75 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. వైద్య విధాన పరిషత్ ఆధీనంలో జరుగుతున్న పనులతో పాటు జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై బుధవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్, క్రిటికల్‌కేర్ యూనిట్ పనుల్లో ప్రతివారం పురోగతి కనిపించాలన్నారు. చీరాల, బాపట్ల ప్రాంతీయ వైద్యశాలల్లో ఆర్థిక సంఘం నిదులతో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆస్పత్రుల్లో ప్రజలకు అన్ని సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌ను 2026 మేకి పూర్తి చేయాలన్నారు. బాపట్లలోని ఉన్నత పాఠశాలలో, చీరాల ఈపూరుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆటిజం కేంద్రం ఏర్పాటుకి అనుమతులు వచ్చాయన్నారు. భవిత కేంద్ర ఏర్పాటుకు అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు.



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అలసత్వం వహించరాదు..

అభివృద్ధిలో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని, ఆలసత్వం ప్రదర్శించరాదని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ తెలిపారు. ఓడరేవు - చిలకలూరిపేట 167ఏ జాతీయ రహదారి నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. గుంటూరు-నిజాంపట్నం జాతీయ రహదారి పనులు త్వరగా చేపట్టాలన్నారు. నిడుబ్రోలు నుంచి చందోలు వరకు రూ.8కోట్లతో 4.6 కిలోమీటర్లు నిర్మిస్తున్న రహదారిని త్వరగా పూర్తి చేయాలన్నారు. రేపల్లె-నిజాంపట్నం, చందోలు-నిజాంపట్నం జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. గుంటూరు నుంచి బాపట్ల వరకు నాలుగు వరుసల రహదారి నిడుబ్రోలు మీదగా బైపాస్ ఉండేలా ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సూర్యలంకబీచ్‌లో పనులు వేగంగా చేపట్టాలని తెలిపారు. సూర్యలంక నగరవనం వద్ద బోట్లు పార్కింగ్‌కు అటవీశాఖ అనుమతులను పరిశీలించాలన్నారు. ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తి కాకపోవడంపై ఆరాతీశారు. సమావేశాల్లో వైద్యవిధాన్ పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి, మత్స్యశాఖ ఏడీ గాలిదేవుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి ఆలయానికి

ఐఎస్‌వో గుర్తింపు

- అవార్డును అందజేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన శక్తిక్షేత్రాలలో ప్రముఖ ఆలయంగా విలసిల్లుతున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి ఇంటర్నేషనల్ ఐఎస్‌వో 9001 గుర్తింపు లభించింది. ఇందుకు సంబంధించిన అవార్డును బుధవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎస్‌వో గుర్తింపు జిల్లాకే తలమానికమని, అవార్డును తాను దేవస్థానానికి అందజేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. హైమ్ ఇంటర్నేషనల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శ్రీబగళాముఖి అమ్మవారికి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి ఛైర్మన్ కలకోట చక్రధర్‌రెడ్డి, కమిటీ సభ్యులు కేశరాజు పట్టాభిరామరావు, వక్కలగడ్డ ప్రసాద్, పూజరులు పాల్గొన్నారు.



ఐఎస్‌వో 9001 అవార్డు అందుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి తదితరులు

రాగిశాసనంలో... శ్రీశైలం మెట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రాగి శాసనాలను డీకోడింగ్ చేయగా శ్రీశైలం ఆలయానికి మెట్లు నిర్మించినట్లు కూడా దానిలో ఉందని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్(మైసూర్) ముని రత్నం రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెరు కుపల్లి మండలం పొన్నపల్లి అగ్రహారంలో వెలుగు చూసిన రాగి శాసనాలను సదరు వంశీయులు ఏఎస్ఐకి పంపిన సంగతి తెలిసిందే. చారిత్రక శాసనాలను డీకోడింగ్ చేసే క్రమంలో వాటిలో అనేక ఆసక్తి కరమైన అంశాలు లిఖించి ఉన్నట్లు ఏఎస్ఐ తెలిపింది. ప్రసిద్ధి చెందిన శ్రీశైలం మల్లికార్జున ఆలయానికి మెట్ల నిర్మాణం అంశం కూడా దానిలో పొందు పరచడం జరిగిందన్నారు. ఇదే కాకుండా రెడ్డి రాజుల వంశ వృక్షం వివరాలను కూడా అందులో వివరించారని, మొత్తం సంస్కృతం, తెలుగు లిపిలోనే ఇవన్నీ లిఖించారన్నారు. వేద పండితులంతా కలిసి ఈ శాసనాలను 1,405 శతాబ్దంలో అప్పటి రెడ్డి రాజులకు అందించారని, వాటిని ఆ వంశీయులు భద్రపరచి ఆర్కియాలజీ విభాగానికి అందించడం వల్ల అనేక ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయని ఏఎస్ఐ తెలిపింది. పొన్నపల్లి అగ్రహారానికి చెందిన విద్యా భాస్కర్ అందించిన చారిత్రకక రాగి శాసనాలపై మరింతగా కసరత్తు చేస్తున్నామని డైరెక్టర్ మునిరత్నంరెడ్డి వివరించారు.



రాష్ట్రపతి నుంచి అందుకున్న ప్రశంసాపత్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు చూపుతున్న రాజశేఖరరాజు,పక్కనే ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్

నీటినిల్వలు ఉన్నచోట గ్రామాలు అభివృద్ధి

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, నవంబరు19(ఆంధ్రజ్యోతి):నేల సంరక్షణ కలిగి, నీటి నిల్వలు ఉన్న గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు.ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన పి. రాజశేఖరరాజు 2024 కు సంబంధించి సౌత్ జోన్ నుంచి నేలసంరక్షణ,నీటి నిల్వలు ఉండేవిధంగా కృషి చేసినందుకు కేంద్ర జలశక్తి మినిస్ట్రీస్ నుంచి అవార్డుకు ఎంపికయ్యారు. దాంతో ఆయన మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపతిద్రౌపదిముర్ము చేతుల మీదుగా నేషనల్ వాటర్ అవార్డుగా షీల్డును,ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఆయన మార్టూరులోని ఎఫర్ట్ సంస్థలో వాటర్ షెడ్ విభాగంలో 2010నుంచి 2017 వరకు పనిచేశారు. ప్రస్తుతం జిందాల్ ఫౌండేషన్ సంస్థలో పనిచేస్తున్న రాజశేఖరరాజును బుధవారం రాత్రి ఎఫర్ట్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు ప్రత్యేకంగా రాజశేఖరరాజును అభినందించారు.ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలో వాటర్ షెడ్‌ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపించే ప్రతిపాదనల విషయంలో రాజశేఖరరాజు సేవలు అందించాలని కోరారు.అదేవిధంగా రాజశేఖరరాజు లాంటి వ్యక్తులను ప్రోత్సహించిన, ఆదరించిన సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబ శి వరావు,రావి అంకమ్మ చౌదరి,చెరుకూరి నాగేశ్వరరావు,జాష్టి సాబ శివరావు,యం ఈశ్వరప్రసాద్,షేక్ కాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మేదరమెట్లలోని మిద్దెలడొంకలో కాలవల నిర్మాణానికి ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

తీరనున్న మిద్దెలడొంక మురుగు వెతలు

● కాలువల నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు

మేదరమెట్లనవంబరు19 : మేజర్ పంచాయతీ అయిన మేదరమెట్లలో ప్రధాన రహదారులలో ఒకటైన మిద్దెలడొంక రోడ్డు అభివృద్ధిలో వెనుకబడి ఉంది. ప్రధాన వీధులతోపాటు చిన్న చిన్న వీధులలో కూడా సిమెంట్ రోడ్లు 2009కి ముందే చేపట్టారు. కానీ ప్రధానమైన మిద్దెలడొంక రోడ్డును మాత్రం సిమెంట్ రోడ్డు వేయకుండా వదిలేశారు. చాలా సంవత్సరాలకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టినా కాంట్రాక్టర్ అత్యాశతో నాణ్యతలేకుండా నిర్మించారు. ఈ రోడ్డుకు రెండు వైపులా మట్టి కాలువలే ఉన్నాయి. ఈ కాలువలలో మురుగు నీరు సక్రమంగా ప్రవహించక ఏదోఒక అడ్డంకితో తరచూ రోడ్డుపైనే ప్రవహిస్తున్నది. పాదచారులు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు మురుగునీటిలో నడవలేక అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై ఇంటిముందుగా మురుగు నీరు ప్రవహించడంతో రోడ్డు పక్కన ఇళ్ల వారు మురుగు వాసన భరించలేకపోవడం పిల్లలు ఇంటినుంచి బయటకు వచ్చే అవకాశం లేకుండా ఇబ్బందులు పడుతున్నారు.

మిద్దెలడొంకలో సైడు కాలువల నిర్మాణానికి కోటి రూపాయలు నిధులు మంజూరయ్యాయి. కాలువల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రోడ్డు కొలతలు తీసి అక్కడ ఉన్న చిన్న చిన్న ఆక్రమణలను బుధవారం తొలగింపు పనులను మొదలుపెట్టారు. రోడ్డుకు ఒకవైపు కాలువల నిర్మాణం పూర్తి చేశాక రెండో వైపు పనులు మొదలుపెడతామని పంచాయతీ కార్యదర్శి లక్షీకాంత్ తెలిపారు. సైడుకాలువల నిర్మాణంతో తమ వెతలు తీరుతాయని మిద్దెలడొంక వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాగులపాడులో అయ్యప్పస్వామి అఖండ పడి పూజ వద్ద పూజలు నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్

నాగులపాడులో వైభవంగా అయ్యప్పస్వామి అఖండ పడి పూజ

● హాజరైన మంత్రి రవికుమార్

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాగులపాడులో అయ్యప్ప స్వామి అఖండ పడి పూజ బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అఖండ పడి పూజకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుయువత నాయకులు పెంట్యాల రామాంజనేయులు 18 వ పడి నారికేళస్వామి పూజ సందర్భంగా నాగులపాడులో అఖండ పడి పూజా కార్యక్రమం నిర్వహించారు. వాసు గురుస్వామి పర్యవేక్షణలో హైదరాబాద్ కేశవ గురుస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.కర్లపాలెంకు చెందిన కొండలు స్వామి ఆలపించిన అయ్యప్ప భజన పాటలు ఆకట్టుకున్నాయి. దీక్షాధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీడీపీ నేతలు కరి పరమేష్, నాగినేని రామకృష్ణ, మానం మురళీమోహన్‌దాస్, కాకాని అశోక్, సందిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, నూతన కమిటీ

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

అద్దంకి,నవంబరు18(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం వీఆర్‌ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ అద్దంకి మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సుందరయ్యభవన్‌లో బుధవారం అద్దంకి మండల వీఆర్‌ఏల సమావేశం జరిగింది. అద్దంకి మండల నూతన కమిటీ ని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా జంధ్రాజుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శిగా కనపర్తి స్వాములు, కోశాధికారిగా రుద్రు శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా ఎం నరసింహారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాగర్ నీటి పంపిణీలో వివక్ష

ఎగువ ప్రాంతానికి అధిక నీరు విడుదల
తప్పుడు లెక్కలు చూపుతున్న అధికారులు
ఓబీసీకి తీరని అన్యాయం
ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
పరిశీలించి చర్యలు తీసుకుంటాం: ఈఈ



పమిడిపాడు బ్రాంచ్ కాలువకు అధికంగా విడుదల అవుతున్న నీరు

సాగు నీటి పంపిణీలో వివక్ష జరుగుతోంది. అధికారులు ఉద్దేశపూర్వకంగా ఎగువ ప్రాంతంలోని కాలువలకు అధికనీరు విడుదల చేస్తూ తప్పుడు లెక్కలు చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చివరన ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువకు తీరని అన్యాయం జరుగుతోందని రైతులు చెబుతున్నారు. తక్కువగా నీరు విడుదల చేస్తుండటంతో మేజర్లు, మైనర్లకు నీరందడం లేదని చెబుతున్నారు. చివరి ఆయకట్టు భూముల్లో ఇంకా వరినాట్లు పూర్తికాక ఇబ్బందులు పడుతున్న తరుణంలో అధికారుల తీరుతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని ప్రాంతాలకు న్యాయం చేయాల్సిన అధికారులు పక్షపాత వైఖరి ఎందుకు అవలంబిస్తున్నారో అర్థంకావటం లేదంటున్నారు.

దర్శి నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలుకు(ప్రకాశం జిల్లా సరిహద్దు) 2,502 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. అధికారుల లెక్కల ప్రకారం ఆ నీటిలో పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 415 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు 773 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు చెబుతున్నారు. దర్శి బ్రాంచ్ కాలువ, పమిడిపాడు బ్రాంచ్ కాలువలకు అధిక నీరు విడుదల చేస్తున్నారని ఒంగోలు బ్రాంచ్ పరిధిలోని ఓబీసీ పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు ఆరోపిస్తున్నారు. వాస్తవంగా పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 650 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తూ 450 క్యూసెకులు అన్నట్లు లెక్కలు చెబుతున్నారని విమర్శిస్తున్నారు. అనధికారికంగా 200 క్యూసెక్కుల నీరు అదనంగా పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

లెక్కలు చెప్పడం లేదు

అదేవిధంగా సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు నుంచి 126వ మైలు వరకు ఉన్న మేజర్లకు, దర్శి బ్రాంచ్ కాలువ పరిధిలోని మేజర్లకు కూడా అధికనీరు విడుదల చేస్తూ అధికారులు సక్రమంగా లెక్కలు చెప్పటం లేదు. దర్శి బ్రాంచ్ కాలువ హెడ్ వద్ద కొంతకాలంగా రీడింగ్ తీయటం నిలిపివేశారు. అక్కడ రీడింగ్ మీటర్ సక్రమంగా పని చేయటం లేదని అధికారులు సాకులు చెబుతూ పక్కన పెట్టారు. ప్రస్తుతం పమిడిపాడు బ్రాంచ్ కాలువ వద్ద రీడింగ్ సక్రమంగా లేదని అందువలన తక్కువ నీరు విడుదల అవుతున్నా అధిక నీరు సరఫరా అవుతున్నట్లు రీడింగ్‌లు చూపుతున్నాయని అక్కడి అధికారులు బుకాయిస్తున్నారు. దర్శి-2 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెలుగొండారెడ్డి, పలువురు నీటి సంఘాల అధ్యక్షులు ఎన్‌ఎస్‌పీ అధికారులకు నీటి పంపిణీలో జరుగుతున్న వివక్షపై ఫిర్యాదు చేశారు. ఆ సందర్భంగా అధికారులు రీడింగ్‌లలో తేడా ఉందని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. వాస్తవంగా పమిడిపాడు బ్రాంచ్ కాలువ హెడ్ వద్ద రీడింగ్‌లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు ఉద్దేశపూర్వకంగానే వక్రీకరించి చెబుతున్నారని నీటి సంఘాల అధ్యక్షులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు సాగునీటి పంపిణీలో జరుగుతున్న వివక్షను పరిశీలించి చర్యలు తీసుకోవాలని, చివరి ప్రాంతాలకు సక్రమంగా నీరందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఓబీసీకి నీటి పరిమాణం పెంచుతాం

ఒంగోలు బ్రాంచ్ కాలువకు నీటి పరిమాణాన్ని పెంచుతామని దర్శి ఎన్‌ఎస్‌పీ ఈఈ విజయలక్ష్మి చెప్పారు. నీటి పంపిణీలో వివక్ష చూపుతున్నారని, ఎగువ ప్రాంతానికి అధిక నీరు విడుదల చేస్తున్నారని వస్తున్న విమర్శలపై ఆమె స్పందిస్తూ పంపిణీ అవుతున్న నీటి పరిమాణాన్ని లెక్కలు పరిశీలించి తేడాలు ఉంటే సరిచేస్తామన్నారు. పీబీసీకి అధికనీరు విడుదల చేస్తున్నారని కొందరు రైతులు, నీటి సంఘాల అధ్యక్షులు తమకు పిర్యాదులు చేసిన మాట వాస్తవమేనని చెప్పారు. ఆ విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆగిఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న బైక్

● ముగ్గురు విద్యార్థులకు తీవ్ర, ఒకరికి స్వల్పగాయాలు
● క్షత గాత్రులలో బాపట్ల, రేపల్లె, పొన్నూరు, వేటపాలెంకు చెందిన విద్యార్థులు



అపస్మారక స్థితిలో బాపట్లకు చెందిన ధృవత్



తలకు తీవ్ర గాయాలతో వేటపాలెం నాగచరణ్

చీరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఆగివున్న ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. వేటపాలెంకు చెందిన సాయి, నాగచరణ్ బీటెక్ విద్యార్థులు. బుధవారం సాయి పుట్టిన రోజు కావడంతో సరదాగా వాడరేవులో గడిపేందుకు ద్విచక్ర వాహనంపై వేటపాలెం నుంచి 216 జాతీయ రహదారిలో ప్రయాణిస్తూ హాయ్ రెస్టారెంట్ సమీపంలో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో బాపట్లకు చెందినధృవత్, రేపల్లెకు చెందిన వాకా పోతురాజు, పొన్నూరుకు చెందిన విశ్వనాథ్‌లు కూడా చీరాల్లోని ఓ ప్రయివేట్ కళాశాల విద్యార్థులు. వీరు ముగ్గురు వారి కళాశాలలో హాల్ టిక్కెట్ తీసుకుని వీఆర్‌ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో పరీక్షలు రాసేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఈక్రమంలోనే వేగంగా వాహనం నడుపుతున్న ధృవత్ రోడ్డు పక్కన ఉన్న సాయి, నాగ చరణ్‌ల వాహనాన్ని ఢీ కొట్టారు. దీంతో బాపట్లకు చెందిన ధృవత్, రేపల్లెకు చెందిన పోతురాజు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే విశ్వనాథ్ స్వల్పంగా గాయపడ్డాడు. నిలిచి ఉన్న వాహనదారులు నాగ చరణ్ కూడా తలకు బలమైన గాయం అయ్యింది. క్షతగాత్రులు చీరాల ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఈమేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.



చికిత్స పొందుతున్న రేపల్లెకు చెందిన వాకా పోతురాజు



స్వల్పంగా గాయపడిన పొన్నూరు విశ్వనాథ్

'లెక్కే' లేదు..అమలు ఇంకెక్కడ?

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో కమిటీలు వేసి చేతులు దులుపుకుంటే, చాలా మున్సిపాలిటీల్లో వీధి కుక్కలు, పెంపుడు కుక్కల లెక్కే సరిగా లేదంటే.. ఉత్తర్వుల అమలు తీరు ఏమేర ఉందనేది అర్థమవుతోంది.

శిథిలావస్థలో కేంద్రాలు..

స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్‌కు అవసరమైన కేంద్రాలు అందుబాటులో లేవు. ఉదాహరణకు తెనాలి పట్టణానికి సంబంధించి వ్యాక్సినేషన్, సంరక్షణ కేంద్రాన్ని రూ.12 లక్షలతో ఏడేళ్ల క్రితం కంపోస్టు యార్డులో నిర్మించారు. దీనిని సరిగా వినియోగించకపోవడంతో షెడ్‌లు శిథిల స్థితికి చేరాయి. పరికరాలు కూడా పనికి రాకుండా పోయాయి. ఇదే పరిస్థితి మిగిలిన మున్సిపాలిటీల్లోనూ ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో అసలు కేంద్రాలే ఏర్పాటు కాలేదు. ఉన్న కేంద్రాల్లో డాక్టర్లు, ఇతర సిబ్బంది నియామకం లేదు.

కమిటీలు ఇలా..

సుప్రీం ఆదేశాల మేరకు.. శునకాల నుంచి పిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలను స్థానిక సంస్థలు వెల్లడించాలి. ఫిర్యాదులను తీసుకుని.. తక్షణం స్పందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. నిబంధనల అమలు కోసం ఆరుగురు సభ్యులతో కమిటీ వేయాలి. పశు సంవర్థక, వైద్య ఆరోగ్య శాఖలు, స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి సభ్యులను నియమించాలి. ఈ కమిటీలకు పురపాలికల్లో కమిషనర్, పంచయతీల్లో కార్యదర్శి చైర్మన్‌గా ఉంటారు.

- తెనాలి పట్టణంలో 1,450 వీధి కుక్కలు మాత్రమే ఉన్నాయనడం ఆశ్చర్యం కలిగించే విషయం. వీటిలో 350 కుక్కలకు మాత్రమే ఆపరేషన్లు చేయాలని ఒక లెక్క చెబుతోంది. అసలు స్టెరిలైజేషన్ పనిచేయకపోతే ఏ విధంగా మిగిలిన వాటికి వ్యాక్సిన్, ఆపరేషన్‌ల ప్రక్రియ పూర్తిచేశారనేది సందేహం.

- సత్తెనపల్లి మునిసిపాలిటీ పరిధిలో రెండు వందలకు పైగా కుక్కలకు వ్యాక్సినేషన్ పూర్తి చేశారు. మరో ఆరు వందల వరకు కుక్కలు రోడ్లపై తిరుగుతున్నాయి. సుప్రీం ఆదేశాల మేరకు మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి ఆపరేషన్ థియేటర్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నారు. ఆపరేషన్ అనంతరం కుక్కలను ఉంచేందుకు షెల్టర్ నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ నెల చివరిలో జరిగే కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందగానే నిర్మాణ పనులు ప్రారంభించ నున్నట్లు అధికారులు తెలిపారు.

- నరసరావుపేట మునిసిపాల్టీల పరిధిలో సమూరు 450 కుక్కలను మునిసిపాల్టీ అధికారులు గుర్తించారు. ఇప్పటికి 165 కుక్కలను పట్టి వాటికి స్టెరిలైజేషన్ చేశారు. అనంతరం వాటిని తిరిగి వాటి అసలు స్థానాలకు వదులుతున్నారు. నిర్దేశిత లక్ష్యాల సాధనపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు.

- బాపట్లలో వీధికుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు రైలుపేట స్మశానవాటికలో శస్త్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. రూ.6 లక్షలు వెచ్చించి షెడ్, బోన్‌లు, ఏసీ, ఆపరేషన్ పరికరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో 1000 వీధి కుక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అందులో 800 కుక్కలకు శస్త్ర చికిత్స చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. అయినప్పటికి సూర్యలంక రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు, జీబీసీ రోడ్డు, జమ్ములపాలెంరోడ్డు తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. శానిటరి ఇన్‌స్పెక్టర్ సయ్యద్ నజీర్‌ను వివరణ కోరగా స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తర్వాత షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- అద్దంకి పట్టణంలో 420 కుక్కలు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. బుధవారం వరకు 96 కుక్కలను సత్తెనపల్లికి పంపినట్లు మున్సిపల్ కమీషనర్ రవీంద్ర తెలిపారు. వారం రోజుల్లో అన్నింటిని పట్టుకొని వ్యాక్సినేషన్ చేయిస్తామన్నారు. అయితే స్థానికుల నుంచి అభ్యంతరాలు వస్తుండటంతో ఒకింత ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తుంది. గ్రామాలలో మాత్రం అధికారులు అసలు పట్టించుకోవడం లేదు.

వాట్సాప్‌తో కొనుగోళ్లు

(5వ పేజీ తరువాయి)

ధాన్యం అమ్ముకునే విషయంలో ప్రతీ సీజన్‌లోనూ రైతుల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతూనే ఉంటాయి. ఈ క్రమంలో అర్హత కలిగిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. వాట్సాప్ నెంబరుకు హాయ్ అనే మెసేజ్ పెట్టిన తర్వాత ఏఐ వాయిస్ ఇచ్చే సూచనలను రైతులు పాటించాల్సి ఉంటుంది. ఆధార్ నంబరు ఎంటర్ చేసిన తర్వాత రైతు తన పేరును ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఏ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని అమ్మాలనుకుంటున్నారో తెలియజేయడంతో, విక్రయానికి సంబంధించి ఇచ్చే మూడు తేదీలలో ఓ దానిని రైతు ఎంపిక చేసుకునే వీలు కూడా కల్పించారు. ఇక ఏ రకం ధాన్యం, పరిమాణం ఎంత అనే వివరాల కోసం ప్రత్యేక ఆప్షన్ వాట్సాప్ ద్వారానే ఇవ్వనున్నారు. తర్వాత ప్రక్రియగా అమ్మకం తేదీ ఖరారు, షెడ్యూల్ బుక్ అయినట్లు స్లాట్ కూపన్ వాట్సాప్ ద్వారానే రైతుల దరికి చేరేలా టెక్నాలజీని ప్రభుత్వం డిజైన్ చేసింది. ఈ విధానంలో అన్నదాతలకు సమయం ఆదాతో పాటు ఖర్చులూ తగ్గనున్నాయి.

గుంటూరులో లక్ష టన్నులు

గుంటూరు జిల్లాలో బుధవారం నుంచి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. తొలుత 5 రైతు సేవా క్లస్టర్లను ఓపెన్ చేసి, వారం వ్యవధిలో 45 క్లస్టర్లలో కొనుగోళ్లు జరిపేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం దిగుబడి దాదాపు మూడు లక్షల టన్నుల వరకు ఉంటుందనే అంచనాల నేపథ్యంలో లక్ష టన్నుల వరకు సేకరించేలా ప్రస్తుతం ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

పల్నాడులో 286 కేంద్రాలు

ఈ నెలాఖరు నుంచి పల్నాడు జిల్లాలో ధాన్యం సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 286 రైతు సేవా కేంద్రాల ద్వారా 40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. మూడు జిల్లాల పరిధిలోనూ గతేడాది ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే కొనుగోళ్ల లక్ష్యాన్ని దాదాపుగా రెట్టింపు చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు



బల్లికురవ నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఉన్న ఏఎంఆర్ చెక్ పోస్టులో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న ఎస్ఐ నాగరాజు

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

బల్లికురవ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో కొత్త వ్యక్తులు ఎవరైన అర్ధరాత్రి పూట సంచరిస్తుంటే వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ వై.నాగరాజు ప్రజలను కోరారు. బుధవారం బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఏఎంఆర్ చెక్ పోస్టుల వద్ద కొత్త వ్యక్తుల కదలికలపై ఎస్ఐ సీసీ పుటేజీలను పరిశీలించారు. ఈసందర్భంగా రాత్రుళ్ల చెక్‌పోస్టులలో విధులు నిర్వహిస్తున్న వారితో ఎస్ఐ మాట్లాడుతూ ఏదైనా వాహనాల రాకపోకలు ఉన్నా, కొత్త వ్యక్తులు వెళుతున్నా వెంటనే గమనించి తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే దేవాలయాల వద్ద సీసీ కెమెరాలను కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, విలువైన వస్తువులను పూజారులు ఇళ్లకు తీసుకు వెళ్లాలని కోరారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో విద్యుత్ టవర్ లైన్‌ల నిర్మాణం నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేలమూరిపాడు, రాజీవ్‌కాలనీ, మధురానగర్, భిక్షాలు కాలనీ, ఒంగోలు రోడ్డులో మార్కెట్‌యార్డు నుంచి నల్లవాగు వద్ద కోల్డ్ స్టోరేజ్ వరకు నామ్ రోడ్డుకు రెండు వైపులా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈఈ దామోదరం తెలిపారు.



పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ సీఈవో బాలమ్మ, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి తదితరులు

సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అనుసరించాలి

మేదరమెట్లనవంబరు19:రైతులు సేంద్రియ పద్ధతులు పాటించి పంటలు సాగుచేయాలని జడ్పీ సీఈవో, అద్దంకి నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి పి. బాలమ్మ తెలిపారు. బుధవారం కొరిశపాడు మండల కార్యాలయంలో ప్రధాన మంత్రి కిసాన్ యోజన, అన్నదాతసుఖీభవ పథకం లైవ్ స్ట్రీమింగ్ కార్యక్రమంలో ఆమె అధికారుతో కలసి పాల్గొన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి రైతులు బయో ఫెర్టిలైజర్స్‌ను వినియోగించాలని ఆమె కోరారు. పురుగుమందుల అవశేషాలు ఉన్న పంట ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి ఇతర దేశాలు అనుమతించడంలేదన్నారు. మానవాళి ఆరోగ్య శ్రేయస్సు కోసం రైతులు సేంద్రియ వ్యవసాయంతో పంటలు పండించాలన్నారు.అన్నదాత సుఖీభవ ద్వారా మండలంలో 5,361 మంది రైతులకు, పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా 4,988 మంది రైతులకు నగదు రైతుల ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, మండల వ్యవసాయాధికారి రామ్మోహన్‌రెడ్డి,సాదినేని మస్తాన్‌రావు, సాదినేని శ్రీనివాసరావు , మహిళారైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించిన తహసీల్దార్

బల్లికురవ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీబవ పథకంను బుధవారం తహసీల్దార్ రవినాయక్ గుంటుపల్లి రైతు సేవా కేంద్రంలో ప్రారంభించారు. మండలంలోని 21 పంచాయతీలలో ఉన్న 9,150 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో ఒక్కొక్కరికి రూ. 5 వేల వంతున నగదు వారి ఖాతాలో ప్రభుత్వం జమచేస్తుందన్నారు. అలానే పీఎం కిసాన్ పథకంలో 8,367 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తుందని తహసీల్దార్ తెలిపారు.



కొండెక్కిన కూరగాయలు

● ధరాభారంతో తల్లడిల్లుతున్న సామాన్యులు
● అవకాశం చూసుకుని దండుకుంటున్న దళారులు

చీరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో కూరగాయల ధరలు కొండెక్కాయి. వాటి ధరలు ఏ మాత్రం సామాన్యులకు అందుబాటులోకి రావడం లేదు. రూ.500లు తీసుకుని మార్కెట్‌కు వెళితే సంచి అంతంత మాత్రంగానే నిండుతున్నది. ఏ కాయగూర చూసినా కిలో వందకు మించి తగ్గడం లేదు. ఇదిలా ఉంటే కొందరు దళారులు మార్కెట్‌లలో ఆడిందే ఆట, పాడిందే పాట అన్నచందంగా కొనుగోలు దారుల వద్ద డబ్బులు దండుకుంటున్నారు. లేని పోని ధరలు చూపి దగాకు పాల్పడుతున్నారు. సోమవారం చీరాల కూరగాయల మార్కెట్‌కు సెలవు కావడంతో ఆరోజిక చెప్పక్కర్లేదు. జనాలపై బాదుడే బాదుడు.

కూరగాయల ధరలు

పప్పు చిక్కుళ్లు	120
వంకాయ	80
దొండకాయ	80
దుంప	40
బీరకాయ	80
దోసకాయ	50
మిర్చి	50
టమోటా	60
ఫ్రెంచ్ బీన్స్	120
క్యాప్సికం	100
క్యారెట్	80
కాకరకాయ	80
గోరు చిక్కుళ్లు	80
బీట్ రూట్	80

సర్వే సక్రమంగా నిర్వహించాలి

చినగంజాం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఇంటింటికీ తిరిగి జాతీయ కుష్ఠు నివారణ సర్వే సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో అములవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల రికార్డులను, వైద్య సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. సంతరావూరు పీ.హెచ్.సీ వైద్యాధికారి కె.కీర్తిసరోజ్, హెచ్ఈవో యు.వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

మార్టూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలో ఉర్దూ పాఠశాలను బుధవారం మండల అకడమిక్ ఫోరం అధికారులు తనిఖీ చేశారు.స్కూలులోని వసతులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో యంఈవో లు వస్రామ్ నాయక్, ప్రేమలత,శ్రీరామ్మూర్తి,జి. కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

మహిళలు అన్ని రంగాలలో ముందుకు..

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి):మహిళలు అన్ని రంగాలలో ముందుకు వస్తున్నారని పలువురు మహిళా వక్తలు అన్నారు. జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక గ్రంథాలయం లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి పాలపర్తి జ్యోతిష్మతి, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యురాలు ధూళిపాళ్ల వెంకటరత్నం, గ్రంధి నాగరాజకుమారి, గ్రంథాలయ అధికారిణి వసుంధరాదేవి, కౌన్సిలర్ తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

చినగంజాం, : శాఖా గ్రంథాలయం చినగంజాంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మహిళా దినోత్సవం, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి గ్రంథపాలకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు, మహిళలు, విద్యార్థినులు నివాళులర్పించారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మనోరంజన్‌బాబు

నూరుశాతం అక్షరాస్యత సాధనకు కృషి

చినగంజాం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలో నూరు శాతం అక్షరాస్యత సాధించడానికి కృషి చేయాలని ఎంపీడీవో కె.ధనలక్ష్మి, వయోజన విద్య పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్‌బాబులు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో మండల పరిధిలోని ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్, మేట్స్, వలంటీర్ ఉపాధ్యాయులకు ఉల్లాస్- అక్షర ఆంధ్రపై బుధవారం జరిగిన శిక్షణలో వారు పాల్గొని మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఉపాధిహామీ పథకం శ్రామికులలో 15 సంవత్సరాలు దాటి చదువు రాని వయోజనులు 650 మందిని గుర్తించినట్లు తెలిపారు. వారి వివరాలను నమోదు చేసుకుని వారికి ఉపయోగపడేలా చదువు చెప్పేందుకు ప్రతి పది మంది అభ్యాసకులకు ఒక వలంటీర్ చొప్పున 65 మంది వలంటీర్ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు తెలిపారు.శిక్షణ అనంతరం ఉల్లాస్- అక్షరఆంధ్ర వాచకాలు, సాధనా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో జె.లక్ష్మీదేవి, జేఈ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, వలంటీర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న
మండల వ్యవసాయాధికారి కొ ర్రపాటి వెంకటకృష్ణ

ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలి

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి): రైతులు వరిధాన్యంను గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని గోపాలపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యం క్వింటా 2,389 రూపాయలకు, బి గ్రేడ్ ధాన్యం 2,369 రూపాయలకు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు గోతాలు, రవాణా కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కోటేశ్వరరావు, శివాని, యర్రా రాఘవయ్య, యర్రా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



చందలూరులో ఆర్థిక అక్షరాస్యతపై
ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాబృందం

రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు

పంగులూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు తక్కువ వడ్డీకి పంటరుణాలు, బంగారంపై రుణాలు అందజేస్తున్నట్లు ఇంకొల్లుశాఖ మేనేజర్ విజయకుమారి అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో బుధవారం సహకారబ్యాంక్ వ్యవసాయ, అనుబంధ రంగాలకు అందిస్తున్న సేవలగురించి కళాబృందం ప్రజలకు అవగాహన కల్పించింది. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, ఎస్.కె.సుభాని, సీఈవో శ్రీనుస్వామి, రైతులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

పర్చూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సంఘం నాయకుడు మామిడిపాక హరిప్రసాద్ అన్నారు. ఇంటర్నేషనల్ వైస్ ఫెడరేషన్ (ఐఐవీఎఫ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ ప్రసిడెంట్‌గా పర్చూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మామిడిపాక హరిప్రసాద్ నియమితులయ్యారు. బుధవారం విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఏపీ స్టేట్ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ రాకేష్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈసందర్భంగా పలువురు సంఘం నాయకులు, నేతలు హరిప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఐఐవీఎఫ్ కార్యదర్శి మోహనరావు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్ రాకేష్ నుంచి
నియామక పత్రం
అందుకుంటున్న హరిప్రసాద్

అస్తవ్యస్తంగా నామ్ రోడ్డు నిర్మాణం

ఒక వైపు ఎత్తు.. మరో వైపు పల్లం
అదుపు తప్పుతున్న ద్విచక్ర వాహనాలు
తరచూ ప్రమాదాలు

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. నామ్ రోడ్డు నిర్మాణ సమయంలో విస్తరించకుండా గతంలో ఉన్న రోడ్డునే మొక్కుబడిగా అభివృద్ధి చేశారు. దీంతో పలు చోట్ల రోడ్డు దెబ్బతినటంతో తాత్కాలిక మరమ్మతులు చేయటం పరిపాటి గా మారింది. అయితే అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ నుంచి భవానీసెంటర్ వరకు పలు చోట్ల నామ్ రోడ్డు ఎత్తు పల్లాలుగా ఉంది. కొంతభాగం ఎత్తుగా ఉంటే మిగతా భాగం పల్లంగా ఉంది. దీంతో వెనుక ఏదైనా వాహనం వస్తుందని ద్విచక్ర వాహన చోదకుడు రోడ్డు మధ్యలో నుంచి పక్కకు జరిగితే మోటార్‌సైకిల్ అదుపు తప్పినట్లే. రోడ్డు వాలు ఉండటంతో మోటార్ సైకిల్ పక్కకు వెళ్లి అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అద్దంకి పట్టణంలో తరచూ జరుగుతున్న ద్విచక్ర వాహన చోదకుల ప్రమాదాలను పరిశీలిస్తే అదుపు తప్పి పడిపోతున్నవే అధికంగా ఉంటున్నాయి. ప్రతి రెండు, మూడు రోజులకొక ప్రమాదం జరుగుతూనే ఉంది. అయితే ప్రాణాపాయాలు తక్కువగా ఉంటున్నప్పటికి క్షత గాత్రులు మాత్రం పెద్ద సంఖ్యలోనే ఉంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డు ఎత్తు పల్లాలు లేకుండా పునర్‌నిర్మాణం చేసే విధంగా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



అద్దంకిలోని పాత బస్టాండ్ సెంటర్‌లో
ఎత్తు పల్లాలతో ఉన్న నామ్ రోడ్డు



అద్దంకి లోని ఎస్‌బీఐ(ఏబీబీ) వద్ద
ఎత్తు పల్లాలుగా ఉన్న నామ్ రోడ్డు

అన్నదాతకు ఆర్థిక భరోసా

● ఖాతాల్లో నగదు జమతో
రైతుల్లో ఆనందం
● ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు/మార్టూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాలు వేలాది రైతు కుటుంబాలకు ఎంతగానో దోహదపడుతున్నాయని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం మార్టూరు మార్కెట్ యార్డ్‌లో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏలూరి రైతులతో కొంతసేపు ముచ్చటించారు. ముఖ్యమంత్రి తీసుకువచ్చిన అన్నదాత సుఖీభవ పథకం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. అనంతరం మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ప్రకృతి సేద్యం అవగాహన స్టాల్స్‌ను ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. ప్రకృతి సేద్యం సిబ్బందితో మాట్లాడారు.

రైతులకు మినీ ట్రాక్టర్లు అందజేత

సబ్సిడీపై రైతులకు మినీ ట్రాక్టర్లను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అందజేశారు. రైతుతో కలసి మినీ ట్రాక్టర్‌ను నడిపి అన్నదాతల్లో జోష్ నింపారు. అలాగేపౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు.

37,861 మంది రైతులకు లబ్ధి

రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు నియోజకవర్గంలో 37,861 మంది రైతులకు రూ.25.83 కోట్ల రూపాలయలు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ఈకార్యక్రమంలో పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి లవన్న, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏడీఏలు సుదర్శన్ రావు, ప్రవీణ, తహసీల్దార్ ప్రశాంతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి హనుమంతు నాయక్, మండలపార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సాగుకు ప్రోత్సాహం

అద్దంకి : వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా వారి బ్యాంక్ ఖాతాలలో డబ్బులు జమ చేస్తుందని ఏడీఏ ఎర్రాయం అన్నారు. మండలంలోని బొమ్మనంపాడు రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నిధులు జమ చేసే కార్యక్రమంను టీవీ లో అధికారులు, రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా ఏఓ వెంకట కృష్ణ మాట్లాడుతూ మండలంలో 9.578 మంది రైతులకు 7 వేల రూపాయలు చొప్పున 6.64 కోట్ల రూపాయలు బ్యాంక్ ఖాతాలలో జమ అయ్యాయన్నారు. నాగులపాడు సొసైటీ అధ్యక్షుడు ఏనుగంటి వెంకటరామయ్య(బాబు), కామేపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా అద్దంకి నియోజకవర్గంలో 40,228 మంది రైతులకు 27.62 కోట్ల రూపాయలు బ్యాంక్ ఖాతాలలో జమ అయ్యాయి.



బొమ్మనంపాడులో ఏర్పాటు చేసిన
సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ ఎర్రాయం

అన్నదాతలకు తోడ్పాటు

బోయినవారిపాలెం(చీరాల) : అన్నదాతలకు చేయూతనిచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా దృష్టిసారిస్తున్నట్లు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు చెప్పారు. బుధవారం అన్నదాత సుఖీభవ రెండవ విడత నిధులు విడుదల కార్యక్రమాన్ని మండల పరిధిలోని బోయినవారిపాలెంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలో 7,368 మంది రైతులకు గాను రూ.4.60 కోట్లు నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో వెంటనే జమ జరిగినట్లు వివరించారు. వీరిలో చీరాల మండలంకు సంబంధించి 4,418 మంది రైతులకు గాను రూ.2.79 కోట్లు, వేటపాలెం మండలంకు సంబంధించి 2,950 మంది రైతులకు రూ.1.81 లక్షలు జమ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దనరావు, హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, ఎంపీవోలు సరిత, నిర్మలాదేవీ, తదితర రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మార్టూరులో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ చెక్‌ను
అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

చినగంజాంలో..

చినగంజాం : మండల పరిధిలోని 4,810 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా మూడు కోట్ల 15 లక్షల రూపాయిలు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.



బోయినవారిపాలెంలో
సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

శివాలయాలలో కార్తీక మాస పూజలు

నేడు వేయి స్తంభాలగుడిలో అన్నాభిషేకం

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి):కార్తీక మాసం సందర్భంగా శివాలయాలలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని వేయిస్తంభాల గుడి, పాత శివాలయం, కమలేశ్వరాలయంలలో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని మణికేశ్వరం మలేశ్వరస్వామి, ధర్మవరంలో భీమలింగేశ్వరాలయంలలో ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాసం చివరి రోజు గురువారం అద్దంకి పట్టణంలోని వేయిస్తంభాల గుడిలో ఉదయం 8 గంటలకు నగరేశ్వరస్వామికి అన్నాభిషేకం వైభవంగా జరుగుతుందని పూజారి సత్యనారాయణ శర్మ తెలిపారు.



దర్మవరంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం

ఇంకొల్లులో అయ్యప్పస్వామి నగరోత్సవం

కేరళ వాయిద్యాలతో
అత్యంత వైభవంగా
నిర్వహణ

ఇంకొల్లు,నవంబరు 19,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో అయప్పస్వామి నగరోత్సవం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇంకొల్లు అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి విగ్రహాన్ని స్థానిక శివాలయం నుంచి పర్చూరు రోడ్డు వైజంక్షన్ మీదగా ప్రధాన వీధులలో విద్యుత్ కాంతుల నడుమ కేరళ వాయిద్యాలతో అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.స్వాములకు భిక్ష నిర్వహించారు.అయ్యప్ప భజన,మహిళలతో నిర్వహించిన కోలాటం అలరించాయి.



అయ్యప్ప స్వామి విగ్రహంతో
నగరోత్సవం నిర్వహిస్తున్న దీక్షాధారులు

దివ్యాంగ చిన్నారికి బూటు కాలు అందజేత

జాండ్రపేట(చీరాల), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అంగవైకల్యం గల చిన్నారులకు అన్ని విధాలుగా సహాయక చర్యలు అందిస్తున్నట్లు జిల్లా ఇన్‌క్ల్యూజివ్ ఎడ్యుకేషన్ అధికారి ఎం జ్యోత్స్న అన్నారు. మండల పరిధిలోని జాండ్రపేటకు చెందిన 11 ఏళ్ల చిన్నారి కోట వాసవీ అంగవైకల్యంతో ఇబ్బంది పడుతుండటంతో జ్యోత్స్న రూ.15 వేల సొంత నిధులతో బూటు కాలు అందజేశారు. అలాగే చదువుకునేందుకు కూడా సహకరిస్తానని చిన్నారి తండ్రి సంజీవరెడ్డికి చెప్పడంతో కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు మల్లికార్జునరావు, ఎమ్‌ఈవో 2 సుధారాణి, సహిత ఉపాధ్యాయులు డి. రాజశేఖర్ పాల్గొన్నారు.



చిన్నారికి బూటు కాలును
అందిస్తున్న జిల్లా అధికారి జ్యోత్స్న

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీలు

చీరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యం నేరమని ఆ శాఖ అధికారులు చెప్పారు. బుధవారం చీరాల డివిజన్ పరిధిలో పలుచోట్ల పోల్ టు పోల్ తనిఖీలు జరిగాయి. ఈసందర్భంగా అదనపు లోడ్ వినియోగిస్తున్న వారి నుంచి రూ2.95 లక్షలు, ఇతర కేసులకు సంబంధించి రూ3.45 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఈ జాన్ థామస్, డీఈఈ హరిప్రసాదరావు, ఏఈలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు మృతి

మార్టూరు,నవంబరు19(ఆంధ్రజ్యోతి):పట్టణంలో తూర్పుబజారుకు చెందిన టీడీపీ నాయకుడు బాజిన సంజీవరావు (66) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్యఇద్దరు కుమారులు ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో ఆయన మండల టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు.బుధవారం ఆయన మృతదేహానికి పార్టీనాయకులు తొం డెపు ఆదినారాయణ,షేక్ రజాక్, కామినేని జనార్దన్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని సీఐటీయూ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు కొండారెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్యభవన్‌లో బుధవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌ల ఉమ్మడి సమావేశం జరిగింది. అనంతరం విద్యుత్‌భవన్‌లో ఈఈ నల్లూరి మస్తాన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌ల నేతలు దాసరి సుబ్రహ్మణ్యం, గుత్తికొండ శ్రీను, నరేష్, వినోద్‌కుమార్, సాంబ, అబ్దుల్లా, కోటేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేలమూరిపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం

అద్దంకి,నవంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలమూరిపాడులో బుధవారం ఒంగోలు స్మార్ట్ విజన్ ఐ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి కంటి పరీక్షలు చేసి 30 మందికి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో గోపిచంద్, మాధవన్, సోమయ్య పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● అధికారులతో కలెక్టర్ వినోద్‌కుమార్

చీరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గం పరిధిలోని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చీరాల ప్రభుత్వ వైద్యశాలలో అత్యాధునిక వైద్యం అందించేందుకు 16వ ఆర్థిక సంఘం నిధులు రూ23.75 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం జరుగుతున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది మే నెలలో యూనిట్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే ఏపీ ఎంఐడీసీ అధికారులు ప్రతివారం పనులకు సంబంధించిన నివేదిక అందజేయాలని సూచించారు. అలాగే వాడరేవు - చిలకలూరిపేట 167 ఏ జాతీయ రహదారి నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని ఆయా శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతం చీరాల పరిధిలోని ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద ఆర్వోబి (రైల్వే ఓవర్ బ్రిడ్జి) పనులు మాత్రమే పెండింగ్ ఉన్నాయని, మిగిలిన పనులు దాదాపుగా పూర్తయినట్లు తెలుసుకుని దాని విషయమై సికింద్రాబాద్ రైల్వే చీఫ్ ఇంజనీర్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇదిలా ఉంటే ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలో రూ.27.5 లక్షలతో ఆటిజం సెంటర్ నిర్వహణ సక్రమంగా ఉండాలని, ప్రత్యేక అవసరాలున్న చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.



కుందురులో నూతనంగా నిర్మిస్తున్న గృహాన్ని పరిశీలిస్తున్న
హౌసింగ్ ఏఈ ఎర్రకోటయ్య

కుందుర్రులో హౌసింగ్ సర్వే

సంతమాగులూరు నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద ఈ నెల 12వ తేదీ నుంచి 30వ తేదీ వరకు హౌసింగ్ సర్వే నిర్వహిస్తున్నామని హౌసింగ్ ఏఈ అనంతవరపు ఎర్రకోటయ్య తెలిపారు. బుధవారం మండలంలోని కుందుర్రు గ్రామంలో ఆయన సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఇళ్లు లేని నిజమైన లబ్ధిదారుల్ని గుర్తిస్తామన్నారు. మండలంలో 12 వందల గృహాలు టార్గెట్ కాగా ఇప్పటికీ 350 గృహాలకు లబ్ధిదారులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న లబ్ధిదారులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.



చోరీ జరిగిన పోలేరమ్మ దేవాలయం (ఇన్‌సెట్లో) ఆంజనేయస్వామి
విగ్రహం వద్ద హుండీని రోడ్డు వెంబడి పడవేసి వెళ్లిన దొంగలు

కొత్తపాలెంలో రెండు దేవాలయాలలో చోరీ

● ఆరు గుడి గంటలు, హుండీలో నగదు అపహరణ

బల్లికురవ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఉన్న పోలేరమ్మ దేవాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీలకు పాల్పడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు పోలరమ్మ దేవాలయం లోపల దాతలు ఇచ్చిన విలువైన ఆరు గంటలు, హుండీలో సుమారు రూ. 10 వేల నగదును దొంగలు చోరీ చేశారు. దేవాలయం ఇనుప గేట్లు తాళాలు పగులగొట్టి దేవాలయంలోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. రోడ్డు వెంబడి ఉన్న అంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న హుండీని తీసుకు వెళ్లిన దొంగలు అందులో ఉన్న నగదును తీసుకుని హుండీని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం రెండో గేటు ఎదురుగా ఉన్న రోడ్డు మార్జిన్‌లో పడేసి వెళ్లి పోయారు. రెండు దేవాలయాలలో చోరీలు జరగటంతో గ్రామస్థులు అప్రమత్తం అయ్యారు. దేవాలయాలలో జరిగిన చోరీలపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

● వేటపాలెం పోలీసులు కేసు నమోదు

వేటపాలెం(చీరాల), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అనుమనస్పద స్థితిలో మృతిచెందాడు. ఈసంఘటన బుధవారం వేటపాలెం గ్రామంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్టేషన్ సమీపానికి చెందిన బెల్లం హరిబాబు(37) బేల్దారీ కూలీ. ఇతనికి మూడేళ్ల క్రితం వెంకటేశ్వరమ్మతో ప్రేమ వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి రెండేళ్ల పాప ఉంది. బుధవారం అకస్మాత్తుగా మృతిచెందాడు. ఈక్రమంలో మృతుని తల్లి ఫిర్యాదు మేరకు వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. రెండు కుటుంబాలకు చెందిన వారిని స్టేషన్‌కు పిలిపించి సీఐ శేషగిరిరావు, ఎస్సై జనార్దన్ విచారణ చేపట్టారు.

టిప్పర్ బోల్తా తప్పిన ప్రమాదం

ఇంకొల్లు,నవంబరు 19,(ఆంధ్రజ్యోతి): వేగం వెళుతున్న టిప్పర్ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో తిరగబడిన ఘటన పావులూరు టు నాగండ్ల మధ్య చోటుచేసుకుంది. ఈ రహదారిలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండగా బుధవారం ఓ టిప్పర్ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించ బోయి అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోని పంట కాల్వలో బోల్తా కొట్టింది. స్వల్పగాయాలతో డ్రైవరు బయటపడ్డారు.




రోడ్డు మార్జిన్‌లో
బోల్తా పడిన టిప్పర్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

గురువారం 20 నవంబరు 2025



కు.నికి కొత్త మందు

అందుబాటులోకి ఇంజక్షన్

ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితం

ప్రచారం లేక ఈ విధానం అమలులో జాప్యం

- వివరాలు 8లో..



కలవాలి చేతులు.. ఫలించాలి ఆశలు

- నిరుపయోగంగా ఇఫ్కో కిసాన్ సెజ్ భూములు
- మెగా ఇండస్ట్రియల్ పార్కుకు అవకాశం
- ఎట్టకేలకు తొలగిన కోర్టు సమస్యలు
- ఉపాధి కోసం రైతుల ఎదురుచూపు

8

పరిశ్రమలు వస్తాయని.. ఉపాధి లభిస్తుందని.. జీవితాలు మెరుగుపడతాయని మూడు దశాబ్దాల నుంచి ఎదురుచూస్తున్న ఇఫ్కో కిసాన్ సెజ్ బాధితులకు నిరాశే ఎదురవుతోంది. రెండు దశాబ్దాలపాటు కోర్టుల్లో నడిచిన కేసులు ఎట్టకేలకు పరిష్కారమయ్యాయని సంతోషించాలో లేదా కేసులు క్లియర్ అయిన తర్వాత కూడా పరిశ్రమల ఏర్పాటులో అడుగులు ముందుకు పడడం లేదని బాధపడాలో అర్థం కావడం లేదని బాధిత రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. కిసాన్ సెజ్ భూములపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నతస్థాయిలో సమీక్షించి, కీలక నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'సోమశిల'లో 74.037 టీఎంసీల నిల్వ

అనంతసాగరం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయంలో నీటిమట్టం 74.037 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి 6,343 క్యూసెక్కుల ప్రవాహం డ్యాంలోకి వస్తోంది. దిగువ ఉత్తర కాలువకు 250, పవర్ టెన్నల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● **రాపూరు :** కండలేరు డ్యాంలో 58.02 టీఎంసీల నీరు ఉంది. సోమశిల నుంచి 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 680 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.



అధికారులతో తమ గోడు వెళ్లబోసుకుంటున్న మహిళా రైతులు

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాసం

కల్పిస్తేనే భూములిస్తాం!

- ఉన్న భూములు లాగేసుకుంటే ఎలా బతకాలి!?
- మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాల్సిందే
- తేల్చి చెప్పిన చెన్నాయపాలెం రైతులు
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్న అధికారులు

8

రైతుబజార్లలో అన్నదాతలకు

ఉచితంగా దుకాణాలు

● మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతు బజార్లలో వ్యాపారాలు సాగించాలని ఆసక్తి కలిగిన రైతులకు ఉచితంగా దుకాణాలు కేటాయిస్తామని మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత చెప్పారు. 'రైతుల్లేని బజార్లు' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. జిల్లాలోని రైతుబజార్లలో ఖాళీగా ఉన్న దుకాణాలను రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే రైతులు ఈ-పంట నమోదు చేసుకుని ఉండాలని పేర్కొన్నారు. కావలిలో రైతుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో దుకాణాలు సరిపోవడం లేదని, అక్కడ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. నెల్లూరులో వ్యాపారాలు సాగించేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. రోడ్డు మార్జిన్ వ్యాపారులకు రైతు బజార్లలో ఖాళీగా ఉన్న దుకాణాలను కేటాయించాలని జాయింట్ కలెక్టర్ కూడా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వస్తే దుకాణాలు కేటాయిస్తామని పేర్కొన్నారు.




ఆ రూట్‌లో వెళితే

దుమ్ము కొట్టుకోవాల్సిందే!


● కావలి- వింజమూరు రహదారి అంటేనే హడలిపోతున్న వాహనదారులు

కావలి నుంచి వింజమూరు మీదుగా సీతారామపురం వెళ్లే జాతీయ రహదారి అంటే వాహనదారులే కాదు.. ప్రజలు కూడా హడలి పోతున్నారు. ఈ మార్గంలో కనీసం ఆటో వెళ్లినా రేగుతున్న దుమ్ము కంటిలో నలుసుగా మారిపోతోంది. రహదారి పనుల్లో నాణ్యత లోపించడమే ఇందుకు కారణంగా స్థానికులు చెబుతున్నారు. రోడ్డు పనుల్లో వినియోగిస్తున్న గ్రావెల్ నుంచి దుమ్ము లేస్తుండటంతో ఎదుట వాహనాలు కనబడక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అంతేగాక కొన్నిచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఇవి కూడా ప్రమాదాలు నిలయాలుగా మారాయి. ఇక చిన్నపాటి వర్షానికే మార్జిన్‌లో మట్టి కోతకు గురవుతోంది. ఇటు ప్రజలు, అటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా స్థానిక అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టడమేగాకుండా దుమ్ము లేవకుండా ఎప్పటికప్పుడు ట్యాంకర్లతో నీళ్లు చల్లాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే వీలైనంత వరకు పనులు పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.

- వింజమూరు (ఆంధ్రజ్యోతి)



ఎప్పుడిస్తారో!?



పట్టాదారు పాసు పుస్తకాల కోసం రైతుల ఎదురుచూపు

మూడు నెలల క్రితమే జిల్లాకు చేరిన పుస్తకాలు

అప్పటి నుంచి రెవెన్యూ బీరువాల్లోనే..

అనేక పుస్తకాల్లో తప్పులు రావడంతోనే పంపిణీ ఆలస్యం

నెల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో రైతు పట్టాదారు పాసుపుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోను ముద్రించి ఇవ్వడాన్ని నాడు రైతులు ఎంత తీవ్రంగా వ్యతిరేకించారో అందరికీ తెలిసిందే. తమ భూమి పత్రంపై మరొకరి ఫొటో ఏమిటంటూ నాడు రైతులు గళమెత్తారు. గత ఎన్నికల్లో ఈ అంశం కూడా విపక్షాలకు పెద్ద ప్రచార అస్త్రంగా మారింది. తాము అధికారంలోకి వస్తే రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను ముద్రించి ఇస్తామని ఎన్డీఏ కూటమి హామీ కూడా ఇచ్చింది. చెప్పినట్లుగానే అధికారంలోకి రాగానే పాత పాసు పుస్తకాల స్థానంలో కొత్తవి ఇచ్చేందుకు నిర్ణయించింది. రాజముద్రతో కూడిన నూతన పాసుపుస్తకాలను ముద్రించి కొన్ని నెలల క్రితం జిల్లాకు పంపింది. గడిచిన మూడు, నాలుగు నెలల నుంచి దఫాల వారీగా ఈ పాసుపస్తకాలు జిల్లాకు చేరాయి. అయితే, రోజులు గడుస్తున్నా వాటి పంపిణీ మాత్రం జరగడం లేదు. అవన్నీ రెవెన్యూ కార్యాలయాల్లోని బీరువాలు, రికార్డుల రూముల్లో మూలుగుతున్నాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లోని రైతులకే కొత్త పాసుపుస్తకాలను ముద్రించారు. 235 గ్రామాల్లోని 1,05,620 మంది రైతులకు సంబంధించిన పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. కొన్ని ఆర్డీవో కార్యాలయాల్లోను, మరికొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ఉన్నాయి. వీటిని ఎందుకు పంపిణీ చేయడం లేదని అడిగితే మాకు ఇంకా ఆదేశాలు రాలేదంటూ సమాధానమిస్తున్నారు. రూ.కోట్లు ప్రజాధనాన్ని ఖర్చు చేసి నూతన పాసుపుస్తకాలు ముద్రించాక వాటిని రైతులకు అందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇన్నేసి పుస్తకాలు కార్యాలయాల్లో ఉండటం రెవెన్యూ సిబ్బందిని ఆందోళనకు గురిచేస్తోంది. వాటిని ఎక్కడ ఎలుకలు నాశనం చేస్తాయో లేక ఎక్కడ దెబ్బతింటాయోనని భయపడుతున్నారు. అయితే చాలా పాసుపుస్తకాల్లో తప్పులు ఉండటంతోనే పంపిణీ ప్రక్రియ ఆలస్యం జరుగుతోందన్న ప్రచారం జరుగుతోంది. వేల పాసుపుస్తకాల్లో తప్పులు దొర్లినట్లు రెవన్యూ వర్గాలు చెబుతున్నాయి. వాటిని సరిచేశాకనే పంపిణీ చేసే అవకాశమున్నట్లు భావిస్తున్నారు. మరి ఇదంతా ఎప్పటికి జరుగుతుందో చూడాలి.

ఆ చదువుల తల్లికి

ఏమైంది!?

'జవహర్ నవోదయ'లో విద్యార్థిని ఆత్మహత్య

8



ప్రణీత (ఫైల్)

చదువులోనే కాదు.. క్రీడల్లోనూ ఆ విద్యార్థిని ఘనత అమోఘం. ఆమె ప్రతిభను సహచర విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులూ ప్రశంసలు కురిపిస్తారు. ముందు రోజు రాత్రి కూడా తన తండ్రితో ఎంతో సంతోషంగా మాట్లాడిన బాలికకు ఏమైందో ఏమో ఉరికి వేలాడింది. మర్రిపాడు మండలం కృష్ణాపురం నవోదయ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థిని ప్రణీత బుధవారం తెల్లవారుజామున మెట్ల గ్రిల్స్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు విద్యాలయానికి చేరుకుని గుండెల విసేలా రోదించారు. తన కుమార్తె ఆత్మహత్యపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని విద్యార్థిని తండ్రి రవి కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అన్నదాత సఖీభవ - పీఎం కిసాన్ మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, తదితరులు

రైతాంగం సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- సోమశిల హైలెవల్ కెనాల్‌ను త్వరగా పూర్తి చేస్తాం
- దేవదాయ శాఖ మంత్రి ఆనం వెల్లడి
- లబ్ధిదారుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నగదు జమ

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతాంగం సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2025-26 రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమం బుధవారం జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా జరిగింది. నియజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు చెక్కులను ఆవిష్కరించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి మంత్రి ఆనం పాల్గొని మాట్లాడారు. జిల్లా స్థాయిలో 1,96,866 మంది రైతులకు రూ.130.20 కోట్లు లబ్ధి చేకూరిందని అన్నారు. రైతులకు అండగా ఉంటూ, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం చంద్రబాబుకు ప్రజలు తోడుగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరు, ఉదయగిరి మెట్ట ప్రాంత రైతుల కోసం సోమశిల హైలెవల్ కెనాల్ పనులను మొదలు పెట్టేందుకు, ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ఎంపీ వేమిరెడ్డితో కలిసి కృషి చేస్తానని తెలిపారు. ఈ రెండు సమస్యలపై ఇప్పటికే సీఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తయితే మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని, 90 వేల మందికి తాగునీరు, 65 వేల ఎకరాలకు సాగునీరు అందుతాయని తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా సంక్షేమం, అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం పీ-4 కార్యక్రమంలో భాగంగా తన కుమార్తె ఆనం కైవల్యారెడ్డి దత్తత తీసుకున్న బంగారు కుటుంబం బొమ్మిరెడ్డి బాలు యోగ క్షేమాలను మంత్రి ఆనం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు, ఆర్డీవో పావని, వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీకి

మోక్షం

నెల్లూరు నగరంలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులు (ఫైల్)



- నగరంలో మిగిలిన పనులు చేపట్టేందుకు టెండర్లు
- రూ.110 కోట్లతో ఆహ్వానించిన పబ్లిక్ హెల్త్
- నెల్లూరు సర్కిల్‌కు రూ.450 కోట్ల యూఐడీఎఫ్ నిధులు
- ఏడు మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా పనులు

నెల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఆరేళ్లుగా భూగర్భ డ్రైనేజీ పథకానికి (యూజీడీ) పట్టిన గ్రహణం వీడింది. ఎట్టకేలకు నెల్లూరు నగరంలో అసంపూర్తి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. యూజీడీతోపాటు అసంపూర్తిగా ఉన్న తాగునీటి పథకం పనులనూ పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్(యూఐడీఎఫ్) నిధులతో పబ్లిక్ హెల్త్ అధికారులు తాజాగా టెండర్లు ఆహ్వానించారు. పబ్లిక్ హెల్త్ నెల్లూరు సర్కిల్‌కు రూ.450 కోట్లు మంజూరయ్యాయి. ఈ సర్కిల్ పరిధిలోని ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాలోని మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా పనులు, భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేసేందుకు ఈ నిధులను వినియోగిస్తున్నారు. నెల్లూరు, కావలి, కందుకూరు, గూడూరు, సూళ్లూరుపేట, పుత్తూరు, చిత్తూరు మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా పథకాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు టెండర్లు ఆహ్వానించారు. అలానే నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు సూళ్లూరుపేటలో మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిచే పనులను ఆ టెండర్‌లోనే కలిపారు. ఒక్క నెల్లూరు యూజీడీ పనులకే సుమారు రూ.110 కోట్లకుపైగా నిధులు ఖర్చు చేయనున్నట్లు పబ్లిక్ హెల్త్ అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి టెండర్ల దాఖలుకు బుధవారం గడువు ముగిసింది. టెక్నికల్ బిడ్ ఓపెన్ చేసిన అధికారులు.. మరో 3, 4 రోజుల్లో ప్రైస్ బిడ్ ఓపెన్ చేయనున్నారు. ఆ తర్వాత అగ్రిమెంట్ చేసుకొని పనులు మొదలు పెట్టనున్నారు. మరో నెల రోజుల్లో యూజీడీ, తాగునీటి అసంపూర్తి పనులు మొదలుపెట్టనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. రెండేళ్లలోపు ఈ పనులన్నింటినీ పూర్తి చేసి బృహత్తర పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

● **వైసీపీ హయాంలో నిర్వీర్యం**

నెల్లూరు నగరంలో యూజీడీ, తాగునీటి పథకాల నిర్మాణాలకు 2016లో అంకురార్పణ జరిగింది. రూ.645 కోట్లతో 420 కిలోమీటర్ల మేర భూగర్భ మురుగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, 2019 ఎన్నికల నాటికే 390 కి.మీ పూర్తి చేశారు. అలానే జనార్థన్‌రెడ్డి కాలనీ, అల్లీపురం, డ్రైవర్స్ కాలనీ, పొట్టేపాలెం వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాలను కూడా నాడే నిర్మించారు. మొత్తంగా 85 శాతం మేర యూజీడీ పనులు పూర్తయ్యాయి. అలానే ఇంటింటికీ మంచినీటిని కుళాయిల ద్వారా అందించే పథకాన్ని రూ.512 కోట్లతో చేపట్టారు. 724 కి.మీ మేర పైపులైన్ నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. ఈ పథకం పనులు కూడా దాదాపు 95 శాతం మేర పూర్తయ్యాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక యూజీడీ, తాగునీటి పథకం పనులకు బ్రేకులు పడ్డాయి. సుమారు రూ.వెయ్యి కోట్లు అప్పటికే ఖర్చు చేసినా నాటి సర్కారు మిగిలిన పూర్తి చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో యూజీడీ, తాగునీటి పథకాల పనుల్లో కదలిక వచ్చింది.

టెన్త్ పరీక్షల నిర్వహణలో మార్పులు

యూడైస్ నుంచే విద్యార్థుల వివరాలు

పాఠశాలల్లోనే పరీక్ష కేంద్రాల ఏర్పాట్లు

నెల్లూరు (విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పలు మార్పులు చేపడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల వివరాలన్నీ యూడైస్ నుంచి సేకరించడంతో పాటు నియమ, నిబంధనలను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయం పర్యవేక్షించనుంది. పరీక్ష కేంద్రాలను విద్యార్థులు సులువుగా గుర్తించేందుకు హాల్‌టికెట్లపై లోకేషన్ క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తున్నారు. అలాగే మాన్యువల్ నామినల్ రోల్‌కు స్వస్తి పలుకుతూ విద్యార్థుల వివరాలను సాంకేతిక పరిజ్ఞానంతో హెచ్ఎంలు యూడైస్ నుంచి తీసుకుని రాష్ట్ర పరీక్షల కార్యాలయం నుంచే నామినల్ రోల్ తయారు చేయనున్నారు. విద్యార్థుల వివరాలను అప్‌లోడ్ చేయడంతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రుల పేర్లు, వయసు, సబ్జెక్ట్ తదితర వివరాలను సరిచేసి పరీక్ష ఫీజు చెల్లించాలని, ఆధార్‌ను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

గత తప్పిదాలు జరగకూడదనే..

గత తప్పిదాలు పునరావృతం కాకుండా విద్యాశాఖ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. విద్యార్థుల వివరాలన్నీ యూడైస్ నుంచి సేకరించడంతోపాటు సిబ్బంది నియామకాలను డైరెక్టర్ కార్యాలయమే చేపట్టనున్నారు. విద్యార్థులు వివరాలన్నీ కూడా వారి తల్లిదండ్రుల పూర్తి ఆమోదంతోనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో టెన్త్ పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్ణయించిన రూ.125 మాత్రమే వసూలు చేయాలి. అంతకంటే అధికంగా వసూలు చేసినట్టు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులే నేరుగా ఫీజు చెల్లించేలా త్వరలో యాప్‌ను కూడా విడుదల చేయనున్నారు.

- జానకి రామయ్య, జిల్లా పరీక్షల విభాగం ఏడీ

● **అన్నీ పరిశీలించాకే..**

పరీక్షల నిర్వహణ కేంద్రాల నుంచే అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ సిబ్బంది నియామకాలు కూడా ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయం చేపడుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, మరో ఇద్దరు అధికారులు పాఠశాలలను, స్థానిక వసతులను పరిశీలించి పరీక్ష కేంద్రాలను నిర్ధారించాలి. వీటిని పరిశీలించిన ఉన్నతాధికారులు కమిటీ నిర్ణయించిన రీతిలో ఎంపిక చేసిన పాఠశాలలనే పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేయనున్నారు. అలాగే పరీక్షల నిర్వహణకు సంబంధించిన చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్ల నియామకాలన్నీ రాష్ట్ర కార్యాలయం నుంచే చేపట్టనున్నారు. దీనికి సంబంధించి గ్రేడ్-2 హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో తీసుకుని నియామకాల అనంతరం జాబితాను జిల్లాకు పంపించనున్నారు. అదేవిధంగా ఇంటర్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాలల్లోనే పరీక్షలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు.

స్మార్ట్ మీటర్లపై ప్రజల్లో అపోహలు తొలగించండి

● విద్యుత్ ఎస్ఈ రాఘువేంద్రం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని, అన్నీ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమర్చేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ రాఘువేంద్రం అధికారులను ఆదేశించారు. నెల్లూరు పట్టణ డివిజన్‌కు సంబంధించి విద్యుత్ భవన్‌లో ఆయన బుధవారం సమీక్ష జరిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల ఎలాంటి అదనపు చార్జీల భారం పడదని, మీటర్ బిగింపు సమయంలో ఎలాంటి ఖర్చులు కూడా ఉండవని ప్రజలకు తెలియజేయాలన్నారు. లోవోల్టేజీ సమస్య లేకుండా చూడాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గృహాలకు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీ కల్పించినందున దీనిపై ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి, ఈఈ శ్రీధర్ రెడ్డి, డీఈఈలు సునీల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 650

పంచాయతీ కార్యదర్శికి మెమో

వలేటివారిపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు మెమో జారీ చేసినట్లు ఎంపీడీవో శంకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన ఆ గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మినహా మిగిలిన సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావడంతో మెమో జారీ చేసినట్లు తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శంకర్‌రావు →

న్యూస్ బాక్స్

సాగు నీటిని వృథా చేయొద్దు

● ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి

లింగసముద్రం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులో సంవృద్ధిగా చేరిన నీటిని పొదుపుగా సాగునీటి అవసరాలకు వినియోగించాలని ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ డీ.వరలక్ష్మి చెప్పారు. బుధవారం ఆమె రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టులో నీటి మట్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ప్రాజెక్టు కుడి ఎడమ కాలువ తూముల నుంచి కాలువలకు విడుదలవుతున్న నీటి వివరాలు, గేట్ల పరిస్థితి గురించి ప్రాజెక్టు డీఈని అడిగి తెలుసుకున్నారు. అలాగే పైర్లకు నీటి నిర్వహణను సక్రమంగా పర్యేవేక్షించాలన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న కొంతమంది టెక్నికల్ ఏఈలను ఈ ప్రాజెక్టు వద్దకు తీసుకొని వచ్చి ప్రాజెక్టులోని గేట్లు నిర్మాణాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈలు ఎం.వెంకటేశ్వర్లు, పీ.శేషయ్య తదితరలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

● రూ.68,350 స్వాధీనం

ఉలవపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కరేడు పంచాయతీ పరిధిలోని టెంకాయచెట్లపాలెంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో తన సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించనట్లు ఎస్ఐ అంకమ్మ చెప్పారు. గ్రామంలో ముగ్గురు వ్యక్తులు పేటకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.68,350 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీఆర్‌కోటలో వైద్య శిబిరం

లింగసముద్రం, నంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీఆర్‌కోటలో బుధవారం పంటవారిపాలెంకు చెందిన ఎల్‌వీ ప్రసాదు కంటి వైద్యశాల వైద్యులు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకుడు బోయిళ్ల కొండపనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్ కంటి రోగులను పరీక్షించారు. వీరిలో 9 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్థారించారు. ఏడుగురికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు.

13న జాతీయ లోక్‌అదాలత్

కందుకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో డిసెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శోభ కోరారు. ఈ లోక్ అదాలత్‌లో రెవెన్యూ, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్, మున్సిపల్ కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యేలా ఆయా శాఖల అధికారులు, న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, చెక్‌బౌన్స్, భరణం, గృహహింస, రాజీపడదగిన క్రిమినల్ కేసులు కూడా పరిష్కరిస్తామని, కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భక్తులకు అన్నదానం

కొండాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరప్పాడులో ఉన్న కృష్ణ మందిరం 3వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం భక్తులకు అన్నదానం చేశారు. మందిరం నిర్మించిన గ్రామానికి చెందిన విడవలపాటి వెంకయ్య శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 96 ఏళ్ల వయస్సులోనూ శ్రీకృష్ణ భగవానుడికి సేవ చేసే అదృష్టం కలగడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బిట్రగుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బోగోలులోని పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ జడరాయ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ బోగోలు పట్టణ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీంతో అరవపాలెం, విశ్వనాథరావు పేట, రామస్వామిపాలెంకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు గమనించి తమకు సహకరించాలని తెలిపారు.

అన్నదాతల జీవితాల్లో ఆనందమే ఎన్‌డీఏ లక్ష్యం

కావలి(టౌన్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్నదాతల జీవితాల్లో ఆనందమే ఎన్‌డీఏ ప్రభుత్వాల లక్ష్యమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళీ కృష్ణ నాయుడు పేర్కొన్నారు. బుధవారం పట్టణ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000, కేంద్ర ప్రభుత్వం రూ.2,000 కలిపి రైతు ఖాతాల్లో రూ.7,000లను ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేయడం రైతులకు మరో పండగ లాంటిదన్నారు. ఈ సమావేశంలో టెలికమ్ సలహా మండలి సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు మందా కిరణ్, రాకేష్, పట్టణ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నది కూలదోశారు..!

● కొత్త షెడ్డు నిర్మాణం పిల్లర్లకే పరిమితం
● ముందుకు సాగని రైతుబజారు పనులు
● ఎండావానకు రైతులు, వ్యాపారుల అవస్థ



రైతుబజారులో వేసిన పిల్లర్ల వద్దనే కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

కావలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారాయి కావలి రైతు బజారు నిర్మాణ పనులు. రైతుబజారు మధ్యలో ఉన్న పాతషెడ్డును తొలగించి ముందు, వెనుక కలిపి రైతు బజారు ఆవరణం మొత్తం నూతనంగా షెడ్డు నిర్మించేందుకు రెండు టెండర్లు పిలిచారు. ఒక టెండర్ పూర్తి అయ్యి వర్క్ ఆర్డర్ కూడా ఇవ్వడంతో పాత షెడ్డును దక్షిణం వైపు పడగొట్టి కొత్త షెడ్డు నిర్మాణానికి పిల్లర్లు వేశారు. దీంతో చకచక పనులు అయిపోతాయని భావించారు. అయితే మొదటి నుంచి నిర్మాణ పనులపై అంత ఆసక్తి చూపని కాంట్రాక్టర్ చివరకు ఎమ్మెల్యే ఒత్తిడితో పనులు ప్రారంభించినా ఆ తర్వాత పనులు ఆపేశారు. దీంతో ఉన్నది పోయి.. కొత్తది రాక.. వ్యాపారులు వానలో తడుస్తూ, ఎండలో ఎండుతూ వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. కావలి రైతు బజారుకు తొలివిడతగా వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధుల నుంచి రూ.45 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో ఈ ఏడాది జూలై 2వ తేదీన ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణలు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న రైతు బజారు పాత షెడ్లు స్థానంలో కొత్త నిర్మాణం చేపట్టేందుకు తొలుత నిధులు మంజూరు చేశారు. అయితే రైతు బజారు ముందు, వెనుక చాలా ఖాళీ స్థలం ఉండడంతో వర్షం వస్తే రైతు బజారులో వర్షం పడకుండా ముందు వెనుక కూడా కొత్త షెడ్లను నిర్మించే విధంగా మరో రూ.55 లక్షలు రైతు బజారు నిధుల నుంచి ప్రతి పాదనలు పంపారు. ఆ ప్రతిపాదనల మేరకు ఇంకా నిధులు మంజూరు కాక పోవడంతో శంకుస్థాపన శిలాఫలకం వేసి మూడున్నర నెలలు తర్వాత పనులు మొదలు పెట్టి పిల్లర్లు వేసి మళ్లీ నిలిపేశారు. రైతు బజారు ప్రస్తుతం వినియోగంలో ఉండడంతో వారిని అక్కడ నుంచి తాత్కాలికంగా దానికి ఎదురుగా ఉన్న మున్సిపల్ కూరగాయల మార్కెట్ స్థలంలోకి తరలించి అక్కడ నూతన నిర్మాణాలు చేపట్టాలని భావించారు. అయితే మున్సిపల్ కూరగాయల మార్కెట్ స్థలం కూడా కొందరికి మున్సిపల్ అధికారులు లీజ్‌కు ఇచ్చి ఉండడంతో అక్కడ ఉన్న వారిని తొలగించడం కుదరలేదు. దీంతో ఎట్టకేలకు రైతు బజారులో దక్షిణం వైపున ఉన్న దుకాణదారులను తొలగించి వారికి రైతుబజారులో ఖాళీగా ఉన్న ప్రాంతంలో స్థలం సర్దుబాటు చేసి దక్షిణం వైపున పిల్లర్లు వేయడానికి గుంటలు తీసి పిల్లర్లు నిలిపి కాంక్రీట్ పనులు చేపట్టారు, ఇది పూర్తి అయిన తర్వాత ఉత్తరం వైపున ఉన్న దుకాణాలను తొలగించి అక్కడ కూడా పిల్లర్లు వేసి మళ్లీ వారిని అక్కడే సర్దుబాటు చేసి పనులు కొనసాగించేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈ లోపు కొత్తగా ప్రతిపాదనలు పంపిన రూ.55 లక్షల నిధులు మంజూరైతే రైతు బజారు, వెనుక, ముందు మొత్తం కలుపుతూ రైతు బజారు ప్రాంగణం అంతా వర్షం పడకుండా షెడ్లు నిర్మాణాలు చేపట్టేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇలా రైతు బజారులో ఉన్న వ్యాపారులను బయటకు పంపకుండానే దాని నిర్మాణం చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టారే కానీ నిర్మాణ పనులు ఆదిలోనే ఆపేయడంతో వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.



రైతుబజారు ముందు ఎండలో చిరు వ్యాపారులు

ఆలస్యం చేస్తే చర్యలు తప్పవు

రైతు బజారు నిర్మాణంలో కొన్ని ఇబ్బందుల ఏర్పడిన కారణంగా పనులు ఆలస్యమైనట్లు కాంట్రాక్టర్ తెలిపారు. అయితే ఆలస్యానికి ఇప్పటికే కింట్రాక్టర్‌కు మూడు నోటీస్‌లు ఇచ్చాం. కొంత మేరకు పెనాల్టీ కూడా విధించాం. ఇంకా పనులు చేపట్టడంలో ఆలస్యం చేస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం.

- హరినారాయణరెడ్డి, మార్కెటింగ్ కమిటీ డీఈ, నెల్లూరు

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు గణిత ఉపాధ్యాయుడు



గణిత ఉపాధ్యాయుడు కొండలరావు

ఉలవపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరుగుతున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలలో జిల్లా తరుపున మండలంలోని రామాయపట్నం జడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు కేదారి కొండలరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈనెల 12న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ యోగా చాంపియన్ షిప్-25 పోటీల్లో పాల్గొన్న ఆయన జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాఠశాల సహచర ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

సమస్యలపై గళమెత్తిన సభ్యులు



మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

లింగసముద్రం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పలువురు సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో గళమెత్తారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అజెండాలోని అంశాలపై అధికారులు వివరించారు. ముక్తేశ్వరం గ్రామానికి రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నీరు రావడం లేదని, ఇంకా మంచినీటి పథకం మోటారు మరమ్మతులకు గురయ్యాయని సర్పంచు వంటేల శ్రీనివాసులు తెలిపారు. శింగరపాలెంలో మూడు నెలల నుంచి ఈ పథకం నీరు కాలనీకి రావడం లేదని ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు చెప్పారు. ఆర్ఆర్ పాలెంలో పశువుల తొట్టిపైనే మళ్లీ పశువుల తొట్టి నిర్మించారని సర్పంచు అంజమ్మ చెప్పారు. మాలకొండరాయునిపాలెంలో రీ సర్వే పూర్తయిందని, పాస్‌బుక్‌లు రాలేదని, దీంతో రుణాలు తీసుకోవడంలో ఇబ్బందులు వస్తున్నాయని శ్రీనివాసులు తహసీల్దార్ కోటేశ్వరరావు దృష్టికి తెచ్చారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలలో గ్రేజింగ్ భూముల వివరాలు అందజేయాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే.శ్రీనివాసులు, పీఆర్ ఏఈ సీహెచ్ రాజశేఖర్, ఏపీఓ సమీర్‌బాషా, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక బాధ్యత ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ మాల్యాద్రి

కావలి(టౌన్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే సామాజిక బాధ్యత కలిగి ఉండాలని జేబీ డిగ్రీ కళాశాల స్వయం ఉపాధి కోర్సుల సంచాలకుడు డాక్టర్ ఆర్ మాల్యాద్రి పేర్కొన్నారు. జేబీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం కావలి చెరువు కట్ట వద్ద గిరిజన కాలనీలో ఎన్ఎస్ఎస్ అధికారి అయాబ్ అహ్మద్ పర్యవేక్షణలో ప్రత్యేక ఎన్ఎస్ఎస్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాల్యాద్రి మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని, క్యాంప్‌లు నిర్వహించే ప్రాంతాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు, ప్రాథమిక ఆరోగ్యపు అలవాట్లపై అవగాహన కల్పించాలన్నారు. విశ్రాంత హిందీ అధ్యాపకుడు భాస్కర్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అంకితభావంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, టీవీ రమణ, స్థానికులు పాల్గొన్నారు.

దళితుల ఇళ్ల పట్టాలు దాచుకోవడం ఏమిటి?

వలేటివారిపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండసముద్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో 86 ఎస్సీ మాదిగ కుటుంబాలకు ఇచ్చిన పట్టాలను స్థానిక సర్పంచు దాచుకోవడం ఏమిటని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సురేష్‌బాబు ప్రశ్నించారు. మండలంలోని కొండసముద్రంలోని జగనన్న కాలనీని బుధవారం ఆయన లబ్ధిదారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ఇళ్ల పట్టాలను ఇవ్వాలని లబ్ధిదారులు ఆయనను అడిగినప్పుడల్లా నాదగ్గర ఉన్నాయి, వాటితో మీకేమిపని అని సర్పంచు అంటున్నారని లబ్ధిదారులు చెబుతున్నట్లు సురేష్‌బాబు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే సీపీఐ పోరాటం సాగిస్తుందని ఆయన అధికారులను హెచ్చరించారు.

వరద కాలువ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



వరద కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7వ వార్డు పరిధిలో శివసాయి పబ్లిక్ స్కూల్ నుంచి వాసవీ నగర్ కల్వర్టు వరకు రూ.78.5 లక్షలతో నిర్మించ తలపెట్టిన వరద కాలువ పనులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ఏడాదిన్నర కాలంలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో రోడ్ల వెడెల్పు కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో తోపుడు బండ్ల వ్యాపారులు ట్రాఫిక్ సమస్య నివారణకు సహకరించాలని, ప్రధాన రోడ్ల వెంబడి ఖాళీగా ఉన్న స్థలాలలో తోపుడుబండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చిన్న చిన్న వ్యాపారాలన్నీ ఒకేచోట ఉండేలా నెల్లూరులో ఏర్పాటు చేసిన స్మార్ట్‌బజార్ మోడల్‌ను తన సూచనతో మున్సిపల్ కమిషనర్ అనూష వెళ్లి పరిశీలించి వచ్చారని, అలాంటి స్మార్ట్ బ జార్‌ను త్వరలో కందుకూరులో ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. ఈ సందర్భంగా ఓవీ రోడ్డుకు దక్షిణం వైపు రూ.74 లక్షలతో నిర్మిస్తున్న వరదనీటి కాలువ పనులను ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, డీఈఈ గణపతి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, చిలకపాటి మధుబాబు, పోకూరి రాంబాబు, పిడికిటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● యూరియా కొరత రాకుండా పర్యవేక్షణ

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు యూరియా కొరత రాకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక సీటీఆర్ఐ కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం వర్చువల్‌గా నిర్వహించిన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులు విడుదల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ విడతగా రాష్ట్రప్రభుత్వం రూ. 5వేలు కేంద్ర ప్రభుత్వం రూ2 వేలతో కలిపి రూ.7వేలు రైతుల ఖాతాలకు జమచేశారన్నారు. కందుకూరు నియోజకవర్గంలో 32వేల మంది రైతులకు రూ.21.46 కోట్ల జమ అయ్యాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను, ఈ కార్యక్రమంలో సీటీఆర్ఐ హెడ్ అనూరాధ, కేవీకే హెడ్ ప్రసాద్‌బాబు, ఇంచార్జి ఏడీఏ శేషారెడ్డి, ఏవో అబ్దుల్‌రహీం, హెచ్‌వో జ్యోతి, ఐదు మండలాల ఏవోలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బోగోలులో జాతీయ ఐక్యతా దినోత్సవం



మాట్లాడుతున్న సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు

బిట్రగుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు పాల్గొని మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలికలు ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకొని ధైర్యంగా విద్య, సామాజిక సేవల్లో ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో ప్రతినిధి శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ రావు, ఏపీ ఎంఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు


● ఏఎంసీ చైర్‌పర్సన్ అలేఖ్య



అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కు అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ అలేఖ్య, టీడీపీ నేతలు

కావలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని కావలి ఏఎంసీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య కొనియాడారు. రైతుల సంతోషమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000, పీఎం కిసాన్ కింద రూ.2,000లను బుధవారం రైతుల ఖాతాలలో జమ చేశారన్నారు. ఈ సందర్భంగా మద్దూరుపాడులోని కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో బుధవారం రైతులతో కార్యక్రమం నిర్వహించారు. కావలి నియోజకవర్గంలో 18,305 మంది రైతులకు రూ.11,93,27,000 మెగా చెక్కును రైతులకు అందజేశారు. పీఎం నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న సేవలు రాయితీల గురించి వివరించారు. కావలి వ్యసాయమార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అందుతున్న సేవలను గురించి చైర్‌పర్సన్ అలేఖ్య వివరించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సహకారంతో మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మరింత సేవలను అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు, వ్యవసాయమార్కెట్‌కమిటీ సెక్రటరీ రామాంజనేయులు, వైస్ చైర్మన్ చెంచంగారి శ్రీనివాసులు, టీడీపీ నేతలు కండ్లగుంట మధుబాబు నాయుడు, జ్యోతిబాబూరావు, మాలేపాటి నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న హరికృష్ణ

అల్లూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుపూరు, పట్టణ పరిధిలోని రామాపురం గిరిజన కాలనీలలో నివాసం ఉంటున్న సుమారు 81 కుటుంబాలకు ఏఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ నిత్యావసరాలు, దుప్పట్లు సమకూర్చింది. వీటిని బుధవారం ఇందుపూరులో జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఎండేటి హరికృష్ణ రామాపురం గిరిజన కాలనీ జరిగిన కార్యక్రమంలో ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజరు స్వప్న, స్థానిక నాయకుడు జగన్మోహన్‌రావులు ముఖ్యఅతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో తోట శ్రీనివాసులు, సంస్థ ప్రతినిధులు ఏడుకొండలు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన అన్నదాత-సుఖీభవ, పీఎం కిసాన్ లైవ్ కార్యక్రమాన్ని అధికారులు, రైతులతో కలసి మండలంలోని వెలగపాడు సచివాలయం వద్ద వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు యూరియా బస్తాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యానపంటలు, ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలని కోరారు. ప్రభుత్వం ఇస్తున రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి సహకారంతో సోమశిల హైకెనాల్, వెలుగొండ ప్రాజెక్టుల ద్వారా నియోజకవర్గంలో సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చొరవతో పంచాయతీలకు విరివిగా నిధులు మంజూరవడంతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం రూ.1.75 కోట్లతో నిర్మించిన వెలగపాడు-కొత్తూరు రహదారి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, బీవీ రామారావు, దేవనబోయిన వెంకటసుబ్బయ్య, గన్నమనేని శ్రీనివాసులు, కర్నాటి ప్రభాకర్, గొల్లపూడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

● జోరుగా పొగనారుమడులు, జామాయిల్ సాగు



వెంగళాపురం గ్రేజింగ్ భూముల్లో సాగు చేసిన పొగాకు

లింగసముద్రం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గల ప్రభుత్వ భూముల్లో పైర్లు సాగు చేయవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆక్రమణదారులు వాటిని ఖాతరు చేయడం లేదు.గతంలో వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెం, లింగసముద్రం, పెంట్రాల ఆర్ఆర్ పాలెం, మొగిలిచెర్ల గ్రామాల్లోని పంచాయతీ గ్రేజింగ్ భూములు, అస్సైన్‌మెంటు, ఇతర ప్రభుత్వ భూముల్లో పొగాకు, జామాయిలు ఇతర పైర్ల సాగు చేయగా, అధికారులు ఆ భూముల్లో మరోసారి పైర్లు సాగు చేయవద్దని దండోరా వేయించారు. హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.అయినా భూ ఆక్రమణదారులు ఆ హెచ్చరికలను పెడచెవిన పెట్టి యథావిధిగా ఆ భూములలో పైర్లు సాగు చేస్తున్నారు. మండలంలోని వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెం, లింగసముద్రం, పెంట్రాలలో పంచాయతీ గ్రేజింగ్ భూములలో, ఆర్ఆర్ పాలెంలో కండేవారి బీడు, అలాగే అస్సైన్‌మెంటు భూములలో, మొగిలిచెర్లలో అస్సైన్‌మెంటు భూములు, గ్రేజింగ్ భూములలో ప్రస్తుతం పొగనార్లు, పొగాకు, జామాయిల్ తదితర పైర్లు సాగు చేస్తున్నారు.మరికొందరు ఆయా గ్రామాలలో ఈ భూములను కౌలుకిస్తూ దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు.సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'వెలుగొండ'లో కూంబింగ్



నెల్లూరు, కడప జిల్లాల సరిహద్దు ప్రాంతమైన రాపూరు అటవీ శాఖ అధికారులు డిప్యూటీ రేంజర్ మురళి ఆధ్వర్యంలో బుధవారం కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ రాపూరు నుంచి కోటూరుపల్లి, తెగచర్ల వరకు అడవిని జల్లెడ పట్టినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో ఎర్రచందనం మొక్కలను కాపాడుకునేందుకు అణువణువునా తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఎర్రచందనం నరకడం చట్ట రీత్యానేరమని, అటవీ ప్రాంతంలో అనుమానితులు ఎవరన్నా తారసపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కూంబింగ్‌లో బీట్ ఆఫీసర్లు ఫరీద్ (గోనుపల్లి), ఎం.ప్రవీణ్ (తెగచర్ల), బేస్ క్యాంపు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

- రాపూరు (ఆంధ్రజ్యోతి)

నాట్లు వేసి.. ఉత్సాహం నింపి!



బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాలలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాట్లు వేసి అందరిలో ఉత్సాహం నింపారు. బుధవారం రేబాలలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్యే కొడవలూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో మహిళా రైతు లలితమ్మ పొలంలో ఎమ్మెల్యేతోపాటు బుచ్చి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కోవూరు ఏడీ అనిత కూలీలతో కలిసి వరినాట్లు వేశారు.

- బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి)

గురుకులాల్లో పార్ట్ టైం లెక్చరర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఖాళీగా ఉన్న పార్ట్ టైం లెక్చరర్ ఉద్యోగాలకు అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ సీ ప్రభావతమ్మ ఓ ప్రకటనలో కోరారు. కండలేరు గురుకులంలో సివిక్స్, ఇంగ్లీష్, పీజీటీ మ్యాథ్స్, ఆదూరుపల్లి గురుకులంలో సోషల్ పీజీటీ పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండి, పీజీకి సంబంధించిన సబ్జెక్టుపై బీఈడీ అర్హత, టెట్ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆంగ్లభాషలో బోధన చేయాలని, ఆసక్తి గల వారు ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 24న ఉదయం 11 గంటలకు నెల్లూరులోని తమ కార్యాలయంలో డెమోకు హాజరు కావాలని తెలిపారు. .

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ,

పునరావాసం కల్పిస్తేనే భూములిస్తాం!

● తేల్చి చెప్పిన చెన్నాయపాలెం రైతులు ● ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్న అధికారులు



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్లు

కావలి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు అన్ని వసతులు ఉన్న చోట పునరావాసం కల్పిస్తేనే భూములు ఇస్తామని చెన్నాయపాలెం రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న బీపీసీఎల్ కంపెనీకి అవసరమైన భూసేకరణలో భాగంగా బుధవారం కావలి రూరల్ మండలం చెన్నాయపాలెంలో భూసేకరణపై జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మారిటైం బోర్డు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, కావలి తహసీల్దారు పీ. శ్రావణ్‌కుమార్‌లు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ భూములకు మొక్కుబడిగా ప్యాకేజీ ఇచ్చి భూములు లాగేసుకుంటే తామెలా బతకాలని ప్రశ్నించారు. భూములు లాక్కొని గ్రామం చుట్టూ ప్రహరీ కడితే గొర్రెలు, బర్రెలపై ఆధారపడి జీవించే వారు ఎలా బతకాలని నిలదీశారు. అలాగే బీపీసీఎల్ పరిశ్రమ వల్ల సముద్రంలో నీరు కలుషితమై మత్స్య సంపద కూడా పూర్తిగా తగ్గిపోతుందని, మత్స్యకారులు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి అన్ని వసతులు ఉన్న చోట పునరావాసం కల్పించడమేగాక ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా భూసేకరణ జరిగితే దినసరి కూలీలు, పశుసంపదను నమ్ముకుని జీవించేవారు రోడ్డున పడతారని అన్నారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రూ.20 లక్షల ప్యాకేజీకి ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వంతో మాట్లాడి ధర నిర్ణయించాలని అన్నారు. అనంతరం జేసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో రెండు దఫాలుగా భూసేకరణపై చర్చించినట్లు తెలిపారు. మారిటైం బోర్డు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ పోర్టుకు అనుసంధానంగా పరిశ్రమల ఏర్పాటుకు చేవూరు, రావూరు, చెన్నాయపాలెం, ఆనెమడుగులో భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. అందరి అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం పెంచేలా కృషి చేస్తామన్నారు.

కు.ని.కి కొత్త మందు

● అందుబాటులోకి ఇంజక్షన్ ● మహిళలకు మాత్రమే ఉపయోగం
● బయట మార్కెట్‌లో డోసు రూ.5 వేలు ● ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితం
● ప్రచారం లేక ఈ విధానం అమలులో జాప్యం



నెల్లూరు (వైద్యం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ (కు.ని)కు ఎన్నో పద్ధతులు ఉన్నాయి. అయితే ఆయా పద్ధతుల్లో కొన్ని ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పరిశోధనలు జరిపి, ఇంజక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇది ఆడవారికి మాత్రమే ఉపయోగపడుతుంది. మగవారికి ఇంజక్షన్ ఇంకా ప్రయోగదశలోనే ఉంది.ఈ నేపథ్యంలో తాజాగా కేంద్రం మిడ్రాక్స్ ప్రొజిస్టరాన్ అంత్రా ఇంజక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఇంజక్షన్ ధర మార్కెట్‌లోకి ఒక్కో డోసు రూ. 5వేలుగా ఉంది. మహిళలకు దీన్ని ఉచితంగా వేయాలని కేంద్రం నిర్ణయించింది.

● ఏటా 17 వేల కు.ని ఆపరేషన్లు

జిల్లాలో ఏటా 40 వేల ప్రసవాలు జరుగుతున్నాయి. అలాగే జిల్లాలో ఏటా 17 వేల కు.ని. ఆపరేషన్లు జరగాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇందుకోసం కు.ని ఆపరేషన్‌తోపాటు బిడ్డకు బిడ్డకు వ్యవధి రెండేళ్లు ఉండేలా ఈ ఇంజక్షన్ ఎంతో ప్రయోజనకారిగా ఉంది. దీనివల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవని వైద్యులు భరోసా ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రులకు ఈ ఇంజక్షన్‌లు వచ్చినా, వైద్యాధికారులు మాత్రం దీనిపై తగిన ప్రచారం చేయడంలేదు.దీంతో అనేక కుటుంబాలు ఈ ఇంజక్షన్‌కు దూరంగా ఉన్నాయి.

● ఎలా వేసుకోవాలి.. ఎవరిని సంప్రదించాలి ?

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మిడ్రాక్స్ ప్రొజిస్టరాన్ అంత్రా ఇంజక్షన్ కోసం ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ఇప్పటివరకు ఎంత మంది పిల్లలు ఉన్నారనే వివరాలు తెలియచేయాలి. అలాగే ఇంటి చిరునామాతోపాటు ఫోన్‌నంబరు ఇవ్వాలి. వైద్య సిబ్బంది అన్నీ వివరాలు నమోదు చేసుకున్న తర్వాత ఈ ఇంజక్షన్ వేస్తారు. కాన్పు అయినా ఆరువారాల తర్వాత మొదటి డోసు వేస్తారు. లేదంటే బహిస్టు తరువాత ఐదోరోజున ఈ ఇంజక్షన్‌ను వేస్తారు. బిడ్డబిడ్డకు ఎక్కువ వ్యవధి కావాల్సిన వారు దీన్ని వినియోగించుకోవచ్చు. ఇది నాలుగు నెలలవరకు పనిచేస్తుంది. ఆ తర్వాత మరో ఇంజక్షన్, ఇలా ఏడాదికి మూడు ఇంజక్షన్‌లు వేసుకుంటే ఏడాదిపాటు పిల్లలు పుట్టకుండా రక్షణ పొందవచ్చు. కు.ని. పద్ధతుల్లో ఇది మంచి ఫలితాలను ఇస్తున్నది. నెల్లూరు. జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగంలో ఈ ఇంజక్షన్‌ను అందుబాటులో ఉంచారు. అయితే 52 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీల్లో మాత్రం ఈ ఇంజక్షన్ అందుబాటులో లేదు. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితోపాటు కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులలోనూ అందుబాటులో ఉంచారు.

● ప్రైవేటుగా రేటు ఎక్కువే...

ప్రైవేట్ పరంగా ఔషధ దుకాణాల్లోనూ ఈ ఇంజక్షన్ అందుబాటులో ఉంది. అయితే ఇంజక్షన్ డోసుకు రూ. 5వేలు ఖర్చవుతుంది. మూడు నెలలు 3 డోసులకు రూ. 15వేలు ఖర్చు అవుతుంది. ఇంతఖర్చు పెట్టి పేద, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి. ఈ ఇంజక్షన్‌ను పీహెచ్‌సీలతోపాటు సీహెచ్‌సీల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలి. అలాగే వైద్యులు కూడా విస్తృత ప్రచారం కల్పించాలి.

అందుబాటులో ఇంజక్షన్



జిల్లావ్యాప్తంగా కు.ని.కి మిడ్రాక్స్ ప్రొజిస్టరాన్ అంత్రా ఇంజక్షన్‌లు అందుబాటులోకి వచ్చాయి. కు.ని.కి ఈ ఇంజక్షన్ వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. ఏడాదికి 4 నెలల పరిమితిలో ఈ ఇంజక్షన్ వేసుకోవచ్చు. కేవలం ఆడవారికి మాత్రమే ఇది పనిచేస్తుంది. అదే ప్రైవేట్ ఆసుపత్రుల్లో అయితే డోసుకు రూ. 5వేల ఖర్చు చేయాల్సి ఉంది. ప్రభుత్వం దీన్ని ఉచితంగా అందిస్తుంది. దీనిపై జిల్లా వ్యాప్తంగా ప్రచారం అవసరం ఎంతో అవసరం.

- డాక్టర్ వెంకటేశ్వర్లు,
కుటుంబ నియంత్రణ అధికారి

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు



నెల్లూరులోని ఓ లాడ్జీలో తనిఖీ చేస్తున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ సోమయ్య

నెల్లూరు(క్రైం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ, నేర నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో 1536 వాహనాలను తనిఖీ చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 36 మందిపై కేసులు నమోదు చేశారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు సంబంధించి 187 కేసులు నమోదు చేసి, రూ.1,39,685 అపరాధ రుసుము విధించారు. 15 వాహనాలు సీజ్ చేశారు. జిల్లాలోని 87 లాడ్జీలను తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపాన 167-బీజీ జాతీయ రహదారిపై గేదెను ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి చోటచేసుకొంది. వివరాల మేరకు.. ఉదయగిరి పట్టణానికి చెందిన షైదుకూరు శ్రీనివాసులు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం కృష్ణంపల్లి గ్రామానికి వెళ్లాడు. అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా సర్వరాబాదు గ్రామ సమీపాన రహదారిపై ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో దానిని ఢీకొట్టి బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో వారు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

కలవాలి చేతులు..ఫలించాలి ఆశలు

● నిరుపయోగంగా ఇఫ్కో కిసాన్ సెజ్ భూములు ● మెగా ఇండస్ట్రియల్ పార్కుకు అవకాశం
● ఎట్టకేలకు తొలగిన కోర్టు సమస్యలు ● ఉపాధి కోసం రైతుల ఎదురుచూపు



నెల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొడవలూరు- దగదర్తి మండలాల మధ్య రేగడిచెలక, రాచర్లపాడు గ్రామాల్లో 90వ దశకంలో ఇఫ్కో కిసాన్ సెజ్‌కు భూములు సేకరించారు. వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటు కోసం సుమారు 2700 ఎకరాలు అప్పగించారు. డెల్టా ప్రాంతంలో పుష్కలంగా పంటలు పండే భూములను రైతులు త్యాగం చేశారు. పరిశ్రమలు ఏర్పడితే తమ బిడ్డల భవిష్యత్తు బాగుపడుతుందని రైతులు ఆశపడ్డారు. అయితే అనుకున్న విధంగా కిసాన్ సెజ్ భూముల్లో పారిశ్రామికీకరణ జరగలేదు. తమకు పరిహారం చెల్లించకుండా భూములు తీసుకున్నారని కొందరు రైతులు కోర్టును ఆశ్రయించడంతో చాలా కాలంపాటు ఈ భూములు బీడుగా మారిపోయాయి. అయితే కొన్ని నెలల క్రితం ఈ కేసులన్నీ క్లియర్ అయ్యాయి. కిసాన్ సెజ్ భూములను పరిశ్రమలకు కేటాయించడంలో ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయి. అయినా ఇంకా ఆ భూముల్లో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేసే ప్రక్రియ ఆలస్యమవుతూ వస్తోంది.

● కీలక ప్రాంతం

కిసాన్ సెజ్ భూముల్లో మొదటగా ఏర్పాటైన పరిశ్రమ గమేశా. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో 150 ఎకరాల్లో ఈ పరిశ్రమను ప్రారంభించారు. ఆ తర్వాత ఎటువంటి పురోగతి కనిపించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పెట్టుబడిదారులు రాష్ట్రం వైపు చూస్తున్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో కూడా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపించారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల స్థాపనకు కిసాన్ సెజ్ భూములు చాలా అనుకూలమని పరిశ్రమల వర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి. అదే సమయంలో ఇఫ్కో కిసాన్ సెజ్ యాజమాన్యం కూడా మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వీలైనంత త్వరగా ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం కావాలని రైతులు కోరారు.

వంకి పెంచలయ్యకు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డుతో డాక్టర్ వంకి పెంచలయ్య

గూడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకోవడంతో బుధవారం ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. జైపూర్‌లో జరిగిన ఇంటర్‌నేషనల్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ 2025లో డాక్టర్ వంకి పెంచలయ్య విద్యారంగంలో చేస్తున్న సేవలను గుర్తించి గ్లోబల్ లీడర్ షిప్ ఫోరం అనే సంస్థ పవర్ టూ ఎంపవర్ లీడర్ అవార్డును ప్రదానం చేసింది. విద్యారంగంలో రూపాంతరాత్మక ఆలోచనలు, ఉన్నత ప్రమాణాల నాయకత్వం, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు, సమాజ అభివృద్ధి పట్ల డాక్టర్ పెంచలయ్య చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందుకున్నారు. దీంతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాద బీమా నగదు పంపిణీ



సీతారామపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వం కలిగి మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రమాదబీమా నగదు మంజూరైంది. గుండుపల్లి గ్రామానికి చెందిన నల్లమేకల వెంగయ్య మృతి చెందగా ఆయన భార్య నల్లమేకల రమణమ్మకు రూ.5లక్షలు ఇన్సూరెన్స్ చెక్కును బుధవారం మండల టీడీపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సుమన్‌బాబు, మాజీ కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, మండల యూత్ అధ్యక్షుడు వీకాష్‌బాబు, మండల ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ బాబు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు బదిలీలు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో స్పౌజ్ ఉద్యోగులకు అంతర్ జిల్లాల బదిలీల అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. జిల్లాలో రూరల్‌కు సంబంధించి 534, పట్టణ నగర ప్రాంతాలకు సంబంధించి 226 సచివాలయాలు ఉన్నాయి. మొత్తంగా 760 సచివాలయాలు ఉండగా, వీటికి సంబంధాంచి 6840మంది విధులు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీల్లో ఇటీవల జిల్లాలో సచివాలయ ఉద్యోగుల బదిలీలు జరిగినా, ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలు ఒక జిల్లాలో ఒకరు, మరో జిల్లాలో ఒకరు ఉంటున్నారు. ఈ ఇబ్బందిని ఉద్యోగసంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో అంతర్ జిల్లాల స్పౌజ్ బదిలీలకు అవకాశం కల్పించింది. సచివాలయాల్లోనే ఉద్యోగులు భార్యాభర్తలుగా ఉండడం, చెరొక జిల్లాలో ఉండడం, ఒకరు సచివాలయ ఉద్యోగి, మరొకరు అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారందరికీ ఒకే జిల్లాకు ఇద్దరు మారేలా బదిలీ అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీనికి సంబంధించి ఈనెల 30వరకు స్పౌజ్ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అలాగే జిల్లాలవారీగా ఎక్కెడక్కెడ ఏయే పోస్టులు ఖాళీలు ఉన్నాయో, అధికారులు గుర్తించి ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు. ఖాళీల ప్రకారం ర్యాంకులు, సీనియారిటీలను బట్టి ఆయా ప్రాంతాలకు బదిలీ చేయనున్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

నెల్లూరు (వైద్యం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాల సుధాకర్ అన్నారు. బుధవారం ఇందిరాగాంధీ 108వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు నగరంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఉన్న ఇందిర విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫయాజ్, ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, మోహన్‌రెడ్డి, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తి ప్రదాత్మ.

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఉపగ్రంథపాలకురాలు ఎస్ సునీత అధ్యక్షత వహించారు. విశ్రాంత గ్రంథపాలకురాలు ఆమంచర్ల రేవతి మాట్లాడుతూ ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని నేటి సమాజంలో మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని షేక్ సనా మహిళా అభ్యుదయం, మహిళలకు సమాన అవకాశాలపై చేసిన ప్రసంగం ఆకట్టు కుంది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరగనుంది.

230 మందికి కంటి వైద్య పరీక్షలు



వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వీపీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్ర వైద్య శిబిరంలో భాగంగా మండలంలోని కాంచెరువు, గువ్వాడి గ్రామాల్లో బుధవారం 230 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాంచెరువు గ్రామ టీడీపీ నాయకుడు పులివర్తి ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్యశిబిరంలో మహిళలు, వృద్ధులు అధికసంఖ్యలో పాల్గొని వైద్యసేవలను పొందారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆ చదువుల తల్లికి ఏమైంది!?

● 'జవహర్ నవోదయ'లో విద్యార్థిని ఆత్మహత్య ● అనుమానిస్తున్న మృతురాలి తండ్రి ● పూర్తిస్థాయిలో విచారించాలని వేడుకోలు



జవహర్ నవోదయ విద్యాలయం ముందు తల్లిదండ్రులు

మర్రిపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కావలి మండలం అటవి రాజుపాలెం గ్రామానికి చెందిన రవికుమార్, లక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. రవికుమార్ కొండాపురం ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. పెద్ద కుమార్తె ప్రణీత మర్రిపాడు మండలం కృష్ణాపురం నవోదయ విద్యాలయంలో పదో తరగతి చదువుతోంది.

● ఏం జరిగిందో ఏమో..

చదువులో ప్రణీత బాగా రాణిస్తోందని సహచర విద్యార్థులు తెలిపారు. అయితే, ఏం జరిగిందో ఏమో బుధవారం తెల్లవారుజామున విద్యాలయ భవనంలోని మెట్ల గ్రిల్స్‌కు నైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం సిబ్బంది గమనించి విద్యార్థిని తల్లిదండ్రులకు, ప్రిన్సిపాల్ పార్వతి పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే విద్యాలయానికి చేరుకున్న వారు తాడుకు వేలాడుతున్న మృతదేహాన్ని కిందకు దించారు. విగతజీవిగా పడిఉన్న కుమార్తె మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువుల గుండెలవిసేలా విలపించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు.

● నా బిడ్డ పిరికిది కాదు..

ఆత్మహత్య చేసుకునేంత పిరికిది తన బిడ్డ కాదని ప్రణీత తండ్రి రవికుమార్ కన్నీటి పర్యంతమయ్యాడు. మంగళవారం రాత్రి 10.20 గంటల ప్రాంతంలో నా బిడ్డ ఫోన్‌లో మాట్లాడింది. 'నాన్నా... రేపు నీ సబ్జెక్ట్ ఎగ్జామ్ రాస్తున్నానంటే ఆల్ ద బెస్ట్ అమ్మ. బాగా రాయ్.' అని చెప్పాను. ఆ తర్వాత ఏమైందో ఏమో తెల్లవారుజామున 4 గంటలకు స్కూల్ నుంచి ఫోన్ వచ్చింది. ఉరి వేసుకునేంత పిరికిదికాదు నా బిడ్డ. ఐఏఎస్ కావాలనే ధీమాతో చదువుతోంది. క్రీడల్లోనూ జాతీయ స్థాయిలో ఆడి విజయాలు సాధించింది. పరీక్షల సమయంలో తోటివారితో మనస్పర్ధలు ఉన్నట్లు గతంలో చెప్పింది. ఏదిఏమైనా నా కుమార్తె మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలి.' అని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

● విద్యాలయంలోకి నో ఎంట్రీ

విద్యార్థిని మృతితో విద్యాలయంలోకి ఎవరినీ అనుమతించకుండా ప్రధాన గేట్లు మూసివేశారు. దీంతో రహస్యంగా లోపల ఏం జరుగుతుంది. ఎందుకు అనుమతించలేదంటూ విద్యార్థి సంఘం నాయకుడు మహంత్ రెడ్డి తదితరులు ప్రశ్నిస్తూ నినాదాలు చేశారు.

● పర్యవేక్షణ కరువు?

నవోదయ విద్యాలయ నిర్వహణపై తల్లిదండ్రుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హాస్టల్లో ఫ్యాన్లు మరమ్మతులకు గురైతే పట్టించుకోరు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేదంటూ పలుమార్లు విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పుకుని బాధపడ్డారు. నిర్వహణపై ఎవరైనా ప్రశ్నిస్తే కక్షసాధింపులకు దిగుతున్నారని విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో భోజనం సక్రమంగా లేకపోవడంతో ఆకలి తీర్చుకునేందుకు కొందరు విద్యార్థులు గోడలు దూకి కృష్ణాపురం బస్టాండ్ సెంటర్‌లో ఫాస్ట్ ఫుడ్ షాపులకు వెళ్తున్నారు. ఇలా వెళ్లిన ఇద్దరు విద్యార్థులను ఇటీవల ఇళ్లకు పంపినట్లు సమాచారం. అంతేగాక విద్యాలయంలో బోధన సిబ్బంది దీర్ఘకాలంగా అక్కడే పనిచేస్తుండటంతో గ్రూపులు, వివాదాలు కూడా ఉన్నట్లు సమాచారం. ఇటీవల ప్రిన్సిపాల్ 6వ తరగతి విద్యార్థిని గోడకేసి కొట్టటంతో తీవ్ర గాయమైంది. తల్లిదండ్రుల ఆందోళనతో ఆమెను సస్పెండ్ చేశారు. ఈ ఘటన మరువక ముందే ప్రణీత మృతి విద్యార్థులలో కలవరం మొదలైంది.

డీకేడబ్ల్యూ కళాశాలలో షార్ట్ టర్మ్ కోర్సులు

నెల్లూరు(విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రధాన మంత్రి కౌశల్ యోజన ద్వారా నిరుద్యోగ యువతులకు షార్ట్ టర్మ్ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్, ఆపైన చదివిన యువతులకు మైక్రో ఇరిగేషన్ టెక్నీషియన్, సైబర్ సెక్యూరిటీ అండ్ సోషల్ మీడియా అనలిస్ట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సులను ఉచితంగా నేర్పిస్తామని తెలిపారు.

సతీష్ మరణంపై సీబీఐ దర్యాప్తు జరపాలి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : టీటీడీ పరకామణి కేసులో అప్పటి ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ మరణంపై సీబీఐ దర్యాప్తు చేయాలని ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా శాఖ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆయా సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేశారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సమాధి శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్‌ది అనుమానాస్పద మరణమన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ప్రభుత్వం తరఫున ఎవరూ పరామర్శించక పోవటం విచారకరమన్నారు.